


అనంత జనశక్తి
జనం కోసమే మా అక్షరం

30.08.2026
ఆదివారం | అనంతపురం
సంపుటి : 11 | సంచిక: 109
పేజీలు : 08 | వెల: రూ.5

AJS అనంత జనశక్తి జనం కోసమే మా అక్షరం

PUBLISHED BY ANANTAPUR, KADAPA, CHITTOR, VISAKHAPATNAM, SRIKAKULAM, EALLURU, TIRUPATHI, ONGOLE, VIJAYAWADA, NELLORE, PRAKASHAM, GUNTUR, KURNOOL.


# ఏజెన్సీ ప్రాంతానికి వస్తే కొత్త శక్తి, ఉత్సాహం

- సీఎం చంద్రబాబు నాయుడు వెల్లడి
- అరకు కాఫీకి ప్రపంచ స్థాయి గుర్తింపు
- అల్లూరి సేవలు ఎప్పటికీ మరవలేం
- సంజీవని యాప్ ఓ గేమ్ ఛేంజర్
- అనారోగ్యం వస్తే ఫోన్‌లోనే చెక్ చేసుకోవచ్చు
- ప్రతి గిరిజన బిడ్డకు మెరుగైన వైద్యం
- గిరిజనుల ఆరోగ్యం కాపాడే బాధ్యత మాది
- ఏజెన్సీల్లో మరికొన్ని సెల్ టవర్లు



పాడేరు, ఆగస్ట్ 29, అనంతజనశక్తి న్యూస్

ఏజెన్సీ ప్రాంతానికి వస్తే కొత్త శక్తి, ఉత్సాహం వస్తుందని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. అల్లూరు జిల్లా అరకులోయ మండలం గన్నెలలో ఏర్పాటు చేసిన సమావేశంలో సీఎం మాట్లాడుతూ.. అరకు కాఫీకి ప్రపంచస్థాయి గుర్తింపు తీసుకొచ్చామన్నారు. ఆ రోజుల్లోనే ఆయుర్వేద వైద్యం గిరిజనులకు అందించిన వ్యక్తి అల్లూరి సీతారామ రాజు. ఆయన సేవలకు గుర్తుగా భోగాపురం ఎయిర్‌పోర్టుకు ఆయన పేరు పెట్టాం. సంజీవని యాప్ ఓ గేమ్ ఛేంజర్. మీకు అనారోగ్యం వస్తే విశాఖ, పాడేరు వెళ్లాల్సి వచ్చేది. మీ ఆరోగ్యం మీ ఫోన్‌లో ఉంది. ఎక్కడికి వెళ్లినా మీ ఆరోగ్యం ఫోన్‌లో చెక్ చేసుకోవచ్చు. ప్రతి ఒక్క గిరిజన బిడ్డకు మెరుగైన ఆరోగ్యం ఇవ్వాలని సంకల్పించాం. గిరిజనుల ఆరోగ్యం కాపాడే బాధ్యత ఈ ప్రభుత్వానిది. ఏజెన్సీ ఏరియాలో మరికొన్ని సెల్‌టవర్లు పెట్టించి కనెక్టివిటీ పెంచుతాం.

గిరిజనుల ప్రతి ఒక్క సమస్యకు పరిష్కార మార్గం చూపిస్తాం. 3 నెలల్లో ఇక్కడ ఉన్న అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు మెరుగుపరుస్తాం. ఏ వైద్య పరీక్ష అయినా.. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో జరిపేలా ఏర్పాట్లు చేస్తాం. సూపర్ సిక్స్ సూపర్ హిట్ చేసిన ఘనత ఈ ప్రభుత్వానిదే. గిరిజనులకు 50 ఏళ్లకే పింఛన్లు ఇస్తున్నాం.. దీంతో నేను సంతృప్తి చెందడం లేదు. గిరిజన ప్రాంతంలో ఉన్న ఉద్యోగాలన్నీ గిరిజనులకే దక్కాలనేది ఈ ప్రభుత్వ విధానం. అందరికీ ఆమోదయోగ్యమైన జీవోను మళ్లీ తీసుకువస్తామని హామీ ఇస్తున్నా. వీలైనంత త్వరగా అన్నిగ్రామాలకు రోడ్లు వేసేలా చర్యలు తీసుకుంటాం. అరకు కాఫీకి ప్రపంచ స్థాయి గుర్తింపు తెచ్చాం. ఏజెన్సీ ప్రజలకు ఆదాయం అరకు కాఫీ, మిరియాల నుంచి వస్తోంది" అని సీఎం తెలిపారు.

### గ్రామస్థులతో మాటామంతీ..

గన్నెల పంచాయతీ ఆర్.కె.నగర్‌లో ప్రజలతో ముఖాముఖి నిర్వహించిన సీఎం చంద్రబాబు.. ప్రభుత్వం నుంచి అందుతున్న సేవలు, ఇతర అంశాలపై అడిగి తెలుసుకున్నారు. గర్భిణీతో మాట్లాడి వైద్య సేవలపై ఆరా తీశారు. ఈ గ్రామంలో 47 ఇళ్లు, 189 మంది జనాభా ఉండగా.. ఇక్కడ పాపులేషన్ మేనేజ్‌మెంట్ బాగుందని, అందుకు గల విధానాలను అడిగి తెలుసుకున్నారు. ఓ మహిళ తన కుమార్తె నీట్ శిక్షణలో ఉందని తెలుపగా.. శెభాష్ అన్న ముఖ్యమంత్రి.. అందరూ ఇదే స్ఫూర్తితో పిల్లలని చదివించాలన్నారు. మహిళలతో మాట్లాడుతూ పిల్లల భవిష్యత్తు కోసం ఏం చేస్తున్నారు.. ఏం చేయబోతున్నారు? అని ప్రశ్నించారు. ఆర్.కె.(రామకృష్ణ) నగర్ లో మొత్తం 16 మందితో మాట్లాడిన సీఎం... అందరి యోగ క్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం అమలుచేస్తున్న అన్ని పథకాలు మీ వరకు చేరుతున్నాయా అని ఆరా తీశారు. చంద్రబాబు రాకను పురస్కరించుకొని ఆర్.కె.నగర్ మహిళలు, చిన్నారులు థింసా నృత్యంతో స్వాగతం పలికారు.



2లో..

# బాధితులను ఆదుకోండి

- నేపాల్ విధ్వంసంతో ఇబ్బందులు
- నేపాల్‌తో సమన్వయంతో చేయండి: ఖర్గే



7లో..

# మరో రెండు పోరాటాలకు నేతలంతా సిద్ధం కావాలి

- పార్టీ నేతలతో బీజేపీ చీఫ్ రాంచందర్ రావు
- పార్టీని రాష్ట్రంలో బలోపేతం చేయాలి
- ప్రజా సమస్యలపై ప్రభుత్వంపై పోరాడాలి



హైదరాబాద్, ఆగస్ట్ 29, అనంతజనశక్తి న్యూస్

తెలంగాణలో తమ పార్టీని బలోపేతం చేసే దిశగా బీజేపీ కసరత్తులు చేస్తోంది. ప్రజా సమస్యలపై ఎప్పటికప్పుడు తమ గొంతుకను వినిపిస్తోంది.

2లో..

# ఒకే కుటుంబంలో నలుగురు ఆత్మహత్య

- విశాఖపట్నంలో విషాదకర ఘటన
- ప్రవీణ్ కుమార్ ఉరివేసుకుని..
- భార్యతో పాటు ఇద్దరు చిన్నారులు విషపదార్థం తిని ఆత్మహత్య

2లో..



# విదేశీ పర్యటనకు ప్రధాని మోదీ

## ఉజ్బెకిస్తాన్, కిర్గిజ్ రిపబ్లిక్‌లో కీలక పర్యటన



2లో..

న్యూఢిల్లీ, ఆగస్ట్ 29, అనంతజనశక్తి న్యూస్

ప్రధాని నరేంద్ర మోదీ రెండు దేశాల విదేశీ పర్యటనకు బయలుదేరనున్నారు. ఉజ్బెకిస్తాన్ అధ్యక్షుడు షవ్‌కత్ మిర్జియోయెవ్ ఆహ్వానం మేరకు ఆగస్టు 29, 30 తేదీల్లో ప్రధాని మోదీ ఉజ్బెకిస్తాన్‌లో ద్వైపాక్షిక పర్యటన చేయనున్నారు. తాష్కెంట్‌లో ఇరు దేశాల మధ్య వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేసే అంశాలపై కీలక చర్చలు జరగనున్నాయి.

# నేపాల్‌లో కొత్త సంక్షోభం..!

- 2,500 మందికి పైగా గల్లంతు
- మృతదేహాలు పూడ్చేందుకు స్థలం కరువు
- 600 దాటిన మృతులు
- మరణాలు ఇంకా పెరిగే అవకాశం

2లో..



కట్మాండు, ఆగస్ట్ 29, అనంతజనశక్తి న్యూస్

నేపాల్‌ను అతలాకుతలం చేసిన భారీ ఆకస్మిక వరదలు తీవ్ర విషాదాన్ని మిగిల్చాయి. వరదల కారణంగా మృతుల సంఖ్య 600 దాటగా, మరో 2,500 మందికి పైగా ఆచూకీ లేకుండా పోయారు. దీంతో సహాయక చర్యలకు మరో పెద్ద సమస్య ఎదురైంది. వరదల్లో మరణించిన వారి మృతదేహాలను భద్రపరిచేందుకు దేశంలోని మార్చురీల్లో సరిపడా స్థలం లేకపోవడంతో అధికారులు తాత్కాలిక ఏర్పాట్లు చేస్తున్నారు. భారత్, చైనా మధ్య ఉన్న భూపరివేష్టిత దేశమైన నేపాల్‌లోని మార్చురీలన్నింటి కలిపి సామర్థ్యం సుమారు 350 మృతదేహాలు మాత్రమే. అయితే మృతుల సంఖ్య ఇప్పటికే 600 దాటడంతో ఆసుపత్రులు, మార్చురీలు మృతదేహాలను భద్రపరచడంలో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయి.

# మున్సిపల్ చట్ట సవరణకు గవర్నర్ ఆమోదం

- కార్పొరేషన్లు, మున్సిపాలిటీల్లో..
- ప్రత్యక్ష ఎన్నికలకు సంబంధించి..
- స్థానిక సంస్థల పాలనలో పలు మార్పులు

2లో..



# వచ్చేది కాంగ్రెస్ ప్రభుత్వమే

- బీఆర్ఎస్‌పై మంత్రి పొంగులేటి ఫైర్



2లో..

# పుజల్ జైలులో విజయ్ సడన్ ఇన్‌స్పెక్షన్

- ఆసుపత్రి, లైబ్రరీ, కంప్యూటర్ సెంటర్ తనిఖీ
- ఖైదీల ఆహారం, వైద్య సదుపాయాలపై సమీక్ష



2లో..

చెన్నై, ఆగస్ట్ 29, అనంతజనశక్తి న్యూస్

చెన్నైలోని పుజల్ సెంట్రల్ జైలులో తమిళనాడు ముఖ్యమంత్రి విజయ్ ఆకస్మికంగా తనిఖీ నిర్వహించారు. దేశంలోని అతిపెద్ద జైలు సముదాయాల్లో ఒకటైన పుజల్ జైలును సందర్శించిన సీఎం.. అక్కడ ఖైదీలకు అందుతున్న సౌకర్యాలు, ఆహారం, వైద్య సేవలు, మౌలిక వసతులు, పునరావాస కార్యక్రమాలను స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా జైలు అధికారులతో మాట్లాడిన ముఖ్యమంత్రి విజయ్.. ఖైదీల సంక్షేమానికి తీసుకుంటున్న చర్యలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు.

# జగన్‌కు నమ్మక ద్రోహం చేయలేదు

- ఇప్పుడు వైసీపీలో నంబర్ 1 సజ్జలనే
- విజయసాయి రెడ్డి బహిరంగ లేఖ
- నా రక్తంలోనే నమ్మకద్రోహం లేదు
- కేసుల్లో పేర్లు.. కోటరీ కుట్రలు

హైదరాబాద్, ఆగస్ట్ 29, అనంతజనశక్తి న్యూస్

వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో అంతర్గత విభేదాలు, అధికార సమీకరణాలపై మాజీ ఎంపీ విజయసాయిరెడ్డి బహిరంగ లేఖ రాశారు. పార్టీలో సజ్జల రామకృష్ణారెడ్డి కోటరీ వల్ల తనకు జరిగిన అవమానాలు, పార్టీ వీడటానికి గల కారణాలను ఆయన ఐదు పేజీల లేఖలో సమగ్రంగా వెల్లడించారు. సోషల్ మీడియాలో తనపై "నమ్మకద్రోహి" అని వైసీపీ కోటరీ చేస్తున్న దుష్ప్రచారానికి ఈ లేఖ ద్వారా కౌంటర్ ఇచ్చారు.



2లో..

# తెలంగాణ క్యాబినెట్‌ను పునర్వ్యవస్థీకరించాలి

- శాసన మండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి
- ప్రభుత్వ పాలనపై ప్రజలు హ్యాపీ
- రేవంత్ యువకుడు, ఉత్సాహవంతుడు
- ముఖ్యమంత్రిని పని చేసుకోనివ్వాలి



2లో..

హైదరాబాద్, ఆగస్ట్ 29, అనంతజనశక్తి న్యూస్

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై శాసన మండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి వ్యాఖ్యలు చేశారు. రేవంత్ రెడ్డి యువకుడు, ఉత్సాహవంతుడని అన్నారు. ముఖ్యమంత్రిని పని చేసుకోనివ్వాలని, ఆటంకాలు సృష్టించకూడదని చెప్పారు. కాంగ్రెస్ క్యాడర్‌లో అసంతృప్తి ఉందని.. ప్రజలు సంతృప్తికరంగానే ఉన్నారన్నారు.

# జగన్‌కు నమ్మక ద్రోహం చేయలేదు

(మొదటి పేజీ తరువాయి)



"నేను నమ్మకద్రోహినే అయితే ఆనాడే సజ్జల మాదిరిగా కాంగ్రెస్‌తో సంధి చేసుకుని, సీబీఐ, ఈడీ ఛార్జ్‌షీట్లలో నా పేరు లేకుండా చేసుకునే వాడిని" అని విజయసాయిరెడ్డి తన లేఖలో వ్యాఖ్యానించారు. జగన్‌కు అత్యంత నమ్మకస్తుడిగా ఉన్నందుకే ఆయనతో పాటు ప్రతి ఛార్జ్‌షీట్‌లో తనను ఎ2గా చేర్చారని గుర్తుచేశారు. వైఎస్ జగన్ 16 నెలలు జైల్లో ఉంటే, తాను కూడా 15 నెలలు జైలు జీవితం గడిపానని, నమ్మకద్రోహం చేసే మనస్తత్వమే ఉంటే ఆనాడే అప్రూవర్‌గా మారేవాడినని స్పష్టం చేశారు.

**కేసుల్లో పేర్లు.. కోటరీ కుట్రలు**

2024 ఎన్నికల తర్వాత కూడా తనకు ఎలాంటి సంబంధం లేని లిక్కర్ స్కామ్‌లో A5గా, కాకినాడ సీపోర్టు కేసులో A2గా తన పేరును చేర్చారని విజయసాయిరెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వంలో "సకల శాఖ మంత్రి" పేరు మాత్రం ఏ ఛార్జ్‌షీట్‌లోనూ లేకపోవడంపై ఆయన అనుమానాలు వ్యక్తం చేశారు. జగన్మోహన్ రెడ్డికి తెలియకుండా వెన్నుపోటు పొడుస్తూ, కేసులు లేకుండా ఎలా బయటపడాలో అక్కడ ఉన్న కోటరీ నాయకుడికి బాగా తెలుసని ధ్వజమెత్తారు.

**సజ్జలే పార్టీకి నంబర్ 1...**

వైసీపీలో ప్రస్తుత పరిస్థితులను విశ్లేషిస్తూ, "ఇప్పుడు ఆ పార్టీలో నంబర్ 2 జగన్ అయితే, నంబర్ 1 సకల శాఖల మంత్రి సజ్జల" అని తీవ్రంగా వ్యాఖ్యానించారు. 2019 విజయాల తర్వాత సజ్జల రాజ్యాంగేతర శక్తిగా మారి, మంత్రులు, ఎమ్మెల్యేలకు కూడా జగన్ అపాయింట్‌మెంట్ దక్కకుండా గోడ కట్టారని ఆరోపించారు. 2022 మంగళగిరి ప్లీనరీలో సకల శాఖ మంత్రి తనపై భౌతికంగా దాడి చేసినా జగన్ ప్రేక్షకపాత్ర వహించారని, ఆ తర్వాత వరుసగా రీజినల్ కోఆర్డినేటర్, జిల్లా ఇన్చార్జ్, అనుబంధ సంఘాల ఇన్చార్జ్ బాధ్యతల నుంచి తనను తప్పించి అవమానించారని ఆవేదన వ్యక్తం చేశారు. తన ఆత్మగౌరవాన్ని చంపుకుని సజ్జల కింద పనిచేయడం ఇష్టం లేకనే నాలుగేళ్ల రాజ్యసభ పదవీ కాలాన్ని, పార్టీని వదులుకున్నానని విజయసాయిరెడ్డి స్పష్టం చేశారు. తాను ఎప్పటికీ జగన్‌కు నమ్మకద్రోహం చేయలేదని... చేయబోనని స్పష్టం చేస్తూ, త్వరలోనే కొత్త పార్టీ పెట్టబోతున్నట్లు సూచనప్రాయంగా వెల్లడించారు.

# మరో రెండు పోరాటాలకు నేతలంతా సిద్ధం కావాలి

(మొదటిపేజీ తరువాయి)



ఈ మేరకు ఆ పార్టీ చీఫ్ రాంచందర్ రావు అధ్యక్షతన ఫీజు బకాయిల చెల్లింపు కోసం ఇటీవల దీక్ష నిర్వహించిన విషయం తెలిసిందే. మరో రెండు పోరాటాలకు బీజేపీ నాయకులు సన్నద్ధమవుతున్నారు.

22ఏలో చేర్చిన భూమి సంబంధించిన బాధితులకు అండగా నిలిచేందుకు వచ్చే నెల 5,6 తేదీల్లో టీబీజేపీ నేతలు మరో దీక్ష నిర్వహించనున్నారు. ఈ నేపథ్యంలో ఈరోజు(శనివారం) రాంచందర్ రావు అధ్యక్షతన సమావేశం జరగనుంది. ఈ భేటీలో బీజేపీ ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు పాల్గొననున్నారు. ఈ సమావేశంలో 22ఏ వ్యవహారంపై చేసే దీక్షపై సుదీర్ఘంగా చర్చ జరగనున్నట్లు సమాచారం. దీక్షకు సంబంధించిన కార్యాచరణపై రాంచందర్ రావు నాయకులకు దిశానిర్దేశం చేయనున్నారు. అంతేకాకుండా రాష్ట్రంలో పార్టీ బలాబలాలపై కూడా చర్చించనున్నట్లు తెలుస్తోంది. పార్టీని బలోపేతం చేసే దిశలో భవిష్యత్తు కార్యాచరణపై కీలక నిర్ణయాలు తీసుకునే అవకాశం ఉంది. ఈ సమావేశం అనంతరం బీజేపీ తదుపరి కార్యాచరణపై బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు రాంచందర్ రావు క్లారిటీ ఇవ్వనున్నట్లు తెలుస్తోంది.

**పాయల్ శంకర్ 'రైతు యాత్ర'**

మరోవైపు ఫసల్ బీమా పథకాన్ని అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఆదిలాబాద్ నుంచి అసెంబ్లీ వరకు రైతుయాత్ర చేపట్టేందుకు పార్టీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ పాయల్ శంకర్ సిద్ధమవుతున్నారు.

# ఒకే కుటుంబంలో నలుగురు ఆత్మహత్య

విశాఖపట్నం, ఆగస్ట్ 29, అనంత జనశక్తి న్యూస్

విశాఖ జిల్లా పెందుర్తి పరిధిలోని చింతల అగ్రహారంలో విషాద ఘటన చోటుచేసుకుంది. కొత్తవలసకు చెందిన మల్లా వినోద్ కుమార్ కొంతకాలంగా జీవనోపాధి కోసం పెందుర్తిలోని అద్దె ఇంట్లో నివాసం ఉంటున్నాడు. వినోద్ ఆటో డ్రైవర్‌గా, అతని భార్య కాయగూరల వ్యాపారం చేస్తూ జీవనం సాగిస్తున్నారు. ఈ దంపతులకు రెండేళ్లు, మూడేళ్ల వయసున్న ఇద్దరు చిన్నారులు ఉన్నారు. రాఖీ పండుగ సందర్భంగా నిన్న కుటుంబ సభ్యులతో రాఖీలు కట్టించుకున్న వినోద్ కుమార్.. రాత్రి సమయంలో సెల్‌ఫోన్ ద్వారా కుటుంబ సభ్యులకు 'RIP' అంటూ సందేశం పంపినట్లు సమాచారం. ఆ తర్వాత ప్రవీణ్ కుమార్ ఉరివేసుకుని, అతని భార్యతో పాటు ఇద్దరు చిన్నారులు విషపదార్థం తిని ఆత్మహత్య చేసుకున్నారు. సమాచారం తెలుసుకున్న కుటుంబ సభ్యులు తల్లి, ఇద్దరు బిడ్డలను వెంటనే ఆస్పత్రికి తరలించగా..అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. రాఖీ పండుగ రోజున కుటుంబ సభ్యులతో సంతోషంగా గడిపిన అనంతరం చోటుచేసుకున్న ఈ ఘటన తీవ్ర విషాదాన్ని నింపింది. పెందుర్తి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఆత్మహత్యకు కుటుంబ కలహాలా.. ఆర్థిక ఇబ్బందులు కారణమా? అనే కోణంలో పోలీసులు ఆరా తీస్తున్నారు.

# తెలంగాణ క్యాబినెట్‌ను పునర్వ్యవస్థీకరించాలి

(మొదటి పేజీ తరువాయి)

మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రారంభించిన పథకాలను కొనసాగిస్తూనే సీఎం రేవంత్ రెడ్డి కొత్త వాటిని అమలు చేస్తున్నారని గుత్తా సుఖేందర్ రెడ్డి కొనియాడారు. ఈ సందర్భంగా మంత్రివర్గంపైనా కీలక వ్యాఖ్యలు చేశారు. ప్రస్తుతం ఉన్న క్యాబినెట్‌ను పునర్వ్యవస్థీకరించాలని ఆయన పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి రెండున్నర సంవత్సరాలు అయ్యిందని, క్యాబినెట్ పునర్వ్యవస్థీకరణ చేస్తే కొత్తదనం వస్తుందన్నారు. తెలంగాణలో ఏ రాజకీయ పార్టీలోనూ క్రమశిక్షణ లేదని, కాంగ్రెస్‌లో గ్రూపు తగాదాలు తగ్గించాలన్నారు. అదేవిధంగా పార్టీ లైన్ దాటిన వారిపై వేటు వేయకపోతే నష్టం జరుగుతుందన్నారు. పార్టీలో లీకేజీలను కంట్రోల్ చేయాలని, క్రమశిక్షణ ముఖ్యమని ఆయన చెప్పుకొచ్చారు. మరోవైపు, నాలుగు పంటలకూ రైతు భరోసా అందించాలని శాసన మండలి ఛైర్మన్ విజ్ఞప్తి చేశారు. రిజిస్ట్రేషన్ చట్టం 1908లోని సెక్షన్ 22Aని రద్దు చేయాలని సూచించారు. ప్రజలకు ఉచిత పథకాలను తగ్గించాలని, నిజమైన లబ్ధిదారులకే వాటిని అందించాలన్నారు. ఈ సందర్భంగా తెలంగాణ ఉద్యమకారులను నిర్లక్ష్యం చేయొద్దని, వారికి న్యాయం చేయాలని శాసన మండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి సూచించారు.

# మున్సిపల్ చట్ట సవరణకు గవర్నర్ ఆమోదం

అమరావతి, ఆగస్ట్ 29, అనంతజనశక్తి న్యూస్

ఆంధ్రప్రదేశ్‌లో మున్సిపల్ పాలనకు సంబంధించి కీలక పరిణామం చోటుచేసుకుంది. కార్పొరేషన్లు, మున్సిపాలిటీల్లో ప్రత్యక్ష ఎన్నికలకు సంబంధించిన ఏపీ మున్సిపల్ లా సవరణ చట్టానికి గవర్నర్ ఆమోదం లభించింది. ఈ సవరణలతో స్థానిక సంస్థల పాలనలో పలు మార్పులు చోటుచేసుకోనున్నాయి. సవరించిన చట్టం ప్రకారం మున్సిపల్ కార్పొరేషన్లలో డిప్యూటీ మేయర్ పదవుల సంఖ్యను రెండింటి నుంచి ఒకటికి తగ్గించారు. అలాగే మున్సిపాలిటీల్లో ఉన్న మున్సిపల్ వైస్ చైర్మన్ పదవులను కూడా రెండింటి నుంచి ఒకటికి కుదిస్తూ చేసిన సవరణకు గవర్నర్ ఆమోదం తెలిపారు. గవర్నర్ ఆమోదం పొందిన సవరణ చట్టాన్ని అధికారిక గెజిట్‌లో ప్రచురించేలా న్యాయ శాఖ కార్యదర్శి ఉత్తర్వులు జారీ చేయనున్నారు. గెజిట్‌లో ప్రచురణ అనంతరం ఈ సవరణలకు అధికారికంగా చట్టబద్ధత లభించనుంది. మరోవైపు రాష్ట్రంలోని జిల్లా పరిషత్‌ల సంఖ్యకు సంబంధించి కూడా ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ప్రస్తుతం ఉన్న 13 జిల్లా పరిషత్‌లకు అదనంగా కొత్త జిల్లాలను చేర్చి మొత్తం 28 జిల్లా పరిషత్‌లు ఏర్పాటు చేసే దిశగా పంచాయతీరాజ్ చట్టానికి సవరణ చేశారు. కొత్త జిల్లాల ఏర్పాటుకు అనుగుణంగా మొత్తం 28 జెడ్పీల ఏర్పాటు కోసం చేసిన పంచాయతీరాజ్ సవరణ చట్టానికి కూడా గవర్నర్ ఆమోదం లభించింది. దీంతో రాష్ట్రంలో కొత్త జిల్లాల ప్రాతిపదికన జిల్లా పరిషత్‌ల పునర్వ్యవస్థీకరణకు మార్గం సుగమమైంది. మున్సిపల్ సంస్థల్లో పదవుల సంఖ్యను కుదించడం, కొత్త జిల్లాల నేపథ్యంలో జెడ్పీలను పునర్వ్యవస్థీకరించడం వంటి కీలక మార్పులకు గవర్నర్ ఆమోదం లభించడంతో రాష్ట్ర స్థానిక సంస్థల వ్యవస్థలో మార్పులు చోటుచేసుకోనున్నాయి.

# పుజల్ జైలులో విజయ్ సడన్ ఇన్‌స్పెక్షన్

(మొదటి పేజీ తరువాయి)

పర్యటనలో ముఖ్యమంత్రి విజయ్ ఖైదీలతో నేరుగా మాట్లాడారు. వారి సమస్యలు, అవసరాలు, జైలులో అందుతున్న సౌకర్యాలపై వారి అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. ఖైదీలకు అవసరమైన ప్రాథమిక సదుపాయాలు సక్రమంగా అందుతున్నాయా? వైద్య సేవలు ఎలా ఉన్నాయి? ఆహారం నాణ్యత ఎలా ఉంది? వంటి అంశాలపై సీఎం ఆరా తీసినట్లు అధికారిక ప్రకటనలో పేర్కొన్నారు.

**ఆసుపత్రి, పునరావాస కేంద్రం పరిశీలన**

పుజల్ సెంట్రల్ జైలు 1లోని పలు ప్రాంతాలను ముఖ్యమంత్రి విజయ్ పరిశీలించారు. ఇందులో ఏకాంత నిర్బంధ వార్డు, సందర్శకుల గది, ఆసుపత్రి, వ్యసన విముక్తి, పునరావాస కేంద్రం ఉన్నాయి. అలాగే ఖైదీలకు విద్య, నైపుణ్యాభివృద్ధి అందించేందుకు ఏర్పాటు చేసిన తరగతి గదులు, గ్రంథాలయం, అధునాతన కంప్యూటర్ శిక్షణ కేంద్రాన్ని కూడా సీఎం సందర్శించారు.

**హై సెక్యూరిటీ బ్లాక్, ఉరి ప్రదేశం తనిఖీ**

జైలు భద్రతా ఏర్పాట్లను కూడా ముఖ్యమంత్రి విజయ్ పరిశీలించారు. ఇందులో భాగంగా అత్యంత భద్రతా విభాగాన్ని, ఉరితీసే ప్రాంతాన్ని కూడా తనిఖీ చేసినట్లు అధికారిక ప్రకటన తెలిపింది. జైలు ప్రాంగణంలో ఉన్న పోలీస్ స్టేషన్‌తో పాటు వివిధ శిక్షణా కేంద్రాలను కూడా సీఎం పరిశీలించారు. ఖైదీలకు అందించే ఆహార నాణ్యతను ముఖ్యమంత్రి స్వయంగా పరిశీలించారు. ఆహారం తయారీ, నాణ్యత, ఖైదీలకు అందుతున్న విధానం గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఖైదీలకు అందుతున్న ప్రాథమిక సౌకర్యాలు, ఆహారం, వైద్య సేవలు, వృత్తి శిక్షణ వంటి అంశాలను సీఎం సమీక్షించినట్లు ప్రభుత్వం తెలిపింది.

**ఖైదీలు తయారు చేస్తున్న ఉత్పత్తుల పరిశీలన**

జైలులోని వృత్తి శిక్షణా కేంద్రాన్ని సందర్శించిన ముఖ్యమంత్రి.. ఖైదీలు స్వయంగా తయారు చేస్తున్న వివిధ ఉత్పత్తులను పరిశీలించారు. వీటిలో కూరగాయల నిల్వ కోసం ఉపయోగించే ఇనుప ర్యాక్‌లు, కాగితపు కవర్లు, ఆఫీస్ ఫైల్ బోర్డులు, చేనేత ఉత్పత్తులు, కుట్టుపని విభాగంలో తయారు చేసిన వస్తువులు ఉన్నాయి. ఖైదీలకు శిక్షణ ఇవ్వడం ద్వారా వారిలో నైపుణ్యాలను పెంపొందించి, జైలు నుంచి విడుదలైన తర్వాత స్వయం ఉపాధి లేదా ఉద్యోగ అవకాశాలను పొందేలా చేయడం పునరావాస కార్యక్రమాల ప్రధాన లక్ష్యాల్లో ఒకటి.

**ఖైదీల పునరావాసంపై దృష్టి**

జైలు కేవలం శిక్షను అమలు చేసే ప్రదేశంగా కాకుండా, ఖైదీలలో మార్పు తీసుకురావడానికి, వారికి కొత్త నైపుణ్యాలను నేర్పడానికి పునరావాస కార్యక్రమాలు కూడా ముఖ్యమైనవిగా ప్రభుత్వం భావిస్తోంది. ఈ నేపథ్యంలో పుజల్ జైలులో నిర్వహిస్తున్న వృత్తి శిక్షణ, కంప్యూటర్ విద్య, చేనేత, కుట్టుపని, అడిక్షన్ రికవరీ ప్రోగ్రామ్స్ ను ముఖ్యమంత్రి విజయ్ పరిశీలించడం ప్రాధాన్యత సంతరించుకుంది.

# ఏజెన్సీ ప్రాంతానికి వస్తే కొత్త శక్తి, ఉత్సాహం

(మొదటి పేజీ తరువాయి)

సంజీవని కార్యక్రమం రాష్ట్రానికి గేమ్ ఛేంజర్‌గా మారుతుందని చంద్రబాబు అన్నారు. అనారోగ్యం వచ్చినప్పుడు గిరిజనులు విశాఖపట్నం లేదా పాడేరు వంటి ప్రాంతాలకు వెళ్లాల్సిన పరిస్థితి ఉందని, ఇకపై సాంకేతికతను ఉపయోగించి మెరుగైన వైద్య సేవలను అందుబాటులోకి తీసుకువస్తామని చెప్పారు. 'మీ ఆరోగ్యం మీ ఫోన్‌లో ఉంది' అని సీఎం పేర్కొన్నారు. సంజీవని యాప్ ద్వారా ఆరోగ్యానికి సంబంధించిన వివరాలను ఫోన్‌లోనే తెలుసుకునే అవకాశం ఉంటుందని తెలిపారు. ఎక్కడికి వెళ్లినా తమ ఆరోగ్య వివరాలను ఫోన్ ద్వారా చెక్ చేసుకునే విధంగా ఈ వ్యవస్థను రూపొందిస్తున్నామని చెప్పారు.

**ప్రతి గిరిజన బిడ్డకు మెరుగైన వైద్యం**

ప్రతి గిరిజన కుటుంబానికి, ప్రతి గిరిజన బిడ్డకు మెరుగైన వైద్యం అందించాలన్నదే ప్రభుత్వ సంకల్పమని చంద్రబాబు తెలిపారు. గిరిజనుల ఆరోగ్యాన్ని కాపాడటం ప్రభుత్వ బాధ్యతగా భావిస్తున్నామని చెప్పారు. ప్రతి సమస్యకు పరిష్కార మార్గం చూపిస్తామని హామీ ఇచ్చారు. మన ఆరోగ్యం మనం తీసుకునే ఆహారంపై కూడా ఆధారపడి ఉంటుందని సీఎం పేర్కొన్నారు. ఆరోగ్యకరమైన జీవన విధానంపై గిరిజనుల్లో అవగాహన కల్పించడంతో పాటు, అవసరమైన వైద్య సేవలను అందుబాటులోకి తీసుకువస్తామని తెలిపారు.

**మూడు నెలల్లో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల అభివృద్ధి**

ఏజెన్సీ ప్రాంతంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని చంద్రబాబు వెల్లడించారు. మూడు నెలల్లో ఇక్కడ ఉన్న అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను మెరుగుపరుస్తామని తెలిపారు. ఏ వైద్య పరీక్ష అవసరమైనా ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోనే నిర్వహించేలా ఏర్పాట్లు చేస్తామని సీఎం చెప్పారు. దీంతో చిన్నచిన్న వైద్య అవసరాల కోసం దూర ప్రాంతాలకు వెళ్లాల్సిన ఇబ్బందులు గిరిజనులకు తగ్గుతాయని ప్రభుత్వం భావిస్తోంది.

**ఏజెన్సీలో సెల్‌టవర్లు.. కనెక్టివిటీ పెంపు**

గిరిజన ప్రాంతాల్లో వైద్య సేవలను మరింత సమర్థంగా అందించేందుకు కనెక్టివిటీ కూడా కీలకమని సీఎం చంద్రబాబు అన్నారు. ఏజెన్సీ ప్రాంతంలో మరికొన్ని సెల్‌టవర్లను ఏర్పాటు చేసి మొబైల్ కనెక్టివిటీని పెంచుతామని తెలిపారు. సంజీవని వంటి డిజిటల్ వైద్య సేవలు సమర్థంగా పనిచేయాలంటే కనెక్టివిటీ అవసరమని, అందుకే ఏజెన్సీ ప్రాంతాల్లో ఈ సదుపాయాలను మెరుగుపరుస్తామని సీఎం పేర్కొన్నారు.



**అరకు కాఫీకి ప్రపంచస్థాయి గుర్తింపు**

అరకు ప్రాంత అభివృద్ధి, గిరిజనుల ఆదాయంపై కూడా సీఎం చంద్రబాబు మాట్లాడారు. అరకు కాఫీకి ప్రపంచస్థాయి గుర్తింపు తీసుకొచ్చామని తెలిపారు. ఏజెన్సీ ప్రాంత ప్రజలకు అరకు కాఫీతో పాటు మిరియాల సాగు కూడా ప్రధాన ఆదాయ వనరులుగా ఉన్నాయని చెప్పారు. గిరిజనుల జీవనోపాధిని మెరుగుపరిచేందుకు వ్యవసాయం, ఉద్యాన పంటలు, స్థానిక ఉత్పత్తులకు మరింత ప్రోత్సాహం అందించాల్సిన అవసరం ఉందని సీఎం పేర్కొన్నారు.

**అల్లూరి సీతారామరాజు సేవలను గుర్తుచేసిన సీఎం**

గిరిజనుల కోసం అల్లూరి సీతారామరాజు చేసిన సేవలను చంద్రబాబు గుర్తుచేశారు. గిరిజనులకు ఆయుర్వేద వైద్యం అందించిన వ్యక్తిగా అల్లూరి సీతారామరాజు సేవలను ప్రస్తావించారు. అల్లూరి సీతారామరాజు పేరును భోగాపురం ఎయిర్‌పోర్టుకు పెట్టామని సీఎం తెలిపారు. గిరిజన ప్రాంతాల అభివృద్ధి, సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని ఈ సందర్భంగా స్పష్టం చేశారు. ఇక, గిరిజనుల ప్రతి సమస్యకు పరిష్కార మార్గం చూపిస్తామని చంద్రబాబు హామీ ఇచ్చారు. ఆరోగ్యం, వైద్యం, కనెక్టివిటీ, ఆదాయ వనరుల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి పెడతామని తెలిపారు. 'సంజీవని' కార్యక్రమంతో గిరిజన కుటుంబాలకు మెరుగైన ఆరోగ్య సేవలు అందించడంతో పాటు, డిజిటల్ టెక్నాలజీని వారి ఆరోగ్య సంరక్షణకు అనుసంధానం చేయడం ద్వారా ఏజెన్సీ ప్రాంతంలో వైద్య సేవల్లో కొత్త మార్పులు తీసుకురావాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది.

# విదేశీ పర్యటనకు ప్రధాని మోదీ

న్యూఢిల్లీ, ఆగస్ట్ 29, అనంతజనశక్తి న్యూస్

ప్రధాని నరేంద్ర మోదీ రెండు దేశాల విదేశీ పర్యటనకు బయలుదేరనున్నారు. ఉజ్బెకిస్తాన్ అధ్యక్షుడు షవ్‌కత్ మిర్జియోయెవ్ ఆహ్వానం మేరకు ఆగస్టు 29, 30 తేదీల్లో ప్రధాని మోదీ ఉజ్బెకిస్తాన్‌లో ద్వైపాక్షిక పర్యటన చేయనున్నారు. తాష్కెంట్‌లో ఇరు దేశాల మధ్య వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేసే అంశాలపై కీలక చర్చలు జరగనున్నాయి.

ఉజ్బెకిస్తాన్‌లో ప్రధాని మోదీకి ఇది నాలుగో పర్యటన కానుంది. ఈ పర్యటనలో భారత్, ఉజ్బెకిస్తాన్ వ్యూహాత్మక భాగస్వామ్యంతో పాటు.. వాణిజ్యం, పెట్టుబడులు, రక్షణ రంగాల్లో పరస్పర సహకారంపై ఇరు దేశాల నేతలు చర్చించనున్నారు. అలాగే డిజిటల్ కనెక్టివిటీ, ఇంధనం, విద్య తదితర రంగాల్లో ద్వైపాక్షిక సంబంధాలను మరింత విస్తరించే అంశాలపై కూడా చర్చలు జరగనున్నాయి.

భారత్ 'విక్షిత్ భారత్ 2047' అభివృద్ధి దార్శనికతతో పాటు ఉజ్బెకిస్తాన్ 'ఉజ్బెకిస్తాన్2030' అభివృద్ధి ప్రణాళికలపై కూడా ఇరు దేశాల మధ్య అభిప్రాయాల మార్పిడి జరగనుంది. భవిష్యత్‌లో ఆర్థిక, సాంకేతిక,




మౌలిక వసతుల రంగాల్లో పరస్పర సహకారాన్ని పెంచుకునే అవకాశాలను పరిశీలించనున్నారు. తాష్కెంట్‌లో ప్రధాని మోదీ పలు ప్రత్యేక కార్యక్రమాల్లో పాల్గొననున్నారు. లాల్ బహదూర్ శాస్త్రి మెమోరియల్‌ను సందర్శించడంతో పాటు తాష్కెంట్ స్టేట్ యూనివర్సిటీ ఆఫ్ ఓరియంటల్ స్టడీస్‌లోని మహాత్మా గాంధీ కేంద్రాన్ని కూడా సందర్శించనున్నారు. ఉజ్బెకిస్తాన్ పర్యటన అనంతరం ప్రధాని మోదీ ఆగస్టు 31 నుంచి సెప్టెంబర్ 1 వరకు కిర్గిజ్ రిపబ్లిక్‌లో పర్యటించనున్నారు. కిర్గిజ్ అధ్యక్షుడు సదిర్ జపరోవ్ ఆహ్వానం మేరకు ప్రధాని మోదీ బిష్కెక్‌కు వెళ్లనున్నారు. ఈ పర్యటనలో భాగంగా 26వ షాంఘై సహకార సంస్థ (SCO) శిఖరాగ్ర సమావేశంలో ప్రధాని మోదీ పాల్గొంటారు. SCO 25వ వార్షికోత్సవం సందర్భంగా ఈ శిఖరాగ్ర సమావేశం జరగనుంది. 2017 నుంచి భారత్ SCOలో పూర్తి సభ్యదేశంగా కొనసాగుతోంది. SCO సమావేశంలో భద్రత, అనుసంధానం, ప్రాంతీయ సహకారం, అభివృద్ధి అవకాశాలపై భారత ప్రాధాన్యతలను ప్రధాని మోదీ ప్రస్తావించనున్నారు. ఈ సందర్భంగా SCO సభ్యదేశాల నేతలతో ప్రధాని మోదీ ద్వైపాక్షిక సమావేశాలు నిర్వహించే అవకాశం ఉంది. అలాగే కిర్గిజ్ రిపబ్లిక్‌లో జరిగే 6వ వరల్డ్ నోమాడ్ గేమ్స్ ప్రారంభోత్సవానికి కూడా ప్రధాని మోదీ హాజరుకానున్నారు. మధ్య ఆసియా సాంస్కృతిక వారసత్వానికి ప్రతీకగా నిలిచే ఈ క్రీడలు ప్రాంతీయ సాంస్కృతిక సంబంధాలకు ప్రత్యేక ప్రాధాన్యతను కలిగి ఉన్నాయి.

# నేపాల్‌లో కొత్త సంక్షోభం..!

(మొదటి పేజీ తరువాయి)

వరదల తర్వాత కూడా 2,500 మందికి పైగా గల్లంతైనవారు ఉండటంతో మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని అధికారులు భావిస్తున్నారు. గల్లంతైన వారి కుటుంబ సభ్యులు వచ్చి తమ బంధువులను గుర్తించే వరకు మృతదేహాలను భద్రపరిచేందుకు ప్రభుత్వం తాత్కాలిక కేంద్రాలను ఏర్పాటు చేస్తోంది.

**మృతదేహాల గుర్తింపునకు ఫొటోలు, ట్యాగ్‌లు**

నేపాల్ పోలీస్ ఎస్పీ రమేశ్వర్ పౌడెల్ తెలిపిన వివరాల ప్రకారం, సహాయక బృందాలు మృతదేహాలను వెలికితీసిన వెంటనే వాటి క్లోజ్‌అప్ ఫొటోలను తీస్తున్నారు. మృతదేహం స్పష్టంగా కనిపించకపోతే ముందుగా శుభ్రం చేసి, అనంతరం బాడీ బ్యాగ్‌కు ప్రత్యేక గుర్తింపు ట్యాగ్‌ను అమర్చుతున్నారు. ఆ తర్వాత వాటిని తాత్కాలిక భద్రపరిచే కేంద్రాలకు తరలిస్తున్నారు. ఈ తాత్కాలిక కేంద్రాల్లో ఉష్ణోగ్రతను సుమారు 0 డిగ్రీల వద్ద ఉంచేలా ఏర్పాట్లు చేస్తున్నారు.

గల్లంతైన వారి బంధువులు సమాచారం కోసం వచ్చినప్పుడు, ఇప్పటివరకు వెలికితీసిన మృతదేహాల ఫొటోలను వారికి చూపిస్తున్నారు. కుటుంబ సభ్యులు తమ బంధువును గుర్తిస్తే, అవసరమైన అధికారిక ప్రక్రియలను పూర్తి చేసిన అనంతరం మృతదేహాన్ని వారికి అప్పగిస్తున్నారు. మృతదేహాల గుర్తింపులో ఇబ్బందులు ఎదురవుతున్న కారణంగానే ఈ విధానాన్ని అనుసరిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ముఖం ద్వారా గుర్తింపు సాధ్యం కాని మృతదేహాల విషయంలో పోలీసులు ఇప్పుడు వేలిముద్రలు, DNA నమూనాలను సేకరిస్తున్నారు. బంధువులు వెంటనే గుర్తించలేని పరిస్థితుల్లో కూడా భవిష్యత్తులో శాస్త్రీయ పద్ధతుల ద్వారా మృతదేహాలను గుర్తించేందుకు ఈ నమూనాలు ఉపయోగపడతాయి. కాస్కీ జిల్లా పోలీస్ చీఫ్ నబిన్ కార్కీ ప్రకారం, బంధువులు లభించకపోయినా లేదా మృతదేహాన్ని గుర్తించలేకపోయినా వాటిని నిరవధికంగా ఉంచడం సాధ్యం కాదు. అందుకే ముందుగానే వేలిముద్రలు, DNA నమూనాలు సేకరించి, మార్గదర్శకాల ప్రకారం స్థానిక అధికారుల సహకారంతో మృతదేహాలను ట్యాగ్‌లతో నిర్దేశిత ప్రదేశాల్లో నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

**2021 మార్గదర్శకాల ప్రకారం మృతదేహాల నిర్వహణ**

మృతదేహాల నిర్వహణ కోసం నేపాల్‌లో అమల్లో ఉన్నాయి. జిల్లా పోలీస్ చీఫ్ ఆధ్వర్యంలో ఏర్పాటైన కమిటీలు గుర్తు తెలియని, బంధువులు ఎవరూ క్లెయిమ్ చేయని మృతదేహాలను నిర్వహిస్తాయి. అయితే ప్రస్తుతం వరుసగా మృతదేహాలు వస్తుండటంతో పరిస్థితి మరింత క్లిష్టంగా మారిందని అధికారులు చెబుతున్నారు. దీంతో జిల్లా స్థాయి కమిటీలు కేంద్ర ప్రభుత్వ అధికారులతో సమన్వయం చేసుకుంటున్నాయి.

**2,500 మందికి పైగా గల్లంతు**

వరదల్లో గల్లంతైన 2,500 మందికి పైగా వ్యక్తుల కోసం సహాయక బృందాలు తీవ్రంగా గాలిస్తున్నాయి. ప్రస్తుతం అధికారికంగా మృతుల సంఖ్య 616కి చేరినట్లు సమాచారం. సహాయక చర్యలు కొనసాగుతున్న కొద్దీ మరిన్ని మృతదేహాలు వెలికితీయడంతో ఈ సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని అధికారులు భావిస్తున్నారు.

**భారత్, చైనా నుంచి సహాయం**

పరిస్థితి తీవ్రంగా మారడంతో నేపాల్ విదేశీ సహాయాన్ని స్వీకరించేందుకు అంగీకరించింది. ముఖ్యంగా భారత్, చైనాకు చెందిన సెర్చ్ అండ్ రెస్క్యూ బృందాలు స్థానిక అధికారులకు సహాయం చేసేందుకు అనుమతిస్తున్నారు. అంతర్జాతీయ సమాజం నుంచి వచ్చిన ఒత్తిడి, గల్లంతైన విదేశీ పౌరుల కుటుంబాల ఆందోళనల నేపథ్యంలో పరిమిత సంఖ్యలో నిపుణులను, సెర్చ్ అండ్ రెస్క్యూ బృందాలను నిర్దిష్ట ప్రాంతాల్లోకి అనుమతిస్తున్నట్లు నేపాల్ ప్రభుత్వం తెలిపింది.

# వచ్చేది కాంగ్రెస్ ప్రభుత్వమే తలకిందులు తపస్సు చేసినా లాభం లేదు

- ధనిక రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మార్చారు
-- సంక్షేమాన్ని పట్టించుకోలేదని ఆగ్రహం

హైదరాబాద్, ఆగస్ట్ 29, అనంత జనశక్తి న్యూస్

ధనిక తెలంగాణ రాష్ట్రాన్ని అప్పుల రాష్ట్రంగా చేసినా సంక్షేమం ఆగలేదని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. ఈరోజు(శనివారం) మీడియాతో మాట్లాడుతూ.. జిల్లాలోని నూతనకల్, మద్దిరాల మండలాల్లో 15 గ్రామాల్లో సుమారు మూడు వేల ఎకరాలకు సంబంధించిన భూమి పట్టాలను అందజేస్తున్నామన్నారు. పిల్లల చదువు కోసం, అవసరాల కోసం భూమిని అమ్ముకొనే అవకాశం లేక ఇబ్బంది పడుతున్న విషయాన్ని తన దృష్టికి తీసుకవచ్చారని తెలిపారు. ఈ ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంది కాబట్టే పట్టాదార్ పాస్‌బుక్కులను పంపిణీ చేస్తున్నామని చెప్పారు.

'మీరు తలక్రిందులుగా తపస్సు చేసినా మళ్లీ కాంగ్రెస్ ప్రభుత్వమే అధికారంలోకి వస్తుంది' అని మంత్రి స్పష్టం చేశారు. 63 వేల కోట్ల ఆడబిడ్డలకు సున్నా వడ్డీకి రుణాలు ఇచ్చామన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా మొదటి విడత ఇందిరమ్మ ఇళ్లు అందించామని తెలిపారు. సర్వే కోసం 70 రెవెన్యూ గ్రామాలను తీసుకున్నామని.. ఈ సర్వేతో దొంగ పట్టాలను గుర్తించవచ్చని చెప్పారు. రాబోయే సంవత్సరన్నర కాలంలో ప్రతి అంగుళం సర్వే చేస్తామన్నారు. పేదలకు ఇళ్లు ఇస్తే ప్రభుత్వంపై విషం చిమ్ముతున్నారని ప్రతిపక్షాలపై మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు.



# ఎన్‌టీఏకు ఐదుగురు అధికారుల నియామకం



**– డైరెక్టర్‌గా ఏపీ కేడర్ ఐఏఎస్ అధికారి ప్రసన్న వెంకటేష్**

నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ)కి కేంద్ర ప్రభుత్వం ఒక జాయింట్ సెక్రటరీ, ముగ్గురు డైరెక్టర్లు, ఒక జాయింట్ డైరెక్టర్‌ను నియమించింది. 2005 బ్యాచ్ ఐఆర్ఎస్ అధికారి అన్షుమన్ శర్మ జాయింట్ సెక్రటరీగా, 2012 బ్యాచ్ ఏపీ కేడర్ ఐఏఎస్ అధికారి వి.ప్రసన్న వెంకటేష్, 2012 బ్యాచ్ యూటీ కేడర్‌కు చెందిన ఐపీఎస్ అధికారి రవికుమార్‌సింగ్, 2011 బ్యాచ్ ఐఆర్ఎస్ అధికారి సాతియాలను డైరెక్టర్లుగా, 2016 బ్యాచ్ ఐఆర్ఎస్ అధికారి అమిత్ సమదారియాను జాయింట్ డైరెక్టర్‌గా నియమిస్తూ సిబ్బంది వ్యవహారాల మంత్రిత్వ శాఖ వేర్వేరుగా ఉత్తర్వులిచ్చింది. ప్రస్తుతం ఏపీ సర్వీసులో ఉన్న ప్రసన్న వెంకటేష్ కేంద్ర ఉన్నత విద్యాశాఖకు డిప్యుటేషన్‌పై బదిలీ కానున్నారు. ఇందుకోసం రాష్ట్ర సర్వీసుల నుంచి రిలీవ్ చేయాలని కేంద్ర ప్రభుత్వం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి లేఖ రాసింది. ఆయన బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి ఐదేళ్లు కానీ, లేదంటే తదుపరి ఉత్తర్వులు జారీ చేసేంత వరకు ఈ పదవిలో ఉంటారు. ఆయన స్వరాష్ట్రం తమిళనాడు. ప్రస్తుతం ఏపీ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాసంస్థల సొసైటీ కార్యదర్శిగా, లెదర్ ఇండస్ట్రీస్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ వీసీఎండీగా పనిచేస్తున్నారు. గతంలో విజయవాడ మున్సిపల్ కమిషనర్‌గా, పశ్చిమగోదావరి, ఏలూరు జిల్లాల కలెక్టర్‌గా సేవలందించారు. ఎంపికైన అధికారులు మూడు వారాల్లోగా కొత్త బాధ్యతలు స్వీకరించాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

# కర్ణాటక మంత్రి నాగేంద్ర రాజీనామా



కర్ణాటక ప్రణాళిక, గణాంకాలశాఖ మంత్రి బి.నాగేంద్ర తన పదవికి రాజీనామా చేశారు. కర్ణాటక వాల్మీకి గిరిజన అభివృద్ధి మండలి నిధులు మళ్లించారంటూ ఆరోపణలున్న బి.నాగేంద్ర.. ఆగస్టు 3న డీకే శివకుమార్ మంత్రివర్గంలో చేరారు. అవినీతి ఆరోపణలున్న నాగేంద్రను మంత్రివర్గం నుంచి తొలగించాలని ప్రధాన విపక్షం భాజపా ఇటీవల శాసనసభ సమావేశాల్లో చర్చలకు అవకాశం ఇవ్వకుండా ఆందోళన చేపట్టింది. సెప్టెంబరు 1న రాయచూరు నుంచి బళ్లారి వరకు పాదయాత్ర చేసేందుకు సిద్ధమైంది. దీనిపై శుక్రవారం విలేకర్లతో మాట్లాడిన మంత్రి నాగేంద్ర.. పార్టీ ప్రతిష్ఠకు భంగం కలగకూడదని స్వచ్ఛందంగా రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. ఒక దళితుడి ప్రగతిని ఓర్వలేని భాజపా.. తనపై ఎలాంటి ఆరోపణలు లేకున్నా ప్రజలను తప్పుదోవ పట్టించిందని భావోద్వేగానికి లోనయ్యారు. తనపై పదేపదే ఆరోపణలు చేస్తున్న బళ్లారి భాజపా నాయకులు బి.శ్రీరాములు, జనార్ధనరెడ్డిలను ప్రజాక్షేత్రంలోనే ఎదుర్కొనేందుకు ఎమ్మెల్యే పదవికీ రాజీనామా చేస్తున్నట్లు వెల్లడించారు.

తొలుత సిద్ధరామయ్య ప్రభుత్వంలోనూ బి.నాగేంద్ర మంత్రిగా పనిచేశారు. వాల్మీకి గిరిజన అభివృద్ధి మండలి నిధులు అనధికారిక ఖాతాలకు బదిలీ అయ్యాయని నోట్ రాసి.. ఇదే మండలి ఎకౌంట్స్ సూపరింటెండెంట్ పి.చంద్రశేఖర్ ఆత్మహత్య చేసుకున్నారు. అప్పటికి గిరిజన సంక్షేమ మంత్రిగా ఉన్న బి.నాగేంద్ర నైతిక బాధ్యత వహిస్తూ రాజీనామా చేశారు. ఈ ఆరోపణలపై విచారణ చేపట్టిన ఈడీ అధికారులు రూ.89.93 కోట్ల నిధులు యూనియన్ బ్యాంక్ నుంచి వివిధ ఖాతాలకు బదిలీ అయినట్లు తేల్చారు. ఈ క్రమంలో బి.నాగేంద్రను అరెస్ట్ చేశారు. రాష్ట్ర సీఐడీకి చెందిన సిట్ బృందం బి.నాగేంద్రకు క్లీన్‌చిట్ ఇచ్చినా.. ఈడీ, సీబీఐలు ఇంకా నిర్దోషిగా తేల్చలేదు. ఇదే అంశంతో భాజపా ఆందోళన చేపట్టడం గమనార్హం.

# సరికొత్త ఆట.. మూడు జట్ల క్రీడంట!

**సాధారణంగా ఏదైనా క్రీడలో రెండు జట్లు పోటీ పడుతుండటం మనకు తెలుసు. అదే ఒకే ఆటలో మూడు జట్లు ఒకేసారి తలపడటం కొత్తగా అనిపిస్తుంది కదూ! వినడానికి ఆసక్తిగా అనిపిస్తున్న ఇలాంటి క్రీడను ఐఐటీ మద్రాస్ రూపొందించి, శుక్రవారం ప్రారంభించింది. దీనికి 'ఫైబాల్' అనే పేరు పెట్టింది. సంప్రదాయ బాస్కెట్‌బాల్ ఆటను ఆధారంగా చేసుకుని దీన్ని అభివృద్ధి చేశారు. వృత్తాకార కోర్టులో ఈ ఆట ఆడుతారు. మైదానంలో మూడు బాస్కెట్లు ఉంటాయి. ప్రతి జట్టులో ఏడుగురు ఆటగాళ్లు ఉంటారు. ప్రతి జట్టు ఒక బాస్కెట్ను కాపాడుకుంటూ ప్రత్యర్థి రెండు బాస్కెట్లలో స్కోర్ చేయాల్సి ఉంటుంది. 'ఆగస్టు 29న హాకీ దిగ్గజం మేజర్ ధ్యాన్‌చంద్ జయంతిని పురస్కరించుకుని ఈ ఆటను ప్రారంభించాం. ఇది శారీరక దృఢత్వం, వేగవంతమైన నిర్ణయాలు, టీమ్‌వర్క్‌కు ఎంతగానో ఉపయోగపడుతుంది' అని ఐఐటీ మద్రాస్ తెలిపింది.**





# కొలంబియా యూనివర్సిటీతో VIT అవగాహన ఒప్పందం

అమెరికా న్యూయార్క్‌లోని ప్రఖ్యాత కొలంబియా యూనివర్సిటీతో (కొలంబియా ఇంజినీరింగ్) వేలూర్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (వీఐటీ) అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. న్యూయార్క్‌లోని భారత కాన్సుల్ జనరల్ బినయ శ్రీకాంత ప్రధాన్ సమక్షంలో వీఐటీ ఛాన్సలర్ డా. జి. విశ్వనాథన్, కొలంబియా ఇంజినీరింగ్ అకడమిక్ అఫైర్స్ అండ్ గ్లోబల్ పార్ట్‌నర్‌షిప్స్ డీన్ సెన్. సొలేమానే కచాని అవగాహన ఒప్పందంపై సంతకాలు చేశారు. దీంతో కొలంబియా యూనివర్సిటీతో డ్యూయల్ డిగ్రీ ఒప్పందం కుదుర్చుకున్న తొలి భారతీయ విశ్వవిద్యాలయంగా వీఐటీ నిలిచింది. దీనివల్ల ఇంజినీరింగ్ విద్యార్థులకు అంతర్జాతీయ స్థాయిలో విద్యా అవకాశాలు, నాణ్యమైన విద్య అందుబాటులోకి రానుంది. ఈ సందర్భంగా దీన్నొక కీలక ఘట్టంగా డా‖ జి.విశ్వనాథన్ అభివర్ణించారు. ఈ భాగస్వామ్య ఒప్పందంతో VIT ఇంజినీరింగ్ విద్యార్థులకు అత్యున్నత ప్రమాణాలతో కూడిన విద్యను అభ్యసించే అవకాశం ఏర్పడుతుంది. అంతర్జాతీయంగా కెరీర్‌ను నిర్మించుకునేందుకు సరికొత్త మార్గాలు ఏర్పడతాయి. ఈ కార్యక్రమంలో VIT ఉపాధ్యక్షుడు డా. జి. వి. సెల్వం, డైరెక్టర్ ఇంటర్నేషనల్ రిలేషన్స్ డా. ఆర్. శ్రీనివాసన్ పాల్గొన్నారు.

# మహారాష్ట్ర ఎంపీఎస్సీ పేపర్ లీక్ కేసులో షాకింగ్ ట్విస్టులు

**- 10 తప్పులు రాయాలంటూ చాట్, బ్రేకప్ కావడంతో వెలుగులోకి!**

మహారాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ (ఎంపీఎస్సీ) నిర్వహించిన డ్రగ్ ఇన్ స్పెక్టర్ నియామక పరీక్ష క్వశ్చన్ పేపర్ లీకేజీ వ్యవహారంలో ముంబై క్రైమ్ బ్రాంచ్ దర్యాప్తు తీవ్ర దిగ్భ్రాంతికరమైన విషయాలను బయటకు తీసింది. ఈ స్కామ్‌లో ప్రధాన నిందితురాలైన రితుజా పాటిల్‌కు పరీక్ష కంటే ముందే లీకైన ప్రశ్నాపత్రం అందింది. అయితే మొదటి ర్యాంక్ లేదా వందకు వంద మార్కులు వస్తే అధికారులకు అనుమానం వస్తుందనే భయంతో కనీసం 10 ప్రశ్నలకు కావాలనే తప్పు సమాధానాలు రాయాలని ఎంపీఎస్సీ ఉద్యోగులు ఆమెకు సలహా ఇచ్చారు. ఈ మేరకు వారి మధ్య నడిచిన వాట్సాప్ సంభాషణల ఆధారాలను పోలీసులు సేకరించారు. మార్చి 22న జరిగిన ఈ పరీక్ష ప్రశ్నాపత్రం రితుజాకు మార్చి 20నే లభించింది. పరీక్షలో 294 ప్రశ్నలకు గాను లీకైన పేపర్‌లోని 77 ప్రశ్నలు నేరుగా మ్యాచ్ అయ్యాయి. దీంతో ఆమె ఏకంగా ఏడో ర్యాంకు సాధించింది.

**తండ్రి ఇచ్చిన రూ. 5 లక్షల లంచం!**

ఈ అక్రమం వెనుక భారీ ముఠా హస్తం ఉంది. ప్రారంభంలో ప్రశ్నాపత్రం కొనుగోలు చేసేందుకు తన ప్రియుడు గౌరవ్ పాటిల్ అలియాస్ లోకేష్‌ను రితుజా రూ. 5 లక్షలు అడిగింది. కానీ ఆర్థిక సమస్యల వల్ల అతను డబ్బులు ఇవ్వలేకపోయాడు. దాంతో ఉపాధ్యాయుడిగా పని చేస్తున్న తన తండ్రి అమృత్ పాటిల్‌ను ఆశ్రయించగా.. ఆయన కుమార్తె కోసం రూ. 5 లక్షలు ఇచ్చారు. నాసిక్‌లోని ఒక



ఫ్లాట్‌లో ఈ డీల్ కుదిరింది. ఆ మొత్తాన్ని నందుర్బార్‌కు చెందిన మధ్యవర్తి, కోచింగ్ సెంటర్ నిర్వాహకుడు ప్రవీణ్ పాటిల్‌కు అందించగా.. అతను ఎంపీఎస్సీ అధికారులు గోపాల్ మరాఠే, విశ్వేశ్వర్ నకటే, అభిజీత్ లెండ్వేల ద్వారా క్వశ్చన్ పేపర్‌ను సంపాదించి రితుజాకు చేరవేశాడు. అయితే పరీక్ష పూర్తయిన తర్వాత రితుజా, గౌరవ్‌ల మధ్య మనస్పర్థలు వచ్చి బ్రేకప్ జరిగింది. ప్రభుత్వ ఉద్యోగం వస్తే రితుజా తనను వదిలేసి వెళ్లిపోతుందనే ఈర్ష్య, భయంతో గౌరవ్ ఈ పేపర్ లీక్‌పై ఎంపీఎస్సీకి ఈమెయిల్ ద్వారా ఫిర్యాదు చేశాడు. అయితే విచారణ తీవ్రతరం కావడంతో కంగారుపడిన గౌరవ్ తన ఫిర్యాదును వెనక్కి తీసుకునేందుకు ప్రయత్నించాడు. కానీ విచారణలో అసలు నిజం బయటపడింది. గౌరవ్ సోదరుడు కూడా ఇదే పరీక్ష రాస్తుండటంతో.. పరీక్షకు రెండ్రోజుల ముందే రితుజా ఆ లీకైన పేపర్‌ను గౌరవ్‌కు వాట్సాప్‌లో పంపినట్లు ఆధారాలు లభించాయి. దీంతో ఫిర్యాదు చేసిన గౌరవ్‌ను కూడా పోలీసులు నిందితుడిగా చేర్చారు.

ఈ వ్యవహారంలో ఇప్పటి వరకు రితుజా తండ్రి అమృత్ పాటిల్, ప్రియుడు గౌరవ్, మధ్యవర్తి ప్రవీణ్ పాటిల్‌తో పాటు ముగ్గురు ఎంపీఎస్సీ ఉద్యోగులను పోలీసులు అరెస్టు చేశారు. ప్రధాన నిందితురాలు రితుజా పాటిల్ ప్రస్తుతం పరారీలో ఉంది. ఇది మాస్ పేపర్ లీక్ కాదని, కేవలం ఒకే ఒక్క వ్యక్తికి లీకైందని ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ స్పష్టం చేసినప్పటికీ.. విద్యార్థుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని ఎంపీఎస్సీ ఈ నియామక ప్రక్రియను, పరీక్షను పూర్తిగా రద్దు చేసింది. మరోవైపు ఈ అంశంపై ఎన్సీపీ ఎమ్మెల్యే రోహిత్ పవార్, బీజేపీ నాయకుల మధ్య తీవ్ర రాజకీయ యుద్ధం నడుస్తోంది. సెప్టెంబర్ 1వ తేదీన భారీ నిరసన ప్రదర్శనకు రోహిత్ పవార్ పిలుపునిచ్చారు.

# బాధితులు, ప్రభుత్వం అప్పీల్ చేయకుండా శిక్షను పెంచే అధికారం అప్పీలేట్ కోర్టులకు లేదు:

**– సుప్రీం కోర్టు**

ఒక కేసులో బాధితులు, ఫిర్యాదుదారు లేదా ప్రభుత్వం అధికారికంగా అప్పీల్ చేయకుండా అప్పీలేట్ కోర్టు స్వయంగా నిందితుడు లేదా నేరస్థుడి శిక్షను పెంచడానికి వీల్లేదని దేశ అత్యున్నత నాయస్థానం సుప్రీంకోర్టు సంచలన తీర్పు వెలువరించింది. కాలికట్ యూనివర్సిటీ మాజీ వైస్ ఛాన్సలర్, ఆయన భార్య, వారి సెక్యూరిటీ గార్డ్‌ను దారుణంగా హత్య చేసిన తీవ్రమైన ట్రిబుల్ మర్డర్ కేసు విచారణ సందర్భంలో సుప్రీంకోర్టు ఈ కీలకమైన వ్యాఖ్యలు చేసింది. జస్టిస్ మనోజ్ మిస్రా, జస్టిస్ విజయ్ బిష్ణోయ్‌లతో కూడిన ద్విసభ్య ధర్మాసనం ఈ కేసులో ప్రధాన నిందితుల్లో ఒకరైన గోపి అనే వ్యక్తి శిక్షను పెంచుతూ మద్రాస్ హైకోర్టు గతంలో ఇచ్చిన ఉత్తర్వులను కొట్టివేసింది.

అసలేం జరిగిందంటే..?

కాలికట్ విశ్వవిద్యాలయం మాజీ వైస్ ఛాన్సలర్ మాలిక్ మహమ్మద్ వద్ద అంబరసు అనే వ్యక్తి డ్రైవర్‌గా పనిచేసేవాడు. అయితే ఓ మోసపూరితమైన అక్రమ వ్యవహారంలో పట్టుబడటంతో.. అంబరసును వీసీ ఉద్యోగం నుంచి తొలగించారు. ఈ క్రమంలో ప్రతీకారం తీర్చుకోవాలని కసి పెంచుకున్న అంబరసు.. తన సహచరుడైన గోపితో కలిసి ప్లాన్ వేశాడు. వీసీ నివాసంలోకి చొరబడేందుకు ప్రయత్నించి, ముందుగా అక్కడ కాపలా ఉన్న వాచ్ మెన్ జ్ఞానప్రకాశంను దారుణంగా హత్య చేశారు. ఆ తర్వాత వీసీ మాలిక్ మహమ్మద్‌ను చంపేసి, ఆయన భార్య ఖతీజా బీబీని కారులో బంధించి అపహరించారు. తమిళనాడులోని విల్లుపురం జిల్లా ఒంగూర్ గ్రామానికి ఆమెను తీసుకెళ్లి.. పెట్రోల్, డీజిల్ మిశ్రమాన్ని పోసి సజీవదహనం చేశారు. 2007 నవంబర్ 14వ తేదీన పోలీసులు ఆమె పాక్షికంగా కాలిన మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నారు.

ముందస్తుగా విడుదల చేసే అవకాశం లేకుండా..!

అయితే ఈ ఘోర హత్యలపై విచారణ జరిపిన విచారణ కోర్టు (ట్రయల్ కోర్టు) ప్రధాన నిందితుడు అంబరసుకు ఉరిశిక్ష విధించగా, అతనికి సహకరించిన గోపికి యావజ్జీవ కారాగార శిక్ష పడేలా తీర్పునిచ్చింది. అయితే ఈ కేసు మద్రాస్ హైకోర్టుకు వెళ్లినప్పుడు.. హైకోర్టు తన స్వీయ అధికారాలను ఉపయోగిస్తూ గోపికి విధించిన యావజ్జీవ శిక్షను "జీవితాంతం జైలులోనే ఉండేలా తీర్పునిచ్చింది. సాధారణంగా యావజ్జీవ శిక్ష పడిన వారికి 14 ఏళ్ల జైలు జీవితం పూర్తి చేసుకున్నాక చట్టపరంగా రెమిషన్ ద్వారా ముందస్తుగా విడుదలయ్యే అవకాశం ఉంటుంది. కానీ ఈ కేసులో మాత్రం గోపిని ముందుస్తుగా విడుదల చేసేందుకు ఏమాత్రం అవకాశం లేదని తేల్చి చెప్పింది.

శిక్ష పెంపును సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్‌ను విచారించిన సుప్రీం కోర్టు.. మద్రాస్ హైకోర్టు చర్యను తప్పుబట్టింది. ప్రభుత్వం కానీ, బాధిత కుటుంబం కానీ శిక్షను పెంచాలని ప్రత్యేకంగా అప్పీల్ చేయని పక్షంలో.. అప్పీలేట్ కోర్టు సుమోటోగా తన రివిజన్ అధికారాన్ని ఉపయోగించి నిందితుడి శిక్షను పెంచకూడదని స్పష్టం చేసింది. కోర్టును ఆశ్రయించిన వ్యక్తికి అంతకుముందు ఉన్న పరిస్థితి కంటే అధ్వాన్నమైన పరిస్థితిని కల్పించేలా అప్పీలేట్ కోర్టులు నిర్ణయాలు తీసుకోకూడదని తేల్చి చెప్పింది. అంతేకాకుండా శిక్షలను ఒకదాని తర్వాత ఒకటి అనుభవించాలని హైకోర్టు ఇచ్చిన ఆదేశాలను కూడా సవరించిన అత్యున్నత కోర్టు.. ఆ శిక్షలన్నీ ఏకకాలంలో అమలు కావాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది.

# రాఖీ కడుతుండగా కుంగిన నేల



'పళ్లెంలోని అన్నం నోటికి అందేలోపు ఏమి జరుగుతుందో చెప్పలేము' అన్నది లోకోక్తి. దీన్నే చాలామంది 'విధి లిఖితం' అని సరిపెట్టుకొంటూ ఉంటారు. ఉత్తర్‌ప్రదేశ్‌లోని కాన్పుర్ జిల్లా మహారాజ్‌పుర్ పోలీస్‌స్టేషను పరిధిలో గల పుర్వామీర్ గ్రామంలో 'రక్షాబంధన్' పండుగ వేళ అటువంటి ఘటనే జరిగింది. శుక్రవారం ఉదయాన్నే నిద్ర లేచి తన సోదరుడికి శుభాకాంక్షలు తెలిపిన చట్కీశర్మ (16) అనే యువతి రాఖీ కట్టేందుకు ఒక అడుగు ముందుకు వేయగానే.. కాళ్ల కింది నేల అమాంతం కుంగిపోయి 20 అడుగుల లోతు గుంతలోకి ఆమె పడిపోయింది. మూడేళ్ల కిందట ఆ ఇంటి ఆవరణలో బోరుబావి తవ్వగా, అది నిష్ఫలమైంది. దీంతో మూసివేశారు. ఇటీవల కురిసిన వర్షాలకు నేల వదులుగా మారడంతో ఈ ఉపద్రవం జరిగినట్లుగా భావిస్తున్నారు. అధికారుల ఆధ్వర్యంలో సహాయక బృందాలు సమాంతరంగా గుంత తవ్వి, యువతిని బయటకు తీశాయి. వెంటనే స్థానిక పీహెచ్‌సీకి తరలించగా, అప్పటికే ఆమె మృతిచెందినట్లు వైద్యుడు ధ్రువీకరించారని పోలీస్ కమిషనర్ రఘుబీర్ లాల్ తెలిపారు.

# కళ్లలో నీటి సుడులు.. బరువెక్కిన బాసలు



రక్షాబంధన్ వేడుకలంటే చాలా ఇళ్లలో నోరూరించే మిఠాయిలు.. వెల్లివిరిసే నవ్వులు.. సంప్రదాయబద్ధంగా ముస్తాబై రాఖీలు కట్టే అక్కాచెల్లెళ్లకు ప్రేమగా సోదరులు అందించే కానుకలు. కొందరు తోబుట్టువులకు మాత్రం కళ్లలో పెల్లుబికే కన్నీరు, ఇనుప గోడలకు అటూ ఇటూ నిరీక్షణలు, భద్రతాపరమైన ఆంక్షల నడుమ పంచుకునే అరకొర ఆప్యాయతలు. జీవితాల్లో వేసిన తప్పటడుగుల ఫలితంగా ఖైదీలుగా జైళ్లలో ఉంటున్నవారు ఉద్వేగభరితంగా జరుపుకొన్న రాఖీ సంబరాలివి. శుక్రవారం దేశవ్యాప్తంగా పలు నగరాల్లోని జైళ్లలో హృదయాలను బరువెక్కించే ఇటువంటి దృశ్యాలు సాక్షాత్కరించాయి. ఉత్తర్‌ప్రదేశ్‌లోని సుల్తాన్‌పుర్, ఎటా, జాలౌన్ జిల్లా జైళ్లలో శిక్షలు అనుభవిస్తున్న తమ సోదరులకు రాఖీలు కట్టేందుకు భారీగా తరలివచ్చారు.

# లంచం ఆరోపణలు.. ఎఫ్‌డీఏ అధికారికి ఎక్స్‌పైరీ బిస్కెట్లు



గడువు ముగిసిన బిస్కెట్లు అమ్ముతున్న దుకాణదారుడికి సహకరించిన ఫుడ్ అండ్ డ్రగ్ అడ్మినిస్ట్రేషన్‌తో ఎక్స్‌పైరీ బిస్కెట్లులోని ఛత్రపతి సంభాజీనగర్ జిల్లాలో వెలుగులోకి వచ్చింది. పోలీసుల కథనం ప్రకారం.. ఇటీవల స్థానిక పాన్ దుకాణంలో తినుబండారాలు తిని రెండేళ్ల చిన్నారి అస్వస్థతకు గురయ్యింది. ఆస్పత్రికి తరలించగా.. పాపను పరీక్షించిన వైద్యులు కలుషిత ఆహారం కారణమని తెలిపారు. దీంతో కుటుంబసభ్యులు, స్థానికులు ఎఫ్‌డీఏ అధికారులకు ఫిర్యాదు చేశారు.

దీంతో ఓ అధికారి ఆ దుకాణాన్ని తనిఖీ చేయడానికి వచ్చారు. గడువు ముగిసిన బిస్కెట్ ప్యాకెట్లు అమ్ముతున్నట్లు గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. దుకాణదారుడు లంచం ఆశ చూపించడంతో.. ఎలాంటి చర్యలు తీసుకోకుండా అతడిని కాపాడడానికి అధికారి ప్రయత్నించినట్లు స్థానికులు ఆరోపించారు. అనంతరం అధికారిని చుట్టుముట్టిన గ్రామస్థులు గడువు ముగిసిన బిస్కెట్లను తినాల్సిందిగా డిమాండ్ చేశారు. బలవంతంగా బిస్కెట్లు తినిపించడానికి ప్రయత్నించారు. సమాచారం అందుకున్న పోలీసులు కేసు నమోదు చేసి, ఘటనపై దర్యాప్తు చేపట్టారు.

# 14,140 అడుగుల ఎత్తున.. వీర సైనికులకు 'రాఖీ' వందనం

భారత్, చైనా సరిహద్దులో సిక్కిం వద్ద 14,140 అడుగుల ఎత్తున ఉన్న నాథు లా పాస్‌లో రక్షాబంధన్ వేడుకలు దేశభక్తి స్ఫూర్తిని చాటాయి. దేశంలోని ఆరు రాష్ట్రాల నుంచి తరలివచ్చిన 26 మంది యువతులు మన సరిహద్దులను కాపలా కాస్తున్న వీర సైనికులకు తిలకం దిద్ది, రాఖీలు కట్టారు. హేమంత్ యాదవ్ ఫౌండేషను ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసింది. శెరాథాంగ్, రానీపూల్ ప్రాంతాల్లోనూ ఈ వేడుకలు జరిగాయి. సిక్కిం యూనివర్సిటీ విద్యార్థినులు కూడా ఇందులో పాల్గొన్నారు. ఫౌండేషను వ్యవస్థాపకుడైన డాక్టర్ హేమంత్‌కుమార్ యాదవ్ మాట్లాడుతూ.. "రక్షాబంధన్ అనేది తోబుట్టువుల అనుబంధానికి మాత్రమే పరిమితం కాదు. ప్రేమ, నమ్మకం, బాధ్యత, రక్షణలతో కూడిన ఈ పండుగ జాతీయ సమైక్యతకు ప్రతీక. దేశంలోని 140 కోట్ల ప్రజలకు మేము ఇక్కడి నుంచి శుభాకాంక్షలు తెలుపుతున్నాం" అన్నారు. కఠినమైన వాతావరణ పరిస్థితుల్లో దేశమాత రక్షణకు కృషి చేస్తున్న సైనికులను కలుసుకోవడం గర్వకారణమని, ఈ వేడుక తమలో కృతజ్ఞతా భావాన్ని నింపిందని కార్యక్రమంలో పాల్గొన్న యువతులు తెలిపారు.





# పాశ్చాత్య ఏఐ... మనకు సరిపోతుందా?

కృత్రిమ మేధస్సును మనం సాధారణంగా వైజ్ఞానిక శాస్త్రం, గణితం, సాంకేతికతల ఫలితంగా చూస్తాం. కానీ అసలు ప్రశ్న- తెలివి అంటే ఏంటి, దాన్ని ఎవరు నిర్వచిస్తారు అనేదే. ఏఐ కేవలం అల్గారిథం కాదు. అది- ఒక సమాజం తన విలువలను యంత్రాల్లో ప్రతిబింబించే ప్రక్రియ. కాబట్టి పాశ్చాత్య ప్రపంచం నిర్మించిన ఏఐ నమూనాలు అందరికీ సరిపోతాయా అనే సందేహం రావడం సహజం. డేటా నుంచి నిర్ణయాల వరకూ సంస్కృతి, అధికారం, అసమానతలు దాగి ఉన్నాయి. ఒక యంత్రం తెలివైనదని ఎవరు నిర్ణయిస్తారు? ఆ నిర్ణయం ఏ సంస్కృతి ప్రమాణాల ఆధారంగా జరుగుతుంది? ఈ ప్రశ్నల దగ్గరే ఏఐ భావన అసలు స్వరూపం బయటపడుతుంది.

వోల్ఫ్‌గాంగ్ వాన్ కెంపెలెన్ 1770లో ఆస్ట్రియా మహారాణి ముందు ‘టర్క్’ అనే చదరంగం ఆడే యంత్రాన్ని ప్రదర్శించాడు. అది ప్రత్యర్థిని ఓడిస్తుండటంతో ప్రేక్షకులు ఆశ్చర్యపోయారు. కానీ తర్వాత తెలిసిందేమిటంటే, ఆ యంత్రం లోపల ఒక నిపుణుడైన చదరంగం ఆటగాడు దాక్కుని ఉన్నాడు. అది సైన్సు కాదు, కేవలం మాయాజాలం. అమెజాన్ తన ఏఐ ఆధారిత లేబర్ మార్కెట్‌కు ‘అమెజాన్ మెకానికల్ టర్క్’ అని పేరు పెట్టడం యాదృచ్ఛికం కాదు. వేలమంది కార్మికులు తక్కువ వేతనాలకు చిత్రాలను వర్గీకరిస్తూ, డేటాను లేబుల్ చేస్తూ ఏఐ వ్యవస్థలకు ప్రాణం పోస్తున్నారు. ఈ అదృశ్య కార్మికులు లేకుండా ఏఐ పనిచేయలేదు. 18వ శతాబ్దపు టర్క్ యంత్రం లోపల దాక్కున్న మనిషిలాగే, నేటి ఏఐ వెనక కూడా కనిపించని మనుషులే ఉన్నారు. ముసుగు మారిందంతే, వాస్తవం కాదు.

కొత్త వలసవాదం

ఇప్పుడు ప్రపంచవ్యాప్తంగా వ్యాపిస్తున్న ఏఐ పాశ్చాత్య నమూనానే సార్వత్రికంగా ప్రకటిస్తోంది. ఆఫ్రికన్, ఆసియన్, లాటిన్ అమెరికన్ జ్ఞాన సంప్రదాయాలు అందులో కనిపించడం లేదు. ఆలన్ ట్యూరింగ్ 1950లో ఒక పరీక్షను ప్రతిపాదించాడు. యంత్రం మనిషిలా మాట్లాడగలిగితే దాన్ని తెలివైనదిగా పరిగణించవచ్చని అన్నాడు. కానీ ప్రశ్న ఏమిటంటే, ఏ మనిషిలా? ఏ భాషలో? ఒక తెలుగు రైతు, ఒక తమిళ మత్స్యకారుడు, ఒక కేరళ ఆయుర్వేద వైద్యుడు అందరూ తెలివైనవారే. వారిలో ప్రతిఒక్కరి అనుభవ జ్ఞానమూ గొప్ప మేధస్సే. కానీ ఇంగ్లిషు ఆధారంగా నిర్మించిన ఏఐ దాన్ని గుర్తించగలదా? గుర్తించలేకపోతే ఆ ఏఐ తెలివైనదా లేక పరిమితమైనదా? సార్వత్రిక తెలివి అనే భావన కూడా ఇక్కడే ప్రశ్నార్థకమవుతుంది. గణితం నిజంగా సార్వత్రికమైనది. కానీ తెలివి కేవలం గణితం కాదు. అది అనుభవం, సందర్భం, సంబంధాలు, సంస్కృతుల కలయిక. ‘డేటా కొత్త చమురు’ అనే నినాదం ప్రపంచవ్యాప్తంగా ప్రచారంలో ఉంది. గూగుల్, ఫేస్‌బుక్, అమెజాన్ వంటి సంస్థలు ప్రపంచమంతటా వినియోగదారుల డేటాను సేకరిస్తున్నాయి. దేశంలోని కోట్లమంది వ్యక్తుల జీవన సమాచారం అమెరికన్ కంపెనీల సర్వర్లలో నిల్వ అవుతోంది. అదే డేటాను ఉపయోగించి ఏఐ వ్యవస్థలు నిర్మించి మళ్లీ మనకే అమ్ముతున్నారు. ఇది 21వ శతాబ్దపు వలసవాదం కాకపోతే మరేంటి? మన జీవితాల సమాచారం వారికి ముడిపదార్థం. వారు దాన్ని ఏఐ ఉత్పత్తిగా మార్చి తిరిగి మన మార్కెట్‌లో విక్రయిస్తున్నారు. రూపం మారినా ఆధిపత్యం మారలేదు.

ఒక సమాజం తన సమస్యలను పరిష్కరించడానికి ఏఐని నిర్మిస్తే, అది ఆ సమాజం విలువలను ప్రతిబింబిస్తుంది. కానీ ఇప్పుడు ప్రపంచాన్ని ప్రభావితం చేస్తున్న ఏఐ సిలికాన్ వ్యాలీ విలువలనే మోస్తోంది. అమెరికన్ న్యాయవ్యవస్థ ఆధారంగా నిర్మించిన ఏఐ భారతీయ న్యాయ విషయాల్లో సరైన నిర్ణయాలు తీసుకోగలదా? ఆయుర్వేదం, యునాని, సిద్ధ వైద్య సంప్రదాయాల జ్ఞానం అందులో స్థానం పొందగలుగుతుందా? అమెరికన్ ఏఐ వ్యవస్థలు నల్లజాతి వ్యక్తుల ముఖాలను గుర్తించడంలో ఎక్కువ తప్పులు చేస్తున్నాయని కొన్ని పరిశోధనలు కూడా పేర్కొన్నాయి. కారణం సాంకేతిక లోపం మాత్రమే కాదు. శిక్షణ డేటాలో తెల్లజాతి ముఖాలు అధికంగా ఉండటమే. అంటే, సమస్య అల్గారిథమ్‌లో కాదు, దాని వెనకున్న సాంస్కృతిక అసమానతల్లో ఉంది. అందుకే కొందరు నిపుణులు ‘డీప్ లెర్నింగ్’కు ప్రత్యామ్నాయంగా ‘బ్రాడ్ లెర్నింగ్’ను ప్రతిపాదిస్తున్నారు. లోతుగా వెళ్లడం కంటే విశాలంగా చూడటం మంచిదని. వేర్వేరు సంస్కృతులు, సందర్భాలు, జీవన విధానాలను అర్థం చేసుకోగల ఏఐని నిర్మించడమే ముఖ్యం. ఇది కేవలం సాంకేతిక మార్పు కాదు. ఇదొక తాత్విక విప్లవం.

ముసుగు కాకూడదు...

మన దేశంలో కూడా ఇలాంటి ప్రశ్నలు అత్యవసరం. ఐఐటీలు, ఐఐఎస్‌సీ వంటి సంస్థలు ఏఐ పరిశోధనలో ముందున్నాయి. కానీ మనం నిర్మిస్తున్న ఏఐ భారతీయ జ్ఞాన సంప్రదాయాలను, గ్రామీణ అనుభవాలను, స్థానిక విలువలను ప్రతిబింబిస్తోందా? లేదా పాశ్చాత్య నమూనాలనే అనుసరిస్తోందా అన్నది పరిశీలనార్హం. తెలివి అనేది కొలిచే వస్తువు కాదు. అది సందర్భం, సంస్కృతి, సంబంధాలు కలిసి తయారయ్యే సజీవ ప్రక్రియ. ఒక తెలుగు తాత మనవడికి చెప్పే కథలో ఉన్న మెలకువ, తెలివి చాట్‌జీపీటీ సమాధానంలో ఉండదు. ఒక వైద్యుడు రోగిని చూసి తీసుకునే నిర్ణయంలో ఉన్న జీవానుభవం, వైద్య ఏఐ అల్గారిథమ్‌లో పూర్తిగా దొరకదు. ఇది ఏఐని తక్కువ చేయడం కాదు. మానవ మేధస్సు విశాలతను గుర్తించడం. యంత్రం తెలివైనదవుతుందా అనే ప్రశ్నకంటే ముఖ్యమైంది, మనకు అవసరమైన తెలివి ఏది, ఆ తెలివిని ఎవరు నిర్ణయిస్తారు అనేది. ఆ నిర్ణయం కేవలం సిలికాన్ వ్యాలీ ఇంజినీర్ల చేతుల్లో ఉండకూడదు. అది మన సమాజం, సంస్కృతి, అనుభవాల నుంచి పుట్టాలి. అప్పుడు మాత్రమే ఏఐ నిజంగా మానవ సేవలో తరిస్తుంది. లేకపోతే అదొక అందమైన ముసుగు వేసుకున్న మరో ‘టర్క్’ యంత్రంగానే మిగిలిపోతుంది.



# హైడ్రా: హైదరాబాద్ కోల్పోయిన జల రక్షణ కవచాన్ని పునరుద్ధరించే పోరాటం

1908 మూసీ వరదల నుంచి నేటి ఆక్రమణలపై పోరాటం వరకు—హైదరాబాద్ జలవనరులు దూరదృష్టి, నిర్లక్ష్యం, పట్టణ పునరుద్ధరణ అవసరాన్ని చాటుతున్నాయి.

**ఒకప్పుడు “సరస్సుల నగరం”గా పేరొందిన హైదరాబాద్, మూసీ నది చుట్టూ విస్తరించిన చెరువులు, కుంటలు, సరస్సులు, కాలువలు, నాలాలతో కూడిన విస్తృత జల వ్యవస్థపై అభివృద్ధి చెందింది. ఈ పరస్పర అనుసంధానమైన వ్యవస్థ నగర సౌందర్యంలో భాగం మాత్రమే కాదు; వర్షపు నీటిని నిల్వ చేయడం, భూగర్భ జలాలను పునఃభర్తీ చేయడం, పెరుగుతున్న నగరాన్ని వరదల నుంచి రక్షించడం వంటి కీలక విధులను నిర్వహించింది. అయితే దశాబ్దాలుగా కొనసాగుతున్న వేగవంతమైన పట్టణీకరణ, ఆక్రమణలు, పర్యావరణ మరియు భూ వినియోగ నిబంధనల అమలులో లోపాలు ఈ సహజ వరద రక్షణ వ్యవస్థను క్రమంగా బలహీనపరిచాయి.ఈ పరిస్థితిని మార్చే ప్రయత్నంలో తెలంగాణ ప్రభుత్వం 2024 జులై 19న హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ అసెట్ ప్రొటెక్షన్ ఏజెన్సీను ఏర్పాటు చేసింది. విపత్తుల సమయంలో స్పందనను బలోపేతం చేయడం, ప్రభుత్వ ఆస్తులను రక్షించడం, ఆక్రమణకు గురైన చెరువులు, కుంటలు, నాలాలు, ప్రభుత్వ భూములను తిరిగి స్వాధీనం చేసుకోవడం హైడ్రా ప్రధాన లక్ష్యాలుగా ఉన్నాయి. రెండు సంవత్సరాల వ్యవధిలోనే హైడ్రా పట్టణ పాలనలో కీలక సంస్థగా ఎదిగింది. అయితే దాని కూల్చివేత చర్యలు న్యాయపరమైన, రాజకీయ, మానవతా అంశాలపై చర్చకు కూడా దారితీశాయి.**





డా. ముచ్చుకోట సురేష్ బాబు,
9989988912

1908 మూసీ వరదలు: ఒక చారిత్రక మలుపు

హైదరాబాద్ నేటి వరద ముప్పుకు మూలాలను 1908 సెప్టెంబర్‌లో సంభవించిన భయానక మూసీ వరదల్లో చూడవచ్చు. ఎగువ ప్రాంతాల్లో కురిసిన అత్యంత భారీ వర్షాల కారణంగా మూసీ నది ఉప్పొంగి నగరంలోని అనేక ప్రాంతాలను ముంచెత్తింది. ఒక్క రోజులో సుమారు 430 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైనట్లు నివేదికలు పేర్కొంటున్నాయి. భారీగా ఆస్తి, ప్రాణ నష్టం సంభవించింది.ఈ విపత్తు హైదరాబాద్ పట్టణ ప్రణాళికలో కీలక మలుపుగా మారింది. వరదలకు కారణాలను అధ్యయనం చేసి, భవిష్యత్తులో ఇలాంటి విపత్తులు పునరావృతం కాకుండా చర్యలను సూచించేందుకు అప్పటి హైదరాబాద్ ప్రభుత్వం మైసూరు దివాన్‌గా పనిచేస్తున్న ప్రముఖ ఇంజనీర్ మోక్షగుండం విశ్వేశ్వరయ్యను ఆహ్వానించింది.ఆయన సూచనల ఫలితంగా నగరానికి ఎగువ ప్రాంతాల్లో 1920లో ఉస్మాన్ సాగర్, 1927లో హిమాయత్ సాగర్ నిర్మించబడ్డాయి. వీటితో పాటు అనేక చిన్న చెరువులు, కుంటలు, జలాశయాలను అభివృద్ధి చేసి నిర్వహించారు.అధిక వర్షపు నీటిని నిల్వ చేయడం, దాని ప్రవాహాన్ని నియంత్రించడం, మూసీపై ఒత్తిడిని తగ్గించడం ఈ వ్యవస్థ ప్రధాన ఉద్దేశం. చెరువులు, కుంటలు, నాలాలు పరస్పరం అనుసంధానమై పనిచేసేవి. ఆధునిక పర్యావరణ ప్రణాళికలో “అర్బన్ వాటర్ రెసిలియెన్స్” అనే భావన ప్రాచుర్యంలోకి రాకముందే హైదరాబాద్ ఒక సమగ్ర పట్టణ జల రక్షణ వ్యవస్థను అభివృద్ధి చేసిందని చెప్పవచ్చు.

**కనుమరుగైన జల వ్యవస్థ**

కాలక్రమేణా ఈ వ్యవస్థ విచ్ఛిన్నమవడం ప్రారంభమైంది. వేగవంతమైన పట్టణ విస్తరణతో చెరువులు, తడిబయళ్లు, నీటి ప్రవాహ మార్గాలు, సహజ డ్రైనేజీ మార్గాలు నివాస కాలనీలు, వాణిజ్య సముదాయాలు, ఇతర నిర్మాణాలకు గురయ్యాయి. ఒక చెరువును మరో చెరువుతో అనుసంధానించే నీటి మార్గాలు కుంచించుకుపోయాయి లేదా పూర్తిగా మూసుకుపోయాయి. చెరువు గర్భాలు, ఫుల్ ట్యాంక్ లెవెల్ ప్రాంతాలు, బఫర్ జోన్లలోనూ ఆక్రమణలు పెరిగాయి.రిమోట్ సెన్సింగ్ అధ్యయనాలు హైదరాబాద్ నగర నిర్మిత ప్రాంతం ఎంత వేగంగా విస్తరించిందో వెల్లడించాయి. 1973లో సుమారు 245 చదరపు కిలోమీటర్లుగా ఉన్న నిర్మిత ప్రాంతం 1996 నాటికి 587 చదరపు కిలోమీటర్లకు పెరిగినట్లు అధ్యయనాలు సూచిస్తున్నాయి. సహజ భూభాగాల స్థానంలో కాంక్రీట్ నిర్మాణాలు పెరగడంతో వర్షపు నీటిని గ్రహించి నిల్వ చేసుకునే నగర సామర్థ్యం గణనీయంగా తగ్గిపోయింది.హుస్సేన్ సాగర్ ఈ మార్పుకు అత్యంత స్పష్టమైన ఉదాహరణ. ఒకప్పుడు తాగునీటి వనరుగా నిర్మించబడిన ఈ సరస్సు కాలక్రమంలో కాలుష్యం, పట్టణ ఒత్తిళ్ల కారణంగా ఆ పాత్రను కోల్పోయింది. నగరంలోని అనేక జలవనరులు ఆక్రమణలు, కాలుష్యం, నిర్మాణాల కారణంగా వాటి అసలు స్వరూపాన్ని కోల్పోయాయి.దీని ప్రభావం ప్రతి వర్షాకాలంలో కనిపిస్తోంది. హైదరాబాద్‌లో వరదలకు కేవలం భారీ వర్షపాతం మాత్రమే కారణం కాదు; సహజ నీటి ప్రవాహ మార్గాలు మూసుకుపోవడం కూడా ప్రధాన కారణం. గతంలో చెరువులు, నాలాల ద్వారా ప్రవహించిన వర్షపు నీరు ఇప్పుడు భవనాలు, రహదారులు, ప్రహరీ గోడలు, ఇతర నిర్మాణాలను ఎదుర్కొంటోంది. ఫలితంగా కొద్దిసేపు కురిసే భారీ వర్షం కూడా లోతట్టు ప్రాంతాలను ముంచెత్తుతోంది.

**హైడ్రా: ఆక్రమణలపై చర్య**

ఈ నేపథ్యంలో హైడ్రా ప్రాధాన్యత సంతరించుకుంది. కమిషనర్ ఏ.వి. రంగనాథ్ నేతృత్వంలో ప్రభుత్వ భూములు, చెరువులు, ఎఫ్‌టీఎల్ ప్రాంతాలు, బఫర్ జోన్లు, డ్రైనేజీ మార్గాల్లోని ఆక్రమణలపై సంస్థ చర్యలు చేపట్టింది. ప్రభావవంతమైన వ్యక్తులు, సంస్థలకు సంబంధించిన నిర్మాణాలపై కూడా చర్యలు తీసుకోవడం హైడ్రా చర్యలకు విస్తృత ప్రచారం తెచ్చింది.2026 జులైలో వెలువడిన నివేదికల ప్రకారం, హైడ్రా రెండేళ్లలో 3,300 ఎకరాలకు పైగా ప్రభుత్వ భూమిని తిరిగి స్వాధీనం చేసుకుంది. ఈ భూముల విలువ సుమారు రూ.1.5 లక్షల కోట్లుగా అంచనా వేయబడింది. చెరువుల పునరుద్ధరణ, నాలాల్లోని అడ్డంకుల తొలగింపు, ప్రజా స్థలాల రక్షణ వంటి కార్యక్రమాలను కూడా హైడ్రా చేపట్టింది.అయితే హైడ్రా విజయాన్ని కేవలం ఎన్ని నిర్మాణాలను కూల్చింది, ఎన్ని ఎకరాలను స్వాధీనం చేసుకుంది అనే లెక్కలతో మాత్రమే అంచనా వేయకూడదు. తిరిగి స్వాధీనం చేసుకున్న చెరువులు, డ్రైనేజీ వ్యవస్థలు భవిష్యత్తులో మళ్లీ ఆక్రమణలకు గురి కాకుండా రక్షించబడుతున్నాయా? హైదరాబాద్ భవిష్యత్ వరదలను ఎదుర్కొనే సామర్థ్యం పెరుగుతోందా? అనేదే అసలు ప్రశ్న.

**సాంకేతికతతో శాశ్వత రక్షణ**

ఈ లక్ష్యాన్ని సాధించడంలో సాంకేతిక పరిజ్ఞానం కీలక పాత్ర పోషించగలదు. రిమోట్ సెన్సింగ్, జీఐఎస్ మ్యాపింగ్, జీపీఎస్ సర్వేలు, వర్చువల్ ఫెన్సింగ్, సీసీటీవీ నిఘా వంటి సాంకేతిక పరిజ్ఞానాల ద్వారా చెరువుల హద్దులు, ఎఫ్‌టీఎల్ ప్రాంతాలు, బఫర్ జోన్లను ఖచ్చితంగా గుర్తించి పర్యవేక్షించవచ్చు. శాశ్వత డిజిటల్ రికార్డులు హద్దులను మార్చకుండా నిరోధించడమే కాకుండా, కొత్త ఆక్రమణలు శాశ్వత నిర్మాణాలుగా మారకముందే గుర్తించేందుకు సహాయపడతాయి.

**అభివృద్ధితో పాటు మానవత్వం కూడా అవసరం**

అయితే ఆక్రమణలపై చర్యలు చట్టబద్ధమైన ప్రక్రియను అనుసరించాలి. నోటీసులు, భూ రికార్డులు, రక్షిత ప్రాంతాల గుర్తింపు వంటి అంశాలపై పలువురు ఆస్తి యజమానులు, సంస్థలు న్యాయస్థానాలను ఆశ్రయించారు. పర్యావరణ పరిరక్షణతో పాటు చట్టబద్ధత, సహజ న్యాయం కూడా సమానంగా ఉండాలి. ముఖ్యంగా ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్లలో దశాబ్దాలుగా నివసిస్తున్న కుటుంబాల సమస్య అత్యంత సున్నితమైనది. ఉద్దేశపూర్వకంగా చేపట్టిన వాణిజ్య ఆక్రమణలు, భూకబ్జాలపై కఠిన చర్యలు అవసరమైనప్పటికీ, ఆర్థికంగా బలహీన కుటుంబాల పరిస్థితిని మానవతా దృక్పథంతో పరిశీలించాలి.ఇలాంటి ఇళ్లను తొలగించే పరిస్థితి ఏర్పడితే, స్పష్టమైన పునరావాస విధానం లేకుండా వందలాది కుటుంబాలు నిరాశ్రయులయ్యే ప్రమాదం ఉంది. అందువల్ల ఉద్దేశపూర్వక వాణిజ్య ఆక్రమణలు, దీర్ఘకాలంగా నివసిస్తున్న నిరుపేద కుటుంబాల మధ్య స్పష్టమైన తేడాను గుర్తించాలి. పునరావాసం తప్పనిసరైన సందర్భాల్లో అర్హులైన కుటుంబాలకు ప్రత్యామ్నాయ గృహాలు, తగిన సహాయం అందించే పారదర్శక విధానం ఉండాలి.

**దేశవ్యాప్త సమస్య**

హైదరాబాద్ సమస్య ఒక్క నగరానికే పరిమితం కాదు. బెంగళూరు, ఢిల్లీ, అహ్మదాబాద్ వంటి నగరాలు కూడా వేగవంతమైన పట్టణీకరణ కారణంగా చెరువులు, సరస్సులు, తడిబయళ్లు, సహజ నీటి మార్గాలను కోల్పోతున్నాయి. దేశవ్యాప్తంగా స్వల్పకాలిక అభివృద్ధి కోసం జలవనరులను ధ్వంసం చేయడం వల్ల నగరాలు వరదలు, నీటి కొరత, పర్యావరణ నష్టాలకు మరింతగా గురవుతున్నాయి.అందువల్ల హైడ్రా ఒక ముఖ్యమైన ప్రయోగం. జలవనరులను పట్టణ అభివృద్ధికి అడ్డంకులుగా కాకుండా కీలక ప్రజా మౌలిక వసతులుగా చూడాలి. చెరువులు, తడిబయళ్లు, నాలాలు వర్షపు నీటిని నిల్వ చేస్తాయి, భూగర్భ జలాలను పెంచుతాయి, వరదలను తగ్గిస్తాయి, జీవవైవిధ్యాన్ని కాపాడతాయి.హైదరాబాద్ దశాబ్దాల పర్యావరణ నిర్లక్ష్యాన్ని సరిదిద్దుకునే అవకాశం ఇప్పుడు ఉంది. అయితే కేవలం బుల్డోజర్లతో నగర పర్యావరణ సమతుల్యతను పునరుద్ధరించడం సాధ్యం కాదు. శాస్త్రీయ ప్రణాళిక, సాంకేతిక పర్యవేక్షణ, రాజకీయ సంకల్పం, పారదర్శక పాలన, కఠినమైన చట్ట అమలు, మానవతా దృక్పథంతో కూడిన పునరావాసం అవసరం.1908 మూసీ వరదలు మనకు అందించిన పాఠం నేటికీ వర్తిస్తుంది. హైదరాబాద్ భవిష్యత్ భద్రత మరిన్ని కాంక్రీట్ నిర్మాణాలపై మాత్రమే ఆధారపడదు. ఒకప్పుడు నగరానికి మొదటి రక్షణ కవచంగా నిలిచిన చెరువులు, కుంటలు, సరస్సులు, సహజ నీటి ప్రవాహ మార్గాలను పునరుద్ధరించి, వాటిని శాశ్వతంగా రక్షించడంపైనే ఆధారపడి ఉంటుంది.హైడ్రా విజయాన్ని ఎన్ని నిర్మాణాలను కూల్చిందనే దానితో కాదు; హైదరాబాద్ కోల్పోయిన జల రక్షణ వ్యవస్థను ఎంత సమర్థంగా పునరుద్ధరించి, భవిష్యత్ తరాలకు ఎంత సమర్థంగా కాపాడగలిగిందనే దానితోనే కొలవాలి.

# నవీన కాలానికి నవ జాతీయగీతం!

**సదా కొత్తదనాన్ని ఆవాహన చేసుకోవడమే జీవ ధర్మం. మన కాలానికి అవసరమైన ఒక కొత్త జాతీయ గీతాన్ని సృజించాలని యువభారతీయులకు గుల్జార్ పిలుపునిచ్చారు. దేశం 80వ స్వాతంత్ర్యదినోత్సవ వేడుకలు జరుపుకున్న మరో మూడు రోజులకు గుల్జార్ 92వ ఏట ప్రవేశించారు. ‘జనగణమన’ లేదా ‘వందేమాతరం’ స్థానాన్ని భర్తీ చేసేందుకు కాకుండా సమకాలీన విభజనవాద రాజకీయాలను త్రోసిపుచ్చి, జాతిజీవనంలోని అపార వైవిధ్యాన్ని గౌరవించే ఒక అనుబంధ జాతీయ గీతాన్ని సృష్టించాల్సిన అవసరమున్నదని గుల్జార్ విజ్ఞప్తి చేశారు. తాము భారతీయులమనే ప్రగాఢ ఐక్యతా భావాన్ని పెంపొందించే ఒక కొత్త దేశభక్తి గీతాన్ని సృజించుకోవాలని అన్నారు. వర్తమాన భారతదేశం గొప్పదనాన్ని కీర్తించడంలో దశాబ్దాల నాటి పాత పాటలపై ఆధారపడకూడదని ఆయన అభిప్రాయపడ్డారు. సమకాలీన భారతీయ సమాజంలోని విభిన్న స్వరాలను ప్రతిబింబించేలా జాతీయ అస్తిత్వాన్ని పునర్ నిర్వచించుకోవాలని గుల్జార్ అన్నారు.**




తన కొత్త గీతం ‘ఏక్ అకేలా హిందుస్థానీ, దో మిలే తో హిందుస్థాన్’ వీడియో విడుదల సందర్భంగా గుల్జార్ ఆ విజ్ఞప్తి చేశారు. ఉమ్మడి సాంస్కృతిక వైవిధ్యం ద్వారా ఆత్మీయత, ఐక్యతా భావాన్ని శ్రోత మనసులో నెలకొల్పే ‘మిలే సుర్ మేరా తుమ్హారా’ లాంటి గీతమది. గుల్జార్‌కు ప్రగాఢ అభిమానినే అయినప్పటికీ ఆయన సృజించిన ‘ఏక్ అకేలా హిందుస్థానీ’ ఇప్పుడు మనకు అవసరమైన కొత్త దేశభక్తి గీతం అని నేను భావించడం లేదు. అలా భావించాలని కవి కూడా కోరుకోలేదు. మన కాలానికి అవసరమైన కొత్త దేశభక్తి గీతాన్ని సృష్టించమని యువ భారతీయులను ఆయన ఆహ్వానించారు.

ఆనందప్రదమైన విషయమేమిటంటే రవీంద్రుని ‘జనగణమన’ గానీ, బంకించంద్ర ‘వందేమాతరం’ గానీ తమ ప్రేరణాత్మక గుణాన్ని కోల్పోలేదు, కోల్పోవు కూడా. ఆ అజరామర గీతాల విశిష్ట చారిత్రక ప్రస్థానాన్ని టి.ఎమ్.కృష్ణ తన ఇటీవలి పుస్తకం ‘We The People of India: Decoding A Nation’s Symbols’లో విపులంగా వివరించారు. నా తరం భారతీయులు ‘జనగణమన’ వినపడగానే గౌరవపూర్వకంగా లేచి నిలబడేవారు. ఆ ఆచారం కాలం గడుస్తున్న కొద్దీ కొత్త అర్థాలను సంతరించుకున్నది. పౌరసత్వ సవరణ చట్టానికి వ్యతిరేకంగా ఉద్యమింపచేయడంలో ఆ అధికారిక జాతీయ గీతం అశేష ప్రజలకు ఎనలేని స్ఫూర్తినిచ్చింది. బంకించంద్ర ‘వందేమాతరం’ కూడా అంతే స్ఫూర్తిదాయకమైనది. ఆకాశవాణి విన్పించే ‘వందేమాతరం’ కాకుండా ‘ఆనంద్ మఠ్’ సినిమాలోని పాటే నాకు బాగా నచ్చింది. ఈ రెండు గీతాలూ పవిత్రమైనవి, ఉత్కృష్టమైనవి, అన్ని సందర్భాలలోను ఆలాపించేందుకు యుక్తమైనవి.

దేశభక్తి గీతాల పట్ల అనురక్తి, గౌరవభావం నిండుగా వ్యక్తమైన భారతదేశంలో నేను పెరిగాను. ఇక్బాల్ ‘సారే జహాఁ సే అచ్ఛా, హిందుస్థాన్ హమారా’ను విస్మరించగలమా? స్వాతంత్ర్యోద్యమం నుంచి మనకు వారసత్వంగా సంక్రమించిన ఉదాత్తగీతమది. భారత జాతీయవాదం సంకుచితమైనదికాదు. మన పొరుగు దేశం, శత్రు రాజ్యం పట్ల వ్యతిరేక భావాలను పురిగొల్పేదికాదు. ‘జో జిసాసే మిలా సీఖా హమ్నే/ గైరోంకో భీ అప్నాయ హమ్నే’ (కలిసిన ప్రతి ఒక్కరి నుండి నేర్చుకున్నాం, అపరిచితులను కూడా సొంతవారిగా స్వీకరించాం) అన్న విశ్వ దృక్పథంతో మన జాతీయవాదం భారత్‌ను విశిష్టంగా నిర్వచించింది. 1960లు, 1970ల్లోని మా బోటి పిల్లలకు ‘ఆవో బచ్చో తుమ్హే దిఖాయే’, ‘హమ్ లాయేహై తూఫాన్ సే’ మొదలైన దేశభక్తిగీతాలు ఆదర్శవంతమైన దేశాన్ని నిర్మించాలని ప్రబోధించాయి. మంచి పౌరులుగా ఎదిగేందుకు అవి స్ఫూర్తినిచ్చాయి. ఇక్బాల్ అజరామర గీతంలోని ‘మజ్హబ్ నహీ సిఖాతా ఆపస్ మే బైర్ రఖ్నా’ (ఒకరి పట్ల ఒకరు ద్వేషాన్ని పెంచుకోవాలని మతం బోధించదు) అన్న సత్యాన్నే సాహిర్ సుప్రసిద్ధ సినిమా గీతం ‘తూ హిందు బనేగా నా ముసల్మాన్ బనేగా, ఇన్సాన్ కీ ఔలాద్ హై ఇన్సాన్ బనేగా’ (ఒక బిడ్డకు ఏ మతం ముద్ర వేయకముందే వారు మొదట మనుషులుగా జన్మిస్తారు)లో కూడా ప్రతిధ్వనించింది. ‘అప్నీ అజాదీ కో హమ్ హర్గిజ్ మిటా సక్తే నహీ’ మొదలైన పాటలు స్వాతంత్ర్యం విలువను ఉద్ఘాటించాయి, ‘సాథీ హాత్ బఢానా’, ‘చోడో కల్ కీ బాతే’ మొదలైనవి జాతి నిర్మాణంలో భాగస్వాములు కావాలని ప్రతి భారతీయుడినీ ఆహ్వానించాయి. తోటి మనుషులకు సేవ చేయడమే దేశాన్ని ఆరాధించడమని నా బాల్యంలో మేము పాడిన దేశభక్తి గీతాలు ఉద్బోధించాయి. ఈ ఉదాత్త భావనే నేను విశ్వసించే జాతీయవాదం. 1962, 1965, 1971 యుద్ధాల చరిత్ర ఆధారంగా నిర్మించిన సినిమా గీతాలు ‘ఆయే మేరే వతన్ కే లోగో’, ‘కర్ చలే హమ్ ఫిదా’ మొదలైన గీతాలు కూడా ఉదాత్త దేశభక్తిని ప్రేరేపించాయి గానీ సంకుచిత జాతీయోన్మాదాన్ని రెచ్చగొట్టలేదు. మనోజ్‌కుమార్ ప్రాచుర్యంలోకి తెచ్చిన దేశభక్తి కూడా నైతిక విలువలకు ప్రాధాన్యమిచ్చింది. అది నిరాడంబర దేశభక్తి. మా చిన్నతనంలో సినిమాలు చూడడానికి మా పెద్దలు అనుమతించేవారు కాదు. ప్రస్తావిత గీతాలు అన్నిటినీ తెరపై చూడడం కంటే రేడియో ద్వారానే ఎక్కువగా వింటుండేవాళ్లం. ఇప్పటి దేశభక్తిగీతాలు నాకు అంతగా స్ఫూర్తినివ్వడం లేదు. వాటితో మమేకం కాలేకపోతున్నాను. ఆస్వాదించలేకపోతున్నాను. రాజకీయ స్పృహతో రాసిన కవిత్వం అర్థవంతమైనది. అటువంటి కవితలను తరచు చదువుతుంటాను. ప్రసిద్ధ కవి రఘువీర్ సహాయ్ వ్యంగ్య కవిత ‘అధినాయక్’ స్వాతంత్ర్యానంతరం కూడా సామాన్య ప్రజల దుస్థితి మారలేదని అధిక్షేపించింది. వినోద్ కుమార్ శుక్లా ‘లగ్భగ్ జైహింద్’ దేశభక్తి సూత్రాలకు, వాస్తవ మానవ శ్రేయస్సుకు మధ్య ఉన్న అంతరాన్ని బహిర్గతం చేసింది. సర్వేశ్వర్ దయాళ్ సక్సేనా, దుష్యంత్ కుమార్ కవితలు ప్రజల నిరాశా నిస్పృహలను ప్రభావశీలంగా వ్యక్తం చేశాయి. ఉదాత్త దేశభక్తిగీతాల కోసం నా అన్వేషణ నన్ను ఫైజ్ అహ్మద్ ఫైజ్, ఇక్బాల్ బానో కవిత్వానికి తీసుకువెళ్లాయి. జనప్రియ హిందీ గీతాలు, పాటలకు నా పఠనాసక్తులలో చోటు లేదు. అలా అని నేను వాటిని వినకపోలేదు. ‘చక్ దే ఇండియా’ నా హృదయాన్ని తాకింది. ‘సందేశే ఆతే హై’ స్ఫూర్తిదాయక గీతమే కానీ ‘కర్ చలే హమ్ ఫిదా’లా భావావేశం కలిగించేది కాదు. ‘యే జో దేశ్ హై తేరా’ అనుభూతించడానికి అవసరమైన ప్రవాస జీవితానుభవాలు నాకు లేవు. ‘మా తుఝే సలామ్’ సంగీత బాణీ అత్యాధునికంగా ఉంటుంది. అయితే ఆ చరణాలలోని భాష పాత శైలిలో ఉంటుంది. దాని సందేశం కూడా గతించిన కాలపు దేశభక్తి ప్రపూరితంగా ఉంటుంది. ఈ రీతికి ‘రంగ్ దే బసంతి’ కొంచెం మినహాయింపు. దేశభక్తి, ప్రభుత్వ విధేయత మధ్య తేడాను ఈ గీతం స్పష్టంగా ఎత్తి చూపుతుంది. సరే, గత ఒక దశాబ్ద కాలంలో ‘తేరీ మిట్టీ’, ‘చల్లా’ మొదలైన పాటలు బాగా ప్రజాదరణ పొందాయి. తీవ్ర జాతీయవాదాన్ని ప్రబోధించే ఆ పాటలు నా చిన్ననాటి మానవీయ జాతీయవాదానికి భిన్నమైనవి, విరుద్ధమైనవి.

కొత్త దేశభక్తి గీతాన్ని సృజించాలని యువ భారతీయులకు గుల్జార్ ఇచ్చిన పిలుపు సమయోచితమైనది. అయితే స్వాతంత్ర్య శతాబ్దికి వడివడిగా పురోగమిస్తోన్న భారత్‌కు అవసరమైన జాతీయ గీతాన్ని సృష్టించేందుకు సాహిత్య ప్రతిభ, సంగీత మేధస్సు మాత్రమే సరిపోవు. భారత్ భావనకు ఒక కొత్త నిర్వచనమిచ్చే దార్శనికత అవసరం. నేటి సంకుచిత జాతీయవాద దృక్కోణాలను విడనాడి ప్రతి పౌరుడిని గౌరవించే మానవత, సమ్మిళిత దృక్పథాన్ని కొత్త దేశభక్తి గీతం విస్పష్టంగా ఆవిష్కరించాలి. అటువంటి స్ఫూర్తిదాయక జాతీయ గీతమే భారతదేశాన్ని పునః సృష్టించగలుగుతుంది. దళితులు ఆదివాసులు, మహిళలు, మైనారిటీలతో సహా సమస్త అణగారిన వర్గాలవారు ఒక వినూత్న చైతన్యంతో తమ గళాలను విన్పిస్తున్న కాలమిది. జాగృతమవుతున్న నవభారత వాణిలో వారి గొంతుకలు ప్రతిధ్వనించకపోతే ఎలా? నవ భావ భారతం తేజరిల్లాలన్నా, విస్తరిల్లాలన్నా ఇప్పటివరకు విస్మరణకు గురైన సామాజికవర్గాల వాణికి సముచిత న్యాయం చేయాలి.

అనంత జనశక్తి
జనం కోసమే మా అక్షరం
ఆదివారం | అనంతపురం | 30.08.2026 | 01

## కళాశాలలో గిడుగు రామ్మూర్తి పంతులు జయంతి వేడుకలు

**-కళాశాల ప్రిన్సిపల్ వై. ప్రశాంతి.**



**ధర్మవరం ఆగస్టు 29, అనంత జనశక్తి న్యూస్:**

తెలుగు భాషా దినోత్సవం సందర్భంగా ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల,ధర్మవరం నందు తెలుగు భాషా దినోత్సవం వేడుకలు ఘనంగా నిర్వహించడం జరిగింది.కళాశాల ప్రిన్సిపాల్ వై ప్రశాంతి మాట్లాడుతూ..... తెలుగు భాష ఔన్నత్యాన్ని ,తెలుగు భాషకు గిడుగు రామ్మూర్తి పంతులు చేసిన విశేషమైన సేవను కొనియాడుతూ, తెలుగు భాష కన్నతల్లి వంటిదని, పరభాషా వ్యామోహం వీడాలని ప్రిన్సిపాల్ విద్యార్థుల ఉద్దేశించి ప్రసంగించారు. ప్రాచీన కాలం నుంచి ఆధునిక కవుల వరకు తెలుగు భాష ఔన్నత్యాన్ని, కవుల సాహిత్య సేవను వారి విశేష రచనలను తెలుగు అధ్యాపకులు ఎన్. మల్లికార్జున వివరించడం జరిగింది. ఈ కార్యక్రమం కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ పి.జశ్వంత్ పర్యవేక్షణలో నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ మరియు కళాశాల సిబ్బంది తెలుగు అధ్యాపకుడైన ఎన్ .మల్లికార్జున ను ఘనంగా సన్మానించడం జరిగింది.

### మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు కృషితో

# జిల్లాలో రహదారులకు కొత్త వెలుగు

- 33.20 కి.మీ. మేర రోడ్ల అభివృద్ధికి రూ.55.70 కోట్లు
- రహదారుల నిర్మాణానికి భారీగా నిధులు మంజూరు
- శ్రీకాకుళం జిల్లాలో రూ.55.70 కోట్లతో రోడ్ల విస్తరణ, అభివృద్ధి
- రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు కృషి ఫలితమే
- కేంద్ర రహదారుల నిధి నుంచి అనుమతులు సాధించిన మంత్రి



**శ్రీకాకుళం,కోటబొమ్మాళి ఆగస్టు 28, అనంత జనశక్తి న్యూస్**

జిల్లాలో మౌలిక వసతుల కల్పనకు, రవాణా సౌకర్యాల మెరుగుదలకు రాష్ట్ర వ్యవసాయ, సహకార, పశుసంవర్ధక శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ప్రత్యేక చొరవ తీసుకున్నారు. టెక్కలి, నరసన్నపేట సహా, శ్రీకాకుళం పార్లమెంట్ నియోజకవర్గాల పరిధిలో దెబ్బతిన్న కీలక రహదారుల పునర్నిర్మాణానికి భారీగా నిధులు తీసుకురావడంలో ఆయన విజయం సాధించారు. మంత్రి అచ్చెన్నాయుడు నిరంతర కృషి, పట్టుదలతో ప్రతిపాదించిన రోడ్డు విస్తరణ పనులకు రాష్ట్ర ప్రభుత్వం పరిపాలనా ముందస్తు అనుమతులు మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది.

**డోల-పొలాకి-నౌపడ రహదారికి పూర్వవైభవం**

జిల్లాలోని అత్యంత ప్రాధాన్యత కలిగిన డోలపొలాకి నౌపడ రహదారి విస్తరణ, బలోపేతం పనులకు నిధులు కేటాయించారు. ఈ పనులను రెండు విభాగాలుగా చేపడుతున్నారు:మొదటి విడత (నరసన్నపేట/శ్రీకాకుళం పరిధి): కిలోమీటర్ 0/0 నుండి 17/0 వరకు మొత్తం 13.00 కిలోమీటర్ల పరిధిలోని రహదారి పనులకు రూ. 25.20 కోట్లు (రూ. 2,520 లక్షలు) మంజూరయ్యాయి. రెండో విడత (టెక్కలి/శ్రీకాకుళం పరిధి): కిలోమీటర్ 17/0 నుండి 37/200 వరకు మిగిలిన 20.20 కిలోమీటర్ల పరిధిలోని రోడ్డు పనులకు రూ. 30.50 కోట్లు (రూ. 3,050 లక్షలు) కేటాయించారు.మొత్తంగా డోలపొలాకినౌపడ మార్గంలో 33.20 కిలోమీటర్ల పొడవైన రహదారి విస్తరణ కోసం రూ. 55.70 కోట్లను ప్రభుత్వం విడుదల చేసింది.మంత్రి అచ్చెన్నాయుడికి కృతజ్ఞతలు

కేంద్ర రహదారుల నిధి (సి ఆర్ ఐ ఎఫ్) స్కీమ్ ద్వారా నిధులు సమీకరించి, ఈ ముఖ్యమైన రహదారుల పనులకు జీవో (జీవో ఆర్టీ నం. 459, రవాణా, రహదారులు, భవనాల శాఖ, తేదీ: 28082026) విడుదలయ్యేలా చేసిన మంత్రి అచ్చెన్నాయుడికి జిల్లా ప్రజలు, ఆయా ప్రజాప్రతినిధులు, వాహనదారులు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.ఈ రోడ్ల నిర్మాణం పూర్తయితే తీరప్రాంత గిరిజన, మత్స్యకార గ్రామాలతో పాటు నరసన్నపేట, టెక్కలి, నౌపడ ప్రాంతాల మధ్య రవాణా వ్యవస్థ మెరుగవుతుందని, ప్రయాణ సమయం తగ్గడంతో పాటు స్థానిక వ్యాపార, వ్యవసాయ ఉత్పత్తుల రవాణాకు ఎంతో ఊతం లభిస్తుందని స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. త్వరలోనే టెండర్ ప్రక్రియ పూర్తి చేసి, నిర్మాణ పనులను వేగవంతంగా పూర్తి చేసేందుకు అధికారులు చర్యలు వేగవంతం చేశారు.



## అనంతగిరిలో ఘనంగా తెలుగు భాషా దినోత్సవం,జాతీయ క్రీడా దినోత్సవం

**అనంతగిరి,ఆగస్టు 29:అనంత జనశక్తి న్యూస్**

అనంతగిరి మండల కేంద్రంలోని గిరిజన బాలికల పాఠశాల-2లో తెలుగు భాషా దినోత్సవం, జాతీయ క్రీడా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. పాఠశాల హెచ్ఎం బి. మంగమ్మ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాలు నిర్వహించారు.తెలుగు భాషా దినోత్సవాన్ని పురస్కరించుకొని తెలుగు భాషా వికాసానికి విశేష కృషి చేసిన గిడుగు వెంకట రామమూర్తి జయంతిని స్మరించుకున్నారు. అదేవిధంగా భారత హాకీ దిగ్గజం మేజర్ ధ్యాన్‌చంద్ జయంతిని పురస్కరించుకొని జాతీయ క్రీడా దినోత్సవాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా గిడుగు రామమూర్తి, మేజర్ ధ్యాన్‌చంద్ చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. విద్యార్థులకు తెలుగు భాష ప్రాధాన్యత, మాతృభాష పరిరక్షణ ఆవశ్యకతతో పాటు క్రీడల ప్రాముఖ్యతను ఉపాధ్యాయులు వివరించారు. విద్యార్థులు విద్యతో పాటు క్రీడల్లోనూ ప్రతిభను కనబరచాలని సూచించారు.కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

# రూ.60 లక్షల విలువైన బంగారం, వెండి, నగదు స్వాధీనం

- దృష్టి మళ్లించి బస్సుల్లో చోరీలు.. గుజరీ ఏరుకునే ముసుగులో ఇళ్లలో దొంగతనాలు
- ఆరుగురు అంతర్ జిల్లా దొంగల ముఠా అరెస్ట్.. 13 కేసులు ఛేదన




**అనంతపురం, ఆగస్టు 29:అనంత జనశక్తి న్యూస్**

దృష్టి మళ్లించి బస్సులు, ఆటోల్లో ప్రయాణికులు, మహిళల నుంచి నగలు, నగదు అపహరించడంతో పాటు గుజరీ ఏరుకునే ముసుగులో తాళం వేసిన ఇళ్లను గుర్తించి చోరీలకు పాల్పడుతున్న ఆరుగురు సభ్యుల అంతర్ జిల్లా దొంగల ముఠాను పోలీసులు అరెస్టు చేశారు. వారి నుంచి సుమారు రూ.60 లక్షల విలువైన 393 గ్రాముల బంగారు ఆభరణాలు, 100 గ్రాముల వెండి ఆభరణాలు, రూ.1,49,500 నగదును స్వాధీనం చేసుకున్నారు.శనివారం అనంతపురంలో నిర్వహించిన మీడియా సమావేశంలో జిల్లా ఎస్పీ పి. జగదీష్ ఐపీఎస్ ఈ వివరాలను వెల్లడించారు. ఈ ముఠా అరెస్టుతో గుత్తి పోలీస్‌స్టేషన్ పరిధిలో 11, అనంతపురం మూడో పట్టణ, ఉరవకొండ పోలీస్‌స్టేషన్ల పరిధిలో ఒక్కొక్కటి చొప్పున మొత్తం 13 దొంగతనం కేసులు ఛేదించినట్లు తెలిపారు.

**దృష్టి మళ్లించి చోరీలు**

ముఠాలోని వనార్చి చిట్టెమ్మ గతంలోనూ బ్యాగ్ లిఫ్టింగ్ కేసుల్లో నిందితురాలిగా ఉన్నట్లు పోలీసులు తెలిపారు. ఆర్టీసీ బస్టాండ్లు, రద్దీ ప్రాంతాలు, బస్సులు, ఆటోల్లో ప్రయాణించే మహిళలు, వృద్ధులను లక్ష్యంగా చేసుకునేవారు. ప్రయాణికుల్లా నటిస్తూ తోటి ప్రయాణికుల దృష్టిని మళ్లించి బ్యాగులు, పర్సుల్లోని నగలు, నగదును అపహరించేవారని వివరించారు.మిగిలిన ఐదుగురు నిందితులు పరస్పరం బంధువులు, పరిచయస్తులు. సులభంగా డబ్బు సంపాదించాలనే ఉద్దేశంతో ముఠాగా ఏర్పడి ఇళ్ల దొంగతనాలకు పాల్పడినట్లు పోలీసులు తెలిపారు. గుజరీ ఏరుకునే ముసుగులో తిరుగుతూ తాళం వేసిన ఇళ్లను గుర్తించి, యజమానులు లేని సమయంలో చోరీలకు పాల్పడేవారని పేర్కొన్నారు.

**పోలీసులకు ఎస్పీ అభినందనలు**

అదనపు ఎస్పీ ఎం. నాగభూషణం, గుంతకల్లు డీఎస్పీ ఏ. శ్రీనివాస్ పర్యవేక్షణలో కేసులను ఛేదించిన గుత్తి సీఐ ఎం. రామారావు, సీసీఎస్ ఇన్‌స్పెక్టర్లు పీ. శేషగిరి, జి. జయపాల్‌రెడ్డి, ఎస్ఐలు రాజశేఖర్‌రెడ్డి, తులశన్నతో పాటు గుత్తి పోలీస్‌స్టేషన్, సీసీఎస్ సిబ్బందిని ఎస్పీ పి. జగదీష్ ప్రత్యేకంగా అభినందించారు.



### రాప్తాడు పీహెచ్‌సీని సందర్శించిన

## సవీరా నర్సింగ్ విద్యార్థులు

**రాప్తాడు ఆగస్టు 29అనంత జనశక్తి న్యూస్**

రాప్తాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని (పీహెచ్‌సీ) సవీరా కాలేజ్ ఆఫ్ నర్సింగ్ విద్యార్థులు శనివారం సందర్శించి క్షేత్రస్థాయి పరిశీలన నిర్వహించారు. పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ శివకృష్ణ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా నర్సింగ్ విద్యార్థులు గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రాలను సందర్శించి ప్రజల ఆరోగ్య పరిస్థితులు, వివిధ వ్యాధులకు సంబంధించిన వివరాలను సేకరించారు. అలాగే అంగన్‌వాడీ కేంద్రాల్లో రికార్డుల నిర్వహణ, ఆరోగ్య సంబంధిత కార్యక్రమాల అమలు తీరును పరిశీలించారు. అనంతరం పీహెచ్‌సీలోని ల్యాబ్‌ను సందర్శించిన విద్యార్థులకు రక్తం, ఇతర వైద్య పరీక్షలు నిర్వహించే విధానంపై ల్యాబ్ టెక్నీషియన్ శ్రీధర్ అవగాహన కల్పించారు. వివిధ వ్యాధులకు వినియోగించే మందులు, మాత్రల పంపిణీ విధానంపై ఫార్మాసిస్ట్ వివరించారు.

**ఆస్పత్రికి ఫ్యాన్ల వితరణ**

శిక్షణ పూర్తి చేసుకున్న సందర్భంగా సవీరా నర్సింగ్ విద్యార్థులు సేవా భావంతో రాప్తాడు పీహెచ్‌సీకి రెండు స్టాండింగ్ ఫ్యాన్లను వితరణగా అందజేశారు. ఆస్పత్రి అవసరాలను దృష్టిలో పెట్టుకుని విద్యార్థులు చేసిన ఈ సేవను వైద్యాధికారి డాక్టర్ శివకృష్ణ, ఆస్పత్రి సిబ్బంది అభినందించారు.
ఈ కార్యక్రమంలో సవీరా కాలేజ్ ఆఫ్ నర్సింగ్ ప్రిన్సిపల్ ఝాన్సీ రాణి, ల్యాబ్ టెక్నీషియన్ శ్రీధర్, ఆస్పత్రి సిబ్బంది, నర్సింగ్ విద్యార్థులు పాల్గొన్నారు.

# అనంతపురం నగరంలో ఎమ్మెల్యే దగ్గుపాటి మార్క్ అభివృద్ధి

- ఒకే రోజు రికార్డ్ స్థాయిలో అభివృద్ధి పనులకు శ్రీకారం
- రూ.6.84 లక్షలతో అభివృద్ధి పనులకు ఎంపీ అంబికాతో కలిసి భూమి పూజ
- బళ్లారి బైపాస్ లోని అన్నా క్యాంటీన్ వద్ద రూ.4.50 కోట్లతో స్మార్ట్ స్ట్రీట్ కు భూమి పూజ
- రాష్ట్రంలో అనంతపురంని నెంబర్ వన్ స్థానంలో నిలుపుతానన్న దగ్గుపాటి
- దగ్గుపాటి ఆధ్వర్యంలో అభివృద్ధి వేగంగా జరుగుతోందన్న ఎంపీ అంబికా



**అనంతపురం ఆగస్ట్ 29, అనంత జనశక్తి న్యూస్**

అనంతపురం నగరంలో ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ అభివృద్ధి విషయంలో సరికొత్త అడుగులు వేస్తున్నారు. ఒకేరోజు రికార్డ్ స్థాయిలో 6 కోట్ల 84 లక్షల రూపాయలు అభివృద్ధి పనులకు భూమి పూజ చేశారు. ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, మున్సిపల్ కమిషనర్ జస్వంత్ కుమార్, కూటమి పార్టీల నాయకులతో కలిసి ఆయన ఇవాళ బళ్లారి బైపాస్ లోని అన్నా క్యాంటీన్ వద్ద 4.50 కోట్లతో స్మార్ట్ స్ట్రీట్ కు భూమి పూజ చేశారు. 39వ డివిజన్ లక్ష్మినగర్ లో రూ.16 లక్షలతో నూతన సీసీ రోడ్డుకు, 5వడివిజన్ ఆర్టీసీ బస్టాండ్ వద్ద గల పీవీకేకే కాలేజ్ వద్ద రూ.15లక్షలతో ప్రొటెక్షన్ వాల్ నిర్మాణాల్ని ప్రారంభించారు. 8వ డివిజన్ రాణినగర్ లో ముత్యాలమ్మ గుడి వద్ద రూ.37 లక్షలతో నూతన సీసీ రోడ్డుకు, 24వ డివిజన్ జేఎన్టీయూ రోడ్డులోని హిందూ స్మశాన వాటిక వద్ద రూ.32 లక్షలతో అభివృద్ధి పనులు ప్రారంభించారు. 24వ డివిజన్ ఓల్డ్ ఎస్బిఐ కాలనీ వాటర్ ట్యాంక్ దగ్గర 20 లక్షలతో నూతన సీసీ డ్రైన్, 32, 26వ డివిజన్ హమాలి కాలనీలోని ఇన్ఫినిటీ స్కూల్ వద్ద రూ.54 లక్షలతో సీసీ రోడ్డు, డ్రైన్ ల నిర్మాణాలకు భూమి పూజ నిర్వహించారు. హౌసింగ్ బోర్డ్ లోని రాజీవ్ చిల్డ్రన్ పార్క్ వద్ద రూ.60 లక్షలతో నూతన సిసి రోడ్డుకు భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ మాట్లాడుతూ కళ్యాణదుర్గం రోడ్డు నుంచి బళ్లారి బైపాస్ వరకు ఉన్న ఫ్లైఓవర్ కింద.. అపరిశుభ్ర వాతావరణ కనిపిస్తోందని ఈ స్థానంలో.. చిరు వ్యాపారుల కోసం స్మార్ట్ స్ట్రీట్ లను నిర్మిస్తున్నట్లు చెప్పారు. దీనివలన ఎంతో మందికి ఉపయోగపడటమే కాకుండా ఆ మార్గంలో ఒక మంచి వాతావరణం ఉంటుందన్నారు. గత ఐదేళ్ల వైసిపి ప్రభుత్వ హయాంలో అభివృద్ధి కుంటుపడిందని విమర్శలు చేశారు. ఈ రెండేళ్లలోనే 1296 కోట్ల రూపాయలతో అభివృద్ధి పనులు చేస్తున్నట్లు వివరించారు. 250 కోట్లతో రోడ్లు డ్రైనేజీలు వంటి మౌలిక వసతులు కల్పించామన్నారు. సుదీర్ఘకాలంగా పెండింగ్ లో ఉన్న పనులను పూర్తి చేస్తున్నామన్నారు. మరో 160 కోట్లతో త్వరలోనే అభివృద్ధి పనులు ప్రారంభిస్తామని చెప్పారు. నగరంలో ఎక్కడా రోడ్లు, డ్రైనేజీలు వంటి సమస్యలు లేకుండా చేస్తామన్నారు. అనంతపురం నగరాన్ని రాష్ట్రంలోనే నెంబర్ వన్ గా నిలిపే విధంగా చూస్తున్నామని ఎమ్మెల్యే దగ్గుపాటి తెలిపారు. మరోవైపు ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించేందుకు ప్రజా దర్బార్ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. నగరంలో గతంలో ఎప్పుడూ లేని విధంగా అభివృద్ధి పనులు చేస్తున్నారని వివరించారు.

## రక్షక్ ప్రైమరీ స్కూల్‌లో ఘనంగా జాతీయ క్రీడా దినోత్సవం

**గెలుపోటముల కంటే క్రీడాస్ఫూర్తి, భాగస్వామ్యమే ముఖ్యం: ఎస్పీ పి. జగదీష్**

**అనంతపురం, ఆగస్టు 29:అనంత జనశక్తి న్యూస్**

విద్యార్థుల్లో క్రీడాస్ఫూర్తి, క్రమశిక్షణ, సమయపాలన, నాయకత్వ లక్షణాలను పెంపొందించడంలో క్రీడలు కీలకపాత్ర పోషిస్తాయని జిల్లా ఎస్పీ పి. జగదీష్ ఐపీఎస్ అన్నారు. జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆయన మార్గదర్శకత్వంలో రక్షక్ ప్రైమరీ స్కూల్‌లో ఆగస్టు 28, 29 తేదీల్లో నిర్వహించిన వివిధ క్రీడా పోటీల ముగింపు కార్యక్రమం శనివారం ఉత్సాహంగా జరిగింది.ఈ సందర్భంగా విద్యార్థులు పలు క్రీడా పోటీల్లో ఉత్సాహంగా పాల్గొని తమ ప్రతిభను చాటుకున్నారు. చిన్నారులను ఉద్దేశించి ఎస్పీ మాట్లాడుతూ క్రీడల్లో గెలుపోటముల కంటే పోటీల్లో పాల్గొనడం, క్రీడాస్ఫూర్తితో ముందుకు సాగడం ముఖ్యమని తెలిపారు. క్రీడల ద్వారా విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం, క్రమశిక్షణతో పాటు నాయకత్వ లక్షణాలు అభివృద్ధి చెందుతాయని పేర్కొన్నారు.అనంతరం వివిధ క్రీడల్లో ప్రతిభ కనబరిచి విజేతలుగా నిలిచిన విద్యార్థులకు ఎస్పీ పి. జగదీష్ స్వయంగా సర్టిఫికెట్లు, పతకాలు, బహుమతులు అందజేసి అభినందించారు.విద్యార్థులు భవిష్యత్తులో చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు.చదువుతో పాటు విద్యార్థుల ఆరోగ్యం, మానసిక వికాసానికి క్రీడలు ఎంతో అవసరమని, ఈ అంశానికి రక్షక్ ప్రైమరీ స్కూల్ ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని పాఠశాల నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.



## ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లు పకడ్బందీగా ఉండాలి : జిల్లా సంయుక్త కలెక్టర్ సి.విష్ణు చరణ్

- బందోబస్తులో ఎలాంటి లోటుపాట్లకు తావివ్వరాదు : జిల్లా ఎస్పీ పి.జగదీష్

**అనంతపురము, ఆగస్ట్ 29:అనంత జనశక్తి న్యూస్**

(నేడు) అనంతపురం నగరంలో గుంతకల్లు ఎమ్మెల్యే కు మార్తెకు మరియు ఆర్టీసీ జోనల్ చైర్మన్ కుమారుడుల వివాహ మహోత్సవానికి రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు హాజరుకానున్న నేపథ్యంలో జిల్లా జాయింట్ కలెక్టర్ సి.విష్ణు చరణ్ మరియు ఎస్పీ పి.జగదీష్ కాన్వాయ్ ట్రయల్ రన్ లో పాల్గొని అన్ని ఏర్పాట్లు సమీక్షించారు. శనివారం నగరంలోని శిల్పారామంలో ఏర్పాటు చేసిన హెలిప్యాడ్, బళ్లారి రోడ్డులోని ఎంవైఆర్ కళ్యాణ మండపం, తదితర ప్రాంతాల్లో ఏర్పాట్లను వారు పరిశీలించారు.ముఖ్యమంత్రి పర్యటన సంబంధించిన ఏర్పాట్లు అన్ని పకడ్బందీగా ఉండాలని వారు అధికారులకు సూచించారు.వీరితో పాటు అసిస్టెంట్ కలెక్టర్ సుయాస్ కుమార్, అదనపు ఎస్పీ ఇలియాజ్, ఎస్డీసీలు రామ్మోహన్, మల్లికార్జున, ఆర్డీఓ అనంతపురము ప్రేమంత్ కుమార్, డీఎస్పీ లు, రెవెన్యూ తదితర అధికారులు పాల్గొన్నారు.



# సీఎం పర్యటన, నీట్ పీజీ పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి

**జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్**

**అనంతపురం, ఆగస్టు 29 : అనంత జనశక్తి న్యూస్**



ఆగస్టు 30న (నేడు) ముఖ్యమంత్రి పర్యటన మరియు నీట్ పీజీ ప్రవేశ పరీక్షల నిర్వహణకు సంబంధించి అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పకడ్బందీ ఏర్పాట్లు పూర్తి చేయాలని అనంతపురం జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్ ఆదేశించారు. శనివారం జాయింట్ కలెక్టర్, డిఆర్ఓ, ఇతర జిల్లా ఉన్నతాధికారులు, సంబంధిత శాఖల అధికారులతో జిల్లా కలెక్టర్ టెలికాన్ఫరెన్స్ నిర్వహించి సీఎం పర్యటనపై, నీట్ పీజీ పరీక్షపై దిశా నిర్దేశం చేశారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లకు సంబంధించి హెలిప్యాడ్ వద్ద ఆర్.అండ్.బి (R&B), రెవెన్యూ అధికారులు హెలిప్యాడ్ నిర్మాణం, చుట్టూ ఫెన్సింగ్, వీఐపీ షామియానా ఏర్పాట్లను సక్రమంగా ఏర్పాటు చేయాలని సూచించారు. సీఎం కాన్వాయ్ ప్రయాణించే మార్గాల్లో శానిటేషన్ బృందాలను ఏర్పాటు చేసి ఎప్పటికప్పుడు వ్యర్థాలను తొలగించాలన్నారు. ఎస్ఈ పీఆర్ పర్యవేక్షణలో రోడ్ల ప్యాచ్ వర్క్ పనులను పూర్తి చేయాలి. వేదిక భద్రతను ఆర్ అండ్ బి ఇంజనీర్లు పరిశీలించి, నాణ్యతా ప్రమాణాల సర్టిఫికెట్ ఇవ్వాలని, నిరంతర విద్యుత్ సరఫరా, మెడికల్ టీమ్‌లు, అంబులెన్సులు, ఫైర్ ఇంజన్లు తదితర ఏర్పాట్లలో ఎలాంటి లోటుపాట్లు లేకుండా చూసుకోవాలనీ ఆదేశించారు.అలాగే నీట్ పీజీ పరీక్షల నిర్వహణకి సంబంధించి జిల్లాలోని 5 పరీక్షా కేంద్రాల పరిధిలో ఎలాంటి సాంకేతిక, విద్యుత్ అంతరాయాలు కలగకుండా సంబంధిత అధికారులు పర్యవేక్షించాలనీ, కేంద్రాల వద్ద 144 సెక్షన్ కట్టుదిట్టంగా అమలు చేసి, అవాంఛనీయ సంఘటనలు మరియు బయటి రద్దీ లేకుండా రెవెన్యూ, పోలీస్ యంత్రాంగం బందోబస్తు ఏర్పాటు ఉండాలని ఆదేశించారు. ఏదైనా సందేహాలు ఉంటే ఎప్పటికప్పుడు డీఆర్వోను సంప్రదించాలని, డిఆర్ఓ పర్యవేక్షించాలనీ సూచించారు. సీఎం బందోబస్తు డ్యూటీలకు, పరీక్షా కేంద్రాల డ్యూటీలకు వేర్వేరుగా సిబ్బందిని కేటాయించాలని కలెక్టర్ స్పష్టం చేశారు.ఈ టెలికాన్ఫరెన్స్‌లో జాయింట్ కలెక్టర్ సి.విష్ణుచరణ్, డీఆర్వో మలోల, ఆర్డీవో ప్రేమంత్ కుమార్, జిజిహెచ్ ఎ.ఓ మల్లికార్జునరెడ్డి, ఎస్ఈ ఏపీఎస్పీడీసీఎల్, పీఆర్, ఆర్ అండ్ బి, వైద్య శాఖ, డీపీఓ తదితర అధికారులు మరియు పరీక్షా కేంద్రాల ప్రతినిధులు పాల్గొన్నారు.



# జిల్లాలో ఆర్ డి టి సేవలు మరువలేనివి

**- 22 మంది మహిళలకు ఆటోరిక్షాలు అందజేసిన ఆర్డీటీ**
**- జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్**

**అనంతపురము, ఆగస్టు 29, అనంత జనశక్తి న్యూస్**

జిల్లాలో రూరల్ డెవలప్మెంట్ ట్రస్ట్ (ఆర్ డి టి) వారి సేవలు మరువలేనివని జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్ పేర్కొన్నారు.శనివారం అనంతపురం పట్టణంలోని ఆర్ డి టి నందు ఆ సంస్థ సహకారంతో ఏర్పాటుచేసిన 22 ఆటో లను జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా మహిళలకు అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్ మాట్లాడుతూ... గ్రామీణ ప్రాంతాల మహిళలకు స్థిరమైన జీవనోపాధి అవకాశాలను కల్పించే లక్ష్యంతో రూరల్ డెవలప్‌మెంట్ ట్రస్ట్ (ఆర్డీటీ) చేపట్టిన ఆటో డ్రైవింగ్ కార్యక్రమంలో 22 మంది మహిళలకు ఆటోరిక్షాలను అందజేయడం ఎంతో శుభ పరిణామమన్నారు. నెల రోజుల పాటు నిర్వహించిన శిక్షణలో మహిళలకు ఆటో డ్రైవింగ్‌తో పాటు లెర్నర్స్ లైసెన్స్ పొందేందుకు అవసరమైన సహాయాన్ని ఆర్డీటీ అందించింది. శిక్షణ కాలంలో ఆర్డీటీ వారికి వసతి, భోజన సదుపాయాలను కల్పించింది. డ్రైవింగ్‌తో పాటు వాహన నిర్వహణ, రహదారి భద్రత, ప్రథమ చికిత్స వంటి అంశాల్లోనూ శిక్షణ ఇచ్చారు.మహిళలు ఆటోల ద్వారా స్వతంత్రంగా జీవించేందుకు అవసరమైన వ్యక్తిగత, జీవన నైపుణ్యాలను కూడా అభివృద్ధి చేసుకునేలా ఆర్డీటీ సహకరించింది.ఈ కార్యక్రమం ద్వారా శిక్షణ పొందిన 22 మంది మహిళలు ఐదు జిల్లాల్లోని 17 మండలాలకు చెందినవారు. వీరిలో చాలామంది స్థిరమైన ఆదాయం లేని కుటుంబాల నుంచి వచ్చారు. కొందరు మహిళలు తమ కుటుంబాలకు తామే ప్రధాన ఆధారంగా ఉంటున్నారు. మహిళలకు ఆటోలు అందజేయడం వారికి ఉపాధి అవకాశాలను కల్పించడమే కాకుండా, వారిలో ఆత్మవిశ్వాసాన్ని పెంచుతోంది. ఒక మహిళకు అవకాశం కల్పిస్తే దాని ప్రభావం ఆమె కుటుంబాన్ని దాటి సమాజంపై కూడా ఉంటుంది. ఇలాంటి కార్యక్రమాలతో మరింత మంది మహిళలు ముందుకు రావడానికి స్ఫూర్తినిస్తాయని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీటీ వ్యవస్థాపకురాలు అన్నే ఫెర్రర్, ఆర్డీటీ ప్రోగ్రామ్ డైరెక్టర్ మోంచో ఫెర్రర్, మహిళా సాధికారత డైరెక్టర్ విషా ఫెర్రర్ తదితరులు పాల్గొన్నారు.

# పరిశ్రమల స్థాపనతోనే జిల్లా అభివృద్ధి

**- జిల్లా అభివృద్ధికి నూతన పరిశ్రమలు స్థాపించాలి**
**- జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్**

**అనంతపురం, ఆగస్టు 29,అనంత జనశక్తి న్యూస్**



జిల్లాలో నూతన పరిశ్రమలు స్థాపించి జిల్లా అభివృద్ధికి కృషి చేయాలని జిల్లా కలెక్టర్ ఆనంద్ సంబంధిత అధికారులను ఆదేశించారు.శనివారం కలెక్టరేట్ లోని మినీ కాన్ఫరెన్స్ హాల్ నందు 71,వ జిల్లా పరిశ్రమల ఎక్స్ పోర్ట్ ప్రమోషన్ కమిటీ సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్ మాట్లాడుతూ...పరిశ్రమల స్థాపనతోనే జిల్లా అభివృద్ది చెందుతుందని జిల్లాలో నూతన పరిశ్రమలు స్థాపించేందుకు అధికారులు పారిశ్రామిక వేత్తలను ప్రోత్సహించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు.నూతన పరిశ్రమలు స్థాపించేందుకు అనుమతులకు సంబంధించి గత సమావేశం నుంచి ఇప్పటి వరకు29 దరఖాస్తులు వచ్చాయని.... ఇందులో 18 ఆమోదించడం జరిగింది. వివిధ కారణాల వల్ల ఒక దరఖాస్తు రిజెక్ట్ చేయడం జరిగింది. గడువులోపల పరిష్కరించాల్సిన 10 అర్జీల వెంటనే క్లియర్ చేయాలన్నారు. జిల్లాలోని తిమ్మసముద్రం కళ్యాణదుర్గం తాడిపత్రి బుగ్గ నందు నిర్మాణ దశలో ఉన్న భారీ మరియు అతి భారీ పరిశ్రమలను త్వరితగతిన పూర్తి చేసేందుకు సంబంధిత అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టాలన్నారు.

ఉద్యానవన శాఖకు సంబంధించి స్నేహ ఫార్మ్స్ ప్రైవేట్ లిమిటెడ్ ప్రాజెక్ట్‌కు అనుమతులు మంజూరు చేయడం జరిగిందని త్వరలో పనులు ప్రారంభించాలన్నారు. నెడ్ క్యాప్ కు సంబంధించి నిర్మాణ దశలో ఉన్న 29 ప్రాజెక్టులను వెంటనే పూర్తి చేయాలన్నారు ఈ ప్రాజెక్టులకు భూ సమస్యలు ఉన్నట్లయితే వెంటనే తమ దృష్టికి తెచ్చి పరిష్కరించుకోవాలన్నారు.

బళ్లారి రోడ్డులో ఏపీఐఐసీ కి సంబంధించి నిర్మాణ దశలో ఉన్న వివిధ పార్కులను వెంటనే పూర్తి చేయాలన్నారు.

రాయదుర్గం నందు నిర్మించే హరి ఓం పైప్స్ ఇండస్ట్రీస్ కు సంబంధించిన పరిశ్రమకు వెంటనే భూ సమస్య పరిష్కరించాలని సంబంధిత తాసిల్దార్ కు సూచించారు.

జిల్లాలో పీఎం విశ్వకర్మ పథకానికి సంబంధించి అర్హులైన లబ్ధిదారులందరికీ త్వరగా రుణాలు మంజూరు చేయాలని లీడ్ బ్యాంక్ మేనేజర్ ను ఆదేశించారు.

జిల్లాలో అరటి పళ్ళు మరియు వేరుశనగ లు ఎక్స్పోర్ట్ చేయడానికి అనుకూలమైన వసతులు ఉన్నాయని ఇందుకు సంబంధించిన పనులు వేగవంతం చేయాలని వ్యవసాయ శాఖ ఉద్యానవన శాఖ అధికారులను ఆదేశించారు.ఈ కార్యక్రమంలో పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ శ్రీనివాస్ యాదవ్, ఎల్ డి ఎం మారుతి శ్రీనివాసులు, వ్యవసాయ శాఖ జెడి, ఉద్యానవన శాఖ ఏడి ఉమాదేవి తదితరులు పాల్గొన్నారు.

# నారాయణ గోమతి సీబీఎస్ఈ స్కూల్‌లో ఘనంగా తెలుగు భాషా దినోత్సవం




**నెల్లూరు ఆగస్ట్ 29, అనంత జనశక్తి న్యూస్**

నారాయణ గోమతి సీబీఎస్ఈ స్కూల్‌లో శనివారం తెలుగు భాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు.నారాయణ గ్రూప్ జనరల్ మేనేజర్ వేమిరెడ్డి విజయభాస్కర్ రెడ్డి ప్రోత్సాహంతో, క్లస్టర్ ప్రిన్సిపాల్ కాంతి సహకారంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగా గిడుగు వెంకట రామమూర్తి పంతులు చిత్రపటానికి పూలమాల వేసి, దీప ప్రజ్వలన చేసి ఘనంగా నివాళులు అర్పించారు. వాడుక భాష అభివృద్ధికి గిడుగు రామమూర్తి పంతులు చేసిన కృషిని స్మరించుకున్నారు.ఈ సందర్భంగా స్కూల్ ప్రిన్సిపాల్ పవనార్క్ మాట్లాడుతూ తెలుగు భాష మన సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక అని, ప్రతి విద్యార్థి మాతృభాషపై అభిమానం, గౌరవం పెంపొందించుకోవాలని అన్నారు.అకడమిక్ డీన్ సౌజన్య మాట్లాడుతూ విద్యార్థులు తెలుగు భాషను ప్రేమించి, దాని గొప్పతనాన్ని భావితరాలకు అందించాలని సూచించారు. శైలజ 10వ తరగతి ఇన్‌చార్జి తెలుగు డిపార్ట్‌మెంట్ హెడ్, తెలుగు ఉపాధ్యాయురాలు ఆదిలక్ష్మి కార్యక్రమాన్ని సమన్వయం చేసి, విద్యార్థులకు తెలుగు భాష ప్రాముఖ్యతను వివరించారు.ఈ కార్యక్రమంలో ఏవో సాయి ప్రసాద్ స్కూల్ స్టాఫ్, విద్యార్థి విద్యార్థినులు ఉత్సాహంగా పాల్గొన్నారు. విద్యార్థులు తెలుగు భాషకు సంబంధించిన ప్రసంగాలు, కవితలు, సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొని ఆకట్టుకున్నారు.మాతృభాషను గౌరవిద్దాం – తెలుగు భాషను కాపాడుకుందాం అనే సందేశంతో కార్యక్రమం విజయవంతంగా ముగిసింది.

# గిడుగు రామ్మూర్తి జయంతి సందర్భంగా ఘనంగా తెలుగు భాషా దినోత్సవం

**అనంతగిరి, ఆగస్టు 29:అనంత జనశక్తి న్యూస్**



అల్లూరి సీతారామరాజు జిల్లా అనంతగిరి మండల కేంద్రంలోని గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలికల పాఠశాల-1లో గిడుగు రామ్మూర్తి పంతులు జయంతిని పురస్కరించుకొని తెలుగు భాషా దినోత్సవం, జాతీయ క్రీడా దినోత్సవం వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. డిప్యూటీ హెచ్ఎం ఎన్. రాధిక సమక్షంలో ఉపాధ్యాయులు, నాన్‌టీచింగ్ సిబ్బంది, నాంది ఫౌండేషన్ సిబ్బంది, విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు.తెలుగు ఉపాధ్యాయులు ఎస్. కోటేశ్వర రావు, కె. విజయలక్ష్మి, కె. కేశమ్మ, ఎం. నీలవేణి, పీడీ ఉపాధ్యాయులు కె. అప్పలరాజు, బి. భవాని ఆధ్వర్యంలో విద్యార్థులకు వివిధ పోటీలు నిర్వహించారు. విద్యార్థులు పద్యాలు, తెలుగు భాషా దినోత్సవ గీతాలు, కవితలు, వ్యాసరచన తదితర కార్యక్రమాల్లో పాల్గొని తమ ప్రతిభను ప్రదర్శించారు. విజేతలకు బహుమతులను అందజేశారు.ఈ సందర్భంగా డిప్యూటీ హెచ్ఎం ఎన్. రాధిక మాట్లాడుతూ.. గిడుగు రామ్మూర్తి పంతులు వ్యవహారిక భాష కోసం చేసిన పోరాటం తెలుగు భాషా చరిత్రలో చిరస్మరణీయమని అన్నారు. ప్రజలు మాట్లాడే సరళమైన వ్యవహారిక భాషలో విద్యాబోధన జరిగితే విద్యార్థులకు విషయాలు సులభంగా అర్థమవుతాయని, విద్యాభ్యాసం మరింత సులభతరం అవుతుందని తెలిపారు. తెలుగు భాషపై విద్యార్థుల్లో మమకారం, అభిమానం పెంపొందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు.

జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకొని విద్యార్థుల్లో క్రీడాస్ఫూర్తిని పెంపొందించేలా వివిధ కార్యక్రమాలను కూడా నిర్వహించారు. విద్యతో పాటు క్రీడలకు కూడా ప్రాధాన్యత ఇవ్వాలని ఉపాధ్యాయులు సూచించారు.

ఈ కార్యక్రమంలో ఎస్. కమల, టి. అనిత, వినోములత, బి.వి. రత్నకుమారి, ఎస్. శాంతికుమారి, కె. పుష్పలత, బి. అర్జున్, ఆర్. పుణ్యవతి, టి. బుజ్జి, టి. సుబ్బారావు, డి. ఈశ్వరరావు, డి. శ్రీనివాస్, ఎ. శ్రీనివాస్, కె. స్వాతి, ఎం. చందుప్రకాష్ తదితర పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

# నారాయణ గోమతి సి బి ఎస్ ఈ స్కూల్‌లో ఘనంగా నేషనల్ స్పోర్ట్స్ డే

నెల్లూరు ఆగస్ట్ 29, అనంత జనశక్తి న్యూస్

భారత హాకీ దిగ్గజం, ఒలింపిక్ స్వర్ణ పతక విజేత మేజర్ ధ్యాన్ చంద్ జయంతిని పురస్కరించుకొని శనివారం జాతీయ క్రీడా దినోత్సవాన్ని నారాయణ గోమతి సీబీఎస్ఈ స్కూల్ లో ఘనంగా నిర్వహించారు.నారాయణ గ్రూప్ జనరల్ మేనేజర్ వేమిరెడ్డి విజయభాస్కర్ రెడ్డి, క్లస్టర్ ప్రిన్సిపాల్ శ్రీమతి కాంతి సూచనలతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా 1వ తరగతి నుండి 5వ తరగతి వరకు విద్యార్థులకు వివిధ క్రీడా పోటీలు నిర్వహించారు.విద్యార్థులు ఎంతో ఉత్సాహంగా పాల్గొని తమ క్రీడా ప్రతిభను ప్రదర్శించారు. క్రీడల ద్వారా విద్యార్థుల్లో శారీరక దృఢత్వంతో పాటు క్రమశిక్షణ, టీమ్ స్పిరిట్, నాయకత్వ లక్షణాలు, పోటీతత్వ స్ఫూర్తి పెంపొందుతాయని నిర్వాహకులు తెలిపారు.ఈ కార్యక్రమంలో స్కూల్ ప్రిన్సిపాల్ పవనార్క్, వైస్ ప్రిన్సిపాల్ సౌమ్య రెడ్డి, ఏవో సాయి ప్రసాద్, పి ఈ టి లు, ఉపాధ్యాయులు, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు. విద్యార్థుల్లో క్రీడల పట్ల ఆసక్తిని పెంపొందించడంతో పాటు, వారి సమగ్ర అభివృద్ధికి క్రీడలు ఎంతో అవసరమని పాఠశాల యాజమాన్యం పేర్కొంది. విద్యార్థులు క్రీడాస్ఫూర్తితో ముందుకు సాగాలని ఆకాంక్షించారు.



# తెలుగు భాషా పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలి

**- గిడుగు వెంకటరామమూర్తి పంతులు సేవలు చిరస్మరణీయం**
**- విద్యార్థినీ విద్యార్థులు క్రీడల పట్ల మక్కువ పెంచుకోవాలి**
**- మాతృభాషా పరిరక్షణ మరియు క్రీడల ప్రోత్సాహంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకం**
**- జిల్లా కలెక్టర్ ఎ. శ్యామ్ ప్రసాద్**
**- శ్రీ సత్య సాయి జిల్లా కలెక్టరేట్లో ఘనంగా తెలుగు భాష మరియు జాతీయ క్రీడల దినోత్సవ వేడుకలు**



**పుట్టపర్తి, ఆగస్టు 29:అనంత జనశక్తి న్యూస్**

శనివారం కలెక్టరేట్ లోని పీజీఎస్ హాలు నందు గిడుగు వెంకటరామమూర్తి పంతులు జయంతిని పురస్కరించుకుని శ్రీ సత్యసాయి జిల్లా కేంద్రం పుట్టపర్తిలో తెలుగు భాషా దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ...

తెలుగు భాష పరిరక్షణలో ఉపాధ్యాయుల పాత్ర అత్యంత కీలకమని, విద్యార్థుల్లో మాతృభాష పట్ల ఆసక్తిని పెంపొందించాలని సూచించారు.తునిలోని పాఠశాలలో విద్యార్థిగా ఉన్నప్పుడు తన తెలుగు మాస్టారు వేంకటేశ్వరులు నేర్పిన క్రమశిక్షణ, భాషా పునాదే ఈరోజు తాను ఐఏఎస్, గ్రూప్ 1 స్థాయి పరీక్షలను తెలుగులోనే రాసి విజయం సాధించడానికి దోహదపడిందని గుర్తు చేసుకున్నారు.అవధాన ప్రక్రియ, హరికథ వంటి ప్రక్రియలు ప్రపంచంలో ఏ భాషలోనూ లేవని, విద్యార్థులకు అవధానాలు, పద్య పఠనం, హరికథల రూపాంతరంపై అవగాహన పెంచాలన్నారు.రాజులు మారినా బమ్మెర పోతన, కంచర్ల గోపరాజు (భక్త రామదాసు), కాకర్ల త్యాగరాజు వంటి గొప్ప కవుల ఖ్యాతి చిరస్థాయిగా నిలిచిపోతుందన్నారు.తెలుగు భాష గొప్ప సాహిత్య సంపద, సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక అని, నేటి తరం విద్యార్థులు తెలుగు భాష పట్ల ఆసక్తి పెంచుకుని, మాతృభాషను గౌరవించాలని కలెక్టర్ సూచించారు. పరిపాలనలోనూ, విద్యా రంగంలోనూ తెలుగు భాష వినియోగాన్ని మరింత విస్తృతం చేయాలని అన్నారు. మా తెలుగు తల్లికి మల్లెపూదండ" అనే స్ఫూర్తితో తెలుగు భాషను ప్రేమిస్తూ, పరిరక్షిస్తూ భావితరాలకు అందించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు.జాతీయ క్రీడల దినోత్సవం సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ హాకీ దిగ్గజం ధ్యాన్‌చంద్ సేవలను స్మరించుకుంటూ, విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి చదువుతో పాటు క్రీడలు సమాన ప్రాధాన్యత కలిగి ఉండాలన్నారు. క్రీడలు క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలు మరియు సమయపాలనను నేర్పుతాయని తెలిపారు .ఈ కార్యక్రమంలో డిఆర్ఓ కొండయ్య, డిఆర్‌డిఎ పిడి నరసయ్య,డిఇఓ క్రిస్టప్ప, అధికారులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, సాహితీవేత్తలు, భాషాభిమానులు తదితరులు పాల్గొన్నారు.

# అమరావతి ఛాంపియన్ షిప్ లో జిల్లా క్రీడాకారుల ప్రతిభ – 7 పతకాలు కైవసం

**పుట్టపర్తి, ఆగస్టు,29:అనంత జనశక్తి న్యూస్**



రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ (ఆంధ్రప్రదేశ్) ఆధ్వర్యంలో తిరుపతిలో ఆగస్టు 24 నుండి 27 వరకు నిర్వహించిన "అమరావతి ఛాంపియన్ షిప్ - 2026" రాష్ట్ర స్థాయి టోర్నమెంట్‌లో శ్రీ సత్యసాయి జిల్లా క్రీడాకారులు విశేష ప్రతిభ కనబరిచి మొత్తం 7 పతకాలను సాధించారు. రాష్ట్రంలోని 26 జిల్లాల నుండి విచ్చేసిన క్రీడాకారులు 12 రకాల క్రీడాంశాల్లో పోటీపడగా, శ్రీ సత్యసాయి జిల్లాకు చెందిన ప్రతిభావంతులు క్రింది విభాగాల్లో విజేతలుగా నిలిచారు.యోగా (అండర్ 17 బాలురు): ఎమ్. అశోక్ కుమార్ - మొదటి స్థానం (స్వర్ణ పతకం),హాకీ (అండర్17 బాలికల జట్టు): ప్రథమ స్థానం (స్వర్ణ పతకం)యోగా (అండర్23 బాలికలు): ఏ. కుమారి - రెండవ స్థానం (రజత పతకం),బాక్సింగ్ (అండర్17 బాలికలు): సనా సుల్తానా - రెండవ స్థానం (రజత పతకం),హాకీ (అండర్23 బాలుర జట్టు): రెండవ స్థానం (రజత పతకం),వాలీబాల్ (అండర్17 బాలుర జట్టు): రెండవ స్థానం (రజత పతకం),కబడ్డీ (అండర్17 బాలికల జట్టు): రెండవ స్థానం (రజత పతకం),రాష్ట్ర స్థాయిలో జిల్లా పేరును నిలబెట్టి 7 పతకాలు సాధించిన క్రీడాకారులను, వారి శిక్షకులను జిల్లా యంత్రాంగం మరియు క్రీడాభిమానులు ప్రత్యేకంగా అభినందించారు.

# అవుకు రిజర్వాయర్‌కు ఎస్ఆర్‌బీసీ ద్వారా వారం రోజుల పాటు నీరు

**- రైతులు పంటలు వేసుకోవద్దు.. తాగునీరు, పశువుల అవసరాల కోసమే నీటి విడుదల: మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి**

**బనగానపల్లె/నంద్యాల, ఆగస్టు 29: అనంత జనశక్తి న్యూస్**




గోరుకల్లు రిజర్వాయర్ నుంచి ఎస్ఆర్‌బీసీ ద్వారా అవుకు రిజర్వాయర్‌కు రేపటి నుంచి వారం రోజుల పాటు నీటిని విడుదల చేయనున్నట్లు రాష్ట్ర మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి తెలిపారు. బనగానపల్లె క్యాంపు కార్యాలయంలో ఎస్ఆర్‌బీసీ అధికారులతో కలిసి నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన ఈ విషయాన్ని వెల్లడించారు.ప్రస్తుతం గ్రామాల్లో బోర్లు ఎండిపోవడం, భూగర్భ జలాలు పడిపోవడం, పశువులకు సైతం నీరు అందని పరిస్థితులు నెలకొన్నాయని మంత్రి తెలిపారు. ఇప్పటికే జీఎన్ఎస్ఎస్ ద్వారా అవుకు రిజర్వాయర్‌కు నీటిని తరలిస్తున్నామని, ఎస్ఆర్‌బీసీ ద్వారా కూడా వారం రోజుల పాటు నీటిని విడుదల చేస్తే కాలువ వెంబడి ఉన్న వాగులు, వంకలు నిండడంతో పాటు భూగర్భ జలాలు పెరిగి బోర్లు రీఛార్జ్ అయ్యే అవకాశం ఉంటుందని ప్రభుత్వానికి వివరించినట్లు చెప్పారు.స్థానిక పరిస్థితులను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు దృష్టికి తీసుకెళ్లామని, తమ విజ్ఞప్తికి సానుకూలంగా స్పందించి నీటి విడుదలకు అనుమతించినందుకు ప్రభుత్వం తరపున, బనగానపల్లె నియోజకవర్గ ప్రజల తరపున ధన్యవాదాలు తెలిపారు.రేపు సాయంత్రం నుంచి వారం రోజుల పాటు మాత్రమే నీటిని విడుదల చేస్తామని మంత్రి స్పష్టం చేశారు. ఈ నీరు పంటల సాగు కోసం కాదని, తాగునీరు, పశువుల అవసరాలు, భూగర్భ జలాల పెంపు కోసం మాత్రమే విడుదల చేస్తున్నట్లు పేర్కొన్నారు.

**రైతులు పంటలు వేసుకోవద్దు**

ఎస్ఆర్‌బీసీ ద్వారా నీరు వస్తోందని ఆశపడి రైతులు పంటలు వేసుకుంటే నష్టపోయే అవకాశం ఉందని మంత్రి హెచ్చరించారు. వారం రోజుల తర్వాత నీటి విడుదల ఉండదని, రైతులు పంటలు వేసుకోకుండా ప్రభుత్వానికి సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఎల్‌నినో ప్రభావంతో దేశవ్యాప్తంగా దుర్భిక్ష పరిస్థితులు నెలకొన్నాయని, అందుబాటులోకి వచ్చే కొద్దిపాటి నీటిని పొదుపుగా వినియోగించుకోవాల్సిన బాధ్యత అందరిపైనా ఉందన్నారు. క్షేత్రస్థాయిలో గ్రామాల పరిస్థితిని పరిశీలించి అధికారులు ఇచ్చిన నివేదిక ఆధారంగానే నీటి విడుదల నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు.రైతుల పట్ల ప్రభుత్వం సదుద్దేశంతో పని చేస్తోందని, గతంలో మే, జూన్ నెలల్లోనూ రైతుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని సాగునీరు అందించినట్లు మంత్రి గుర్తుచేశారు. అయితే కొంతమంది ఈ అంశాన్ని అనవసరంగా రాజకీయ ప్రయోజనాల కోసం ఉపయోగించేందుకు ప్రయత్నిస్తున్నారని ఆయన విమర్శించారు.

# కౌన్సిలింగ్‌తో మళ్లీ ఒక్కటైన దంపతులు

**- విడాకులు తీసుకున్నా....**
**- పిల్లల భవిష్యత్తు కోసం మరోసారి ఒక్కటైన తులసి–సాయికుమార్....**
**- కుటుంబ సమస్యలను సామరస్యంగా పరిష్కరించడమే....**
**- ఫ్యామిలీ కౌన్సిలింగ్ కేంద్రాల లక్ష్యం: అడిషనల్ ఎస్పీ అంకిత సురాన....**
**- ధర్మవరం ఫ్యామిలీ కౌన్సిలింగ్ సెంటర్‌ను పరిశీలించిన అడిషనల్ ఎస్పీ....**

**ధర్మవరం ఆగష్టు 29 అనంత జనశక్తి న్యూస్ :**




ధర్మవరం కుటుంబ కలహాలు, దాంపత్య వివాదాలు, పరస్పర అపార్థాలను సామరస్యపూర్వకంగా పరిష్కరించి కుటుంబాల్లో ప్రశాంత వాతావరణాన్ని నెలకొల్పడమే ఫ్యామిలీ కౌన్సిలింగ్ సెంటర్ల ప్రధాన ఉద్దేశ్యమని శ్రీ సత్యసాయి జిల్లా అడిషనల్ ఎస్పీ అంకిత సురాన, ఐపీఎస్ తెలిపారు. జిల్లా ఎస్పీ ఎస్. సతీష్ కుమార్, ఆదేశాల మేరకు శనివారం ధర్మవరంలోని ఫ్యామిలీ కౌన్సిలింగ్ సెంటర్‌ను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా కౌన్సిలింగ్ కోసం వచ్చిన ఫిర్యాదుదారులతో అడిషనల్ ఎస్పీ స్వయంగా మాట్లాడి వారి కుటుంబ పరిస్థితులు, సమస్యలకు దారితీసిన కారణాలను ఓపికగా తెలుసుకున్నారు. ప్రతి ఫిర్యాదును కేవలం ఒక సమస్యగా చూడకుండా, దాని వెనుక ఉన్న కుటుంబ పరిస్థితులు, వ్యక్తిగత కారణాలు, పరస్పర అపార్థాలను అర్థం చేసుకుని స్పందించాలని పోలీసు అధికారులకు సూచించారు.

**విడాకుల తర్వాత మళ్లీ కలిసిన దంపతులు....**

2026లో కుటుంబ వివాదాల కారణంగా తులసి, ఆమె భర్త సాయికుమార్ కోర్టు ద్వారా విడాకులు తీసుకున్నారు. అయితే పిల్లల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ఇరువురూ తిరిగి ఫ్యామిలీ కౌన్సిలింగ్ సెంటర్‌ను ఆశ్రయించారు. అడిషనల్ ఎస్పీ అంకిత సురాన సమక్షంలో డీఎస్పీ జగన్నాథరావు, సీఐలు రెడ్డప్ప, జయనాయక్, కౌన్సిలింగ్ సెంటర్ ప్రతినిధులు దంపతులతో మాట్లాడి వారి అభిప్రాయాలను తెలుసుకున్నారు.

కుటుంబ బంధాల విలువ, పిల్లల భవిష్యత్తు, పరస్పర అవగాహన ప్రాధాన్యతను వారికి వివరించి కౌన్సిలింగ్ నిర్వహించారు. అనంతరం ఇరువురి అంగీకారంతో విడిపోయిన దంపతులు తిరిగి ఒక్కటయ్యారు. విడిపోయిన కుటుంబాలను తిరిగి కలపడంలో ఫ్యామిలీ కౌన్సిలింగ్ సెంటర్లు అందిస్తున్న సేవలకు ఈ ఘటన మంచి ఉదాహరణగా నిలుస్తుందని అడిషనల్ ఎస్పీ పేర్కొన్నారు.

**ప్రారంభ దశలోనే పరిష్కారం.....**

కుటుంబ సమస్యలు పెద్ద వివాదాలుగా మారకముందే ప్రారంభ దశలోనే పరిష్కరించుకోవడం ఉత్తమమని అంకిత సురాన సూచించారు. ఇరుపక్షాల అభిప్రాయాలను పూర్తిగా తెలుసుకుని, పరిస్థితులకు అనుగుణంగా నిష్పక్షపాతంగా కౌన్సిలింగ్ అందించడం ద్వారా అనేక సమస్యలకు పరిష్కారం చూపవచ్చని తెలిపారు. ఫిర్యాదుదారుల సమస్యలను సున్నితంగా, ఓర్పుతో విని వారికి అవసరమైన సహకారం అందించాలని సూచించారు.

జిల్లాలోని అన్ని సబ్‌డివిజన్లలో ఎస్పీ ఎస్. సతీష్ కుమార్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఫ్యామిలీ కౌన్సిలింగ్ సెంటర్ల ద్వారా కుటుంబ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నామని తెలిపారు. ప్రజలు ఎలాంటి సంకోచం లేకుండా తమ కుటుంబ సమస్యలను కౌన్సిలింగ్ సెంటర్ సిబ్బందితో పంచుకోవాలని, అవసరమైన మార్గదర్శకత్వం అందించేందుకు పోలీస్ శాఖ ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటుందని భరోసా కల్పించారు. కౌన్సిలింగ్ సెంటర్‌లో ఫిర్యాదుల స్వీకరణ, నమోదు విధానం, కౌన్సిలింగ్ ప్రక్రియ, ఇరువర్గాలతో నిర్వహిస్తున్న చర్చలు, అందిస్తున్న సేవలను అడిషనల్ ఎస్పీ పరిశీలించారు. కుటుంబాల్లో శాంతి, పరస్పర అవగాహన, సామరస్యాన్ని పెంపొందించేందుకు కృషి చేస్తున్న అధికారులు, ప్రతినిధులు, సిబ్బందిని ఆమె అభినందించారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ జగన్నాథరావు, సీఐలు రెడ్డప్ప, జయనాయక్, ఫ్యామిలీ కౌన్సిలింగ్ సెంటర్ ప్రతినిధులు, న్యాయవాదులు బాలసుందరి భార్గవి, చలపతి, రాఘవేంద్ర, గంగా భవాని, సంబంధిత పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# రెండేళ్ల కూటమి పాలనపై ప్రజల్లో సంతృప్తి: ఎమ్మెల్యే అమిలినేని

**- తెనగల్లులో ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమం, అభివృద్ధిని వివరించిన టీడీపీ నేతలు**

**కుందుర్పి, ఆగస్టు 29:అనంత జనశక్తి న్యూస్**



రాష్ట్రం ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నప్పటికీ కూటమి ప్రభుత్వం రెండేళ్ల పాలనలో అభివృద్ధి, సంక్షేమానికి సమ ప్రాధాన్యతనిస్తూ రాష్ట్రాన్ని గాడిలో పెడుతోందని కళ్యాణదుర్గం ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు అన్నారు. ఇంటింటికీ వెళ్లి ప్రజలను అడిగితే కూటమి ప్రభుత్వ రెండేళ్ల పాలనపై సంతోషం వ్యక్తం చేస్తున్నారని తెలిపారు.కుందుర్పి మండలం తెనగల్లు గ్రామంలో శనివారం నిర్వహించిన 'ఇంటింటికీ తెలుగుదేశం' కార్యక్రమంలో ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు, పార్టీ పరిశీలకుడు, రాష్ట్ర వాల్మీకి కార్పొరేషన్ డైరెక్టర్ రామకృష్ణ, టీడీపీ నాయకులతో కలిసి పాల్గొన్నారు. గ్రామానికి చేరుకున్న ఎమ్మెల్యేకు మండల టీడీపీ నాయకులు, గ్రామస్థులు గజమాలతో ఘనస్వాగతం పలికారు.అనంతరం మహర్షి వాల్మీకి, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. పార్టీ జెండాను ఎగురవేసిన అనంతరం నాయకులు ఇంటింటికీ వెళ్లి ప్రజలను కలిసి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కూటమి ప్రభుత్వం రెండేళ్లలో చేపట్టిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను వివరిస్తూ కరపత్రాలను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గత ఐదేళ్ల వైసీపీ పాలనలో సంక్షేమం పేరుతో రాష్ట్రంపై అప్పుల భారం పెంచారని విమర్శించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అభివృద్ధి కార్యక్రమాలను చేపడుతూనే సంక్షేమ పథకాలను కొనసాగిస్తూ అన్ని వర్గాలకు అండగా నిలుస్తోందన్నారు.తెనగల్లు గ్రామంలో ప్రధాన రహదారి నిర్మాణానికి రూ.కోటి వెచ్చించి సీసీ రోడ్డు నిర్మించామని తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో గ్రామాల్లో కనీసం సీసీ రోడ్ల నిర్మాణం కూడా జరగలేదని విమర్శించిన ఆయన, ఇకపై కాలనీల్లోనూ సీసీ రోడ్లు నిర్మిస్తామని చెప్పారు. వీరశైవ లింగాయత్‌ల విజ్ఞప్తి మేరకు యల్లమ్మ ఆలయ అభివృద్ధికి తన సొంత నిధుల నుంచి రూ.50 వేలను ఎమ్మెల్యే అందజేశారు. అలాగే గ్రామంలోని మహర్షి వాల్మీకి విగ్రహానికి పైకప్పు నిర్మాణం కోసం రూ.లక్ష విరాళం అందిస్తానని ప్రకటించారు.ప్రజల సమస్యలను తెలుసుకుని వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవడమే 'ఇంటింటికీ తెలుగుదేశం' కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని టీడీపీ నాయకులు తెలిపారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్థులు పాల్గొన్నారు.

# మంగళగిరి టీడీపీ కార్యాలయంలో ప్రజాదర్బార్

**- ప్రజల సమస్యల పరిష్కారానికి తక్షణ చర్యలు: మంత్రి పయ్యావుల కేశవ్**

**మంగళగిరి, ఆగస్టు 29, అనంత జనశక్తి న్యూస్**

ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని రాష్ట్ర ఆర్థిక, ప్రణాళిక, వాణిజ్య పన్నులు, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ తెలిపారు. శనివారం మంగళగిరిలోని టీడీపీ కార్యాలయంలో నిర్వహించిన ప్రజాదర్బార్ కార్యక్రమంలో ఆయన ప్రజల నుంచి వినతిపత్రాలను స్వీకరించారు.రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు, నాయకులు తమ సమస్యలను మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ఆయా సమస్యలను అడిగి తెలుసుకున్న మంత్రి, వాటి పరిష్కారానికి సంబంధిత అధికారులతో మాట్లాడి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.ఈ సందర్భంగా మంత్రి పయ్యావుల కేశవ్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం ప్రజా సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. అభివృద్ధి, సంక్షేమం ప్రభుత్వానికి రెండు కళ్ల వంటివని పేర్కొన్నారు. అర్హులైన పేదలందరికీ సంక్షేమ పథకాలు అందించడంతో పాటు రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు.ప్రజల నుంచి వచ్చిన ప్రతి వినతిని పరిశీలించి, సమస్యల పరిష్కారంలో ఎలాంటి జాప్యం లేకుండా చర్యలు తీసుకుంటామని మంత్రి స్పష్టం చేశారు. ప్రజలకు అందుబాటులో ఉండి వారి సమస్యలను పరిష్కరించడమే ప్రజాదర్బార్ ప్రధాన ఉద్దేశమని తెలిపారు.





# కదిరిలో ప్రజా పోలీ క్లినిక్ హాస్పిటల్ ప్రారంభం

**- వైద్య సేవలు ప్రజలకు మరింత చేరువ కావాలి: ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్**

**కదిరి, ఆగస్టు 29: అనంత జనశక్తి న్యూస్**

కదిరి పట్టణ ప్రజలకు మెరుగైన వైద్య సేవలు మరింత చేరువ చేయాలనే ఉద్దేశంతో నూతనంగా ఏర్పాటు చేసిన ప్రజా పోలీ క్లినిక్ హాస్పిటల్ శనివారం ప్రారంభమైంది.కదిరి పట్టణంలోని కరెంట్ ఆఫీస్ ఎదురుగా డాక్టర్ లక్ష్మీ రామ్ నూతనంగా ఏర్పాటు చేసిన ఈ ఆసుపత్రిని కదిరి నియోజకవర్గ ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కదిరి పట్టణంతో పాటు పరిసర ప్రాంతాల ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందుబాటులోకి రావడం సంతోషకరమన్నారు. ఆసుపత్రి సేవా దృక్పథంతో పనిచేస్తూ ప్రజలకు అవసరమైన వైద్య సేవలను అందించాలని ఆకాంక్షించారు.నూతనంగా ప్రారంభమైన ప్రజా పోలీ క్లినిక్ హాస్పిటల్ నిర్వాహకులు డాక్టర్ లక్ష్మీ రామ్‌కు ఎమ్మెల్యే శుభాకాంక్షలు తెలిపారు. ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడంలో ఆసుపత్రి కీలకంగా నిలవాలని ఆకాంక్షించారు.కార్యక్రమంలో వైద్య సిబ్బంది, ఆసుపత్రి నిర్వాహకులు, స్థానిక ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# బీరే ప్రసాద్ మృతి తీవ్ర విషాదం



**కుటుంబ సభ్యులను పరామర్శించిన పరిటాల శ్రీరామ్.....**

**ధర్మవరం ఆగష్టు 29 అనంత జనశక్తి న్యూస్ :**

ధర్మవరం మున్సిపాలిటీ మాజీ చైర్మన్ బీరే గోపాలకృష్ణ సోదరుడు బీరే ప్రసాద్ అనారోగ్యంతో మృతి చెందడం తీవ్రంగా కలచివేసింది. విషయం తెలుసుకున్న పరిటాల శ్రీరామ్ వారి నివాసానికి వెళ్లి ప్రసాద్ భౌతికకాయానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి, వారి దుఃఖంలో పాలుపంచుకున్నారు. ఆప్తుడిని కోల్పోయిన కుటుంబానికి మాటలతో ఓదార్పు చెప్పడం కష్టం ఈ బాధాకర సమయంలో కుటుంబ సభ్యులకు అండగా నిలవడం మన బాధ్యత. ప్రసాద్ ఆత్మకు శాంతి చేకూరాలని, కుటుంబ సభ్యులకు ఈ విషాదాన్ని తట్టుకునే మనోధైర్యాన్ని ప్రసాదించాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నాం. కుటుంబం కష్టాల్లో ఉన్నప్పుడు అండగా నిలవడమే మానవత్వం.. అదే పరిటాల కుటుంబం చూపించే ఆప్యాయత.

# తెలుగు వెలుగులకు ఘన నివాళి



**విశ్వభారతీ పాఠశాలలో ఘనంగా తెలుగు భాషా దినోత్సవం.....**

**ధర్మవరం ఆగష్టు 29 అనంత జనశక్తి న్యూస్ :**

ధర్మవరం గిడుగు వెంకట రామమూర్తి పంతులు జయంతిని పురస్కరించుకొని శ్రీ సత్యసాయి జిల్లా ధర్మవరం పట్టణంలోని విశ్వభారతీ ఆంగ్ల మాధ్యమ పాఠశాలలో శుక్రవారం తెలుగు భాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గిడుగు వెంకట రామమూర్తి పంతులు చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. తెలుగు భాషాభివృద్ధికి ఆయన చేసిన విశేష కృషిని ఉపాధ్యాయులు, విద్యార్థులు స్మరించుకున్నారు. తెలుగు భాషను సరళీకరించి, సామాన్య ప్రజలకు సులభంగా అర్థమయ్యేలా చేయడంలో గిడుగు రామమూర్తి పంతులు చేసిన కృషి చిరస్మరణీయమని పేర్కొన్నారు. మాతృభాష మన సంస్కృతికి మూలం.. మన సంప్రదాయాలకు వారధి అని ఉపాధ్యాయులు విద్యార్థులకు వివరించారు. తెలుగు భాష గొప్పతనం, ప్రాధాన్యతను తెలియజేస్తూ విద్యార్థులకు వివిధ కార్యక్రమాలు నిర్వహించారు. తెలుగు భాషను ప్రేమించడం, గౌరవించడం, భావితరాలకు అందించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని సూచించారు. ఈ సందర్భంగా విద్యార్థుల్లో మాతృభాషపై మరింత ఆసక్తి, అభిమానం పెంపొందించేలా పలు అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో పాఠశాల యాజమాన్యం, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.




# తెలుగు వెలుగులకు ఘన సత్కారం

## శ్రీ ఉషోదయ పాఠశాలలో ఘనంగా మాతృభాషా దినోత్సవం

**ధర్మవరం ఆగష్టు 29 అనంత జనశక్తి న్యూస్ :**

ధర్మవరం పట్టణంలోని కొత్తపేటలో ఉన్న శ్రీ ఉషోదయ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్లో శనివారం మాతృభాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. తెలుగు భాష గొప్పతనాన్ని చాటుతూ విద్యార్థులు, ఉపాధ్యాయులు కార్యక్రమంలో ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా తెలుగు భాష బోధనలో విశేష సేవలందిస్తున్న తెలుగు ఉపాధ్యాయులను పాఠశాల కరస్పాండెంట్ ఎస్. చాంద్ బాషా చేతుల మీదుగా ఘనంగా సన్మానించారు. మాతృభాషను విద్యార్థులకు చేరువ చేయడంలో ఉపాధ్యాయుల పాత్ర ఎంతో కీలకమని ఈ సందర్భంగా పేర్కొన్నారు. కార్యక్రమంలో విద్యార్థులు తెలుగు తల్లి వేషధారణలో హాజరై ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. తెలుగు భాష, సంస్కృతి, సంప్రదాయాలపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తూ పలు కార్యక్రమాలు నిర్వహించారు. మాతృభాష మన సంస్కృతికి మూలం, మన ఆత్మగౌరవానికి ప్రతీక అని, తెలుగు భాషను ప్రేమించి, గౌరవించి భావితరాలకు అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని కార్యక్రమంలో పలువురు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, ఉపాధ్యాయినులు, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొని మాతృభాషా దినోత్సవాన్ని విజయవంతం చేశారు.

# రూ.15.60 లక్షలు ఖర్చు చేసినా.. పదేళ్లుగా మూతపడ్డ చిల్డ్రన్స్ పార్క్



**నిధులు లేకుంటే దత్తత ఇవ్వండి.. అభివృద్ధి చేస్తాం: డాక్టర్ సీపాన గుణవతి**

**సోంపేట, ఆగస్టు 29:అనంత జనశక్తి న్యూస్**

ప్రభుత్వ నిధులతో నిర్మించిన సోంపేట చిల్డ్రన్స్ పార్క్ పదేళ్లు దాటినా ప్రజలకు అందుబాటులోకి రాకపోవడంపై జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఆగ్రహం వ్యక్తం చేసింది. రూ.15.60 లక్షలతో నిర్మించిన ప్రహరీ గోడలు శిథిలావస్థకు చేరినా అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోవడం లేదని సంఘం రాష్ట్ర మహిళా కన్వీనర్ డాక్టర్ సీపాన గుణవతి విమర్శించారు.పార్క్ అభివృద్ధికి నిధులు లేని పక్షంలో తమ సంఘానికి దత్తత ఇవ్వాలని, ప్రభుత్వంపై భారం లేకుండా అభివృద్ధి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తామని ఆమె తెలిపారు. పార్క్ చుట్టూ రహదారులు ఆక్రమణలకు గురవుతున్నాయని, దీనిపై అధికారులకు ఫిర్యాదు చేసినా చర్యలు లేవన్నారు.ఆర్‌టీఐ ద్వారా పార్క్ వివరాలు కోరినా స్పందన లేకపోవడంతో ప్రథమ అప్పీల్ దాఖలు చేసినట్లు తెలిపారు. పార్క్ పరిస్థితి, ఆక్రమణలు, అధికారుల నిర్లక్ష్యంపై ముఖ్యమంత్రి కార్యాలయానికి ఫిర్యాదు చేసినట్లు గుణవతి వెల్లడించారు. పార్క్‌ను వెంటనే పునరుద్ధరించి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని సంఘం డిమాండ్ చేసింది.

# పాలపాటి దిన్నె ఆంజనేయస్వామి ఆలయంలో ఘనంగా అన్నదానం



**ఎమ్మెల్యే కందికుంట సేవా కార్యక్రమాలపై భక్తుల ప్రశంసలు**

**నల్లచెరువు, ఆగస్టు 29:అనంత జనశక్తి న్యూస్**

శ్రావణమాస ఉత్సవాల్లో భాగంగా మూడో శ్రావణ శనివారం సందర్భంగా పాలపాటి దిన్నె శ్రీ ఆంజనేయస్వామి ఆలయంలో భక్తులకు నిత్య అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కదిరి ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.భక్తుల సౌకర్యార్థం ప్రత్యేక టెంట్లు ఏర్పాటు చేసి, పరిశుభ్రమైన వాతావరణంలో భోజన ఏర్పాట్లు చేశారు. భక్తులకు ఆప్యాయంగా అన్నప్రసాదం వడ్డించారు. అన్నదానం ఏర్పాట్లు, భోజనం రుచికరంగా ఉండటంపై భక్తులు సంతృప్తి వ్యక్తం చేశారు.భక్తుల సౌకర్యాన్ని దృష్టిలో ఉంచుకుని అన్నదాన కార్యక్రమం నిర్వహించిన ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్‌కు భక్తులు కృతజ్ఞతలు తెలిపారు. స్వామివారి ఆశీస్సులు ఎమ్మెల్యేపై ఎల్లప్పుడూ ఉండాలని ఆకాంక్షించారు.

# విజన్ లో నశా ముక్తి భారత్ అభియాన్ కార్యక్రమం

**యాడికి, ఆగష్టు 29, అనంత జనశక్తి న్యూస్ :**

భారత ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన నశా ముక్తి భారత అభియాన్ కార్యక్రమాన్ని ఈశ్వరయ్య బ్రహ్మకుమారి విశ్వవిద్యాలయం శనివారం యాడికి లో ఉన్న విజన్ పాఠశాలలో కార్యక్రమంను నిర్వహించారు.ఈ సందర్భంగా ప్రజాపిత ఈశ్వరియ బ్రహ్మకుమారి విశ్వవిద్యాలయం ముఖ్య ప్రసంగీకులు పద్మజ , రామ్మోహన్ లు మాట్లాడుతూ విద్యార్థులకు మత్తుపదార్థాల జోలికి వెళ్లకూడదని ,మొబైల్ ఎక్కువగా వాడ రాదని, వాటి గురించి వచ్చే దుష్పరిణామాల గురించి వివరించారు. పాఠశాలలోనే ఉపాధ్యాయులకు రక్షాబంధన్ కార్యక్రమం నిర్వహించి సోదర భావాన్ని చాటారు.ఈ కార్యక్రమంలో కరస్పాండెంట్ విశ్వనాథ్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు



# బ్లూమూన్ విద్యాసంస్థల్లో ఘనంగా జాతీయ క్రీడా దినోత్సవ వేడుకలు

**- క్రీడలతోనే ఆరోగ్యకరమైన సమాజం: ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్**

**కదిరి, ఆగస్టు 29: అనంత జనశక్తి న్యూస్**

కదిరి మున్సిపాలిటీ పరిధిలోని కుటాగుల్ల బ్లూమూన్ విద్యాసంస్థల్లో శనివారం జాతీయ క్రీడా దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. విద్యాసంస్థల అధినేత మంచి శివశంకర్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి కదిరి ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ చంద్రుని వెలుగులో హాకీ సాధన చేసి భారత క్రీడా ఖ్యాతిని ప్రపంచానికి చాటిన గొప్ప క్రీడాకారుడు మేజర్ ధ్యాన్‌చంద్ అని కొనియాడారు. ఆయన జయంతిని పురస్కరించుకుని జాతీయ క్రీడా దినోత్సవాన్ని నిర్వహించడం సంతోషకరమన్నారు. క్రీడలు కేవలం గెలుపు, పతకాల కోసమే కాదని, శారీరక ఆరోగ్యం, మానసిక ఉల్లాసం, క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం పెంపొందించడంలో కీలకపాత్ర పోషిస్తాయని తెలిపారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని సూచించారు. పిల్లలు క్రీడలపై ఆసక్తి చూపితే తల్లిదండ్రులు వారిని ప్రోత్సహించాలని కోరారు.బ్లూమూన్ విద్యాసంస్థల్లో అందుబాటులో ఉన్న ఆటస్థలాన్ని విద్యార్థులు పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే సూచించారు.







మారుతున్న సాంకేతిక పరిస్థితులకు అనుగుణంగా విద్యార్థులు తమ నైపుణ్యాలను పెంచుకోవాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా తెలుగు భాషా దినోత్సవం, జాతీయ క్రీడా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు.

**సాంకేతికతను అందిపుచ్చుకోవడంలో ముందంజ**

బ్లూమూన్ విద్యాసంస్థల అధినేత మంచి శివశంకర్ మాట్లాడుతూ మారుతున్న కాలానికి అనుగుణంగా సాంకేతికతను అందిపుచ్చుకోవడంలో తమ విద్యాసంస్థలు ముందుంటాయని తెలిపారు. ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ మంచి క్రీడాకారుడని, ఆయనను సన్మానించడం గర్వకారణమన్నారు. యువత శారీరకంగా, మానసికంగా దృఢంగా ఉన్నప్పుడే దేశం మరింత అభివృద్ధి చెందుతుందని పేర్కొన్నారు. విద్యారంగంలో సాంకేతికతను సమర్థవంతంగా వినియోగిస్తూ విద్యార్థులకు మెరుగైన విద్య అందించేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు.

**విజేతలకు బహుమతులు**

విద్యాసంస్థల్లో నిర్వహించిన వివిధ క్రీడా పోటీల్లో విజేతలు, రన్నర్స్‌కు ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్, శివశంకర్ బహుమతులు అందజేశారు.గెలుపోటములను సమానంగా స్వీకరించి క్రీడాస్ఫూర్తితో ముందుకు సాగాలని విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు, నృత్యాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. చిన్నారుల ఆటపాటలు, నృత్యాలతో సభా వేదిక సందడిగా మారింది. తమ పిల్లల ప్రదర్శనలను తిలకించిన తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు సురేందర్‌రెడ్డి, మాధవరెడ్డి, వెంకట్‌రెడ్డి, మనోహర్‌రెడ్డి, రామాంజులు రెడ్డి, మున్వర్ భాష, ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థుల కష్టాలు చూసి ‘అమిలినేని విద్యాచక్రం’ ప్రారంభించాం

**- తెనగల్లు నుంచి డీఎస్సీలో 9 మంది ఉపాధ్యాయులుగా ఎంపిక కావడం గర్వకారణం: ఎమ్మెల్యే అమిలినేని**

**కుందుర్పి, ఆగస్టు 29:అనంత జనశక్తి న్యూస్**

విద్యార్థులు పుస్తకాల బ్యాగులు మోసుకుంటూ కిలోమీటర్ల మేర నడిచి పాఠశాలలకు వెళ్తున్న దృశ్యాలను చూసి తన మనసు చలించిందని, వారి కష్టాలను తీర్చాలనే ఉద్దేశంతోనే ‘అమిలినేని విద్యాచక్రం’ కార్యక్రమం ద్వారా సైకిళ్లను అందిస్తున్నామని కళ్యాణదుర్గం ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు అన్నారు. కుందుర్పి మండలం తెనగల్లు గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం విద్యార్థులకు ఉచిత సైకిళ్ల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు, పార్టీ పరిశీలకుడు, రాష్ట్ర వాల్మీకి కార్పొరేషన్ డైరెక్టర్ రామకృష్ణ ముఖ్య అతిథులుగా హాజరై విద్యార్థులకు సైకిళ్లు అందజేశారు.ఎస్సార్సీ సంస్థ సహకారంతో సుమారు రూ.5 కోట్ల వ్యయంతో 7,300 సైకిళ్లను విద్యార్థులకు అందిస్తున్నామని ఎమ్మెల్యే తెలిపారు. 9, 10 తరగతులు, ఇంటర్ చదువుతున్న విద్యార్థులకు వీటిని అందిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమం వెనుక ఎస్సార్సీ సంస్థ చైర్మన్ రాజగోపాల్, వెంకటేష్, యశ్వంత్, ధర్మతేజ, అవినాష్‌తో పాటు సంస్థలో పనిచేస్తున్న సుమారు




7,000 మంది కృషి ఉందన్నారు.

**తెనగల్లు నుంచి 9 మంది ఉపాధ్యాయులు**

చదువులకు నిలయంగా ఉన్న తెనగల్లు గ్రామం నుంచి మెగా డీఎస్సీ ద్వారా 9 మంది ఉపాధ్యాయులుగా ఉద్యోగాలు సాధించడం గొప్ప విషయమని ఎమ్మెల్యే అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా మూడు లక్షల మందికి పైగా పరీక్ష రాయగా 16,500 మంది ఉద్యోగాలు సాధించారని తెలిపారు.కష్టపడి డీఎస్సీలో ఉద్యోగాలు సాధించిన ఉపాధ్యాయులపై అసత్య ఆరోపణలు చేసి వారిని, వారి కుటుంబాలను అవమానించడం సరికాదన్నారు. డీఎస్సీలో అక్రమాలు జరిగాయని ఎవరైనా ఆధారాలతో నిరూపిస్తే ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని చెప్పారు.

**తెనగల్లు గ్రామంలో లైబ్రరీ ఏర్పాటు**

గ్రామంలోని పేద విద్యార్థి భారతి న్యాయ విద్య చదివే బాధ్యతను తాము తీసుకుంటామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. విద్యార్థుల కోసం తెనగల్లు గ్రామంలో తప్పకుండా లైబ్రరీ ఏర్పాటు చేస్తామని తెలిపారు.‘అమ్మ ఒడి’ పేరుతో గతంలో ఒక కుటుంబంలో ఒకరికి మాత్రమే ప్రయోజనం కల్పిస్తే, కూటమి ప్రభుత్వం ‘తల్లికి వందనం’ ద్వారా చదువుకుంటున్న పిల్లలందరికీ ప్రయోజనం కల్పిస్తోందని పేర్కొన్నారు.

**అభివృద్ధిపై ఎమ్మెల్యే విమర్శలు**

గత ఐదేళ్లలో గ్రామాల్లో చేసిన అభివృద్ధి ఏమిటో చూపించాలని, చూపిస్తే తానే వారిని సన్మానిస్తానని ఎమ్మెల్యే సవాల్ చేశారు. కష్టపడి సంపాదించామని, లంచాలు తీసుకోలేదని, భూ కబ్జాలకు పాల్పడలేదని అన్నారు.ప్రధాని నరేంద్ర మోదీ సహకారంతో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేష్ రాష్ట్ర అభివృద్ధికి బాటలు వేస్తున్నారని తెలిపారు. యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించేందుకు మంత్రి నారా లోకేష్ కృషి చేస్తున్నారని చెప్పారు.వెలిగొండ ప్రాజెక్టును వేల కోట్ల రూపాయలతో పూర్తి చేసి రేపు ముఖ్యమంత్రి ప్రజలకు అంకితం చేయనున్నారని ఎమ్మెల్యే పేర్కొన్నారు. గత ప్రభుత్వ హయాంలో బీటీపీ ప్రాజెక్టును పట్టించుకోలేదని విమర్శించారు.కార్యక్రమంలో స్థానిక విద్యాశాఖ అధికారులు, ఉపాధ్యాయులు, టీడీపీ నాయకులు, స్థానిక ప్రజాప్రతినిధులు, విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# కార్పొరేటర్ లక్ష్మీ ప్రత్యూష కు పితృవియోగం

**నివాళులర్పించిన వేమిరెడ్డి విజయభాస్కర్ రెడ్డి**

**నెల్లూరు ఆగస్ట్ 29,అనంత జనశక్తి న్యూస్**

నగరంలోని స్థానిక 4va డివిజన్ కార్పొరేటర్ పోలంరెడ్డి లక్ష్మీ ప్రత్యూష తండ్రి రాజారెడ్డి శనివారం స్వర్గస్తులయ్యారు. నాలుగో డివిజన్ పరిధిలోని శ్రీనివాస నగర్ నివాసం వద్ద రాజారెడ్డి భౌతిక కాయానికి నారాయణ విద్యాసంస్థల జనరల్ మేనేజర్ వేమిరెడ్డి విజయభాస్కర్ రెడ్డి తో పాటు కార్పొరేటర్ దామవరపు రాజశేఖర్, శ్రీ తల్పగిరి రంగనాథ స్వామి ఆలయ చైర్మన్ లెక్కల వెంకటరెడ్డి, టిడిపి సీనియర్ నేత ముడియాల నారాయణరెడ్డి పలువురు ప్రముఖులు స్థానికులు సందర్శించి నివాళులర్పించారు. వేమిరెడ్డి విజయభాస్కర్ రెడ్డి పూలమాలలు వేసి వారి కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తూ వారికి ధైర్యం చెప్పారు. రాజారెడ్డి పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని వేమిరెడ్డి ఆకాంక్షించారు. అంతిమ యాత్రకు టిడిపి నాయకులు కార్యకర్తలు వారి అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# విజన్ లో ఘనంగా తెలుగు భాషా , జాతీయ క్రీడా దినోత్సవం

**యాడికి , ఆగష్టు 29, అనంత జనశక్తి న్యూస్ :**

మండల కేంద్రంలో ఉన్న ఉన్న విజన్ ఇంగ్లీష్ మీడియం హై స్కూల్ నందు తెలుగు భాషా , జాతీయ క్రీడా దినోత్సవం ను ఘనంగా నిర్వహించారు. గిడుగు రామమూర్తి పంతులు జయంతి సందర్భంగా ప్రతి సంవత్సరం తెలుగు భాషా దినోత్సవం ను జరుపుకుంటున్నందున విజన్ ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు ఆయన చిత్ర పటానికి ,మేజర్ ధ్యాన్ చంద్ చిత్రపటానికి పూల మాల వేసి టెంకాయ సమర్పించి నివాళులు అర్పించారు. తదుపరి తెలుగు పద్యాలు, పాటలు,కవులు వారి రచనల గురించి చర్చ, తెలుగులో వక్తృత్వ పోటీలు, పరమానందయ్య శిష్యుల కథలు విద్యార్థులకు యోగాసనాలు, కబడ్డీ క్రీడా పోటీలు మొదలైన అనేక కార్యక్రమాలను విద్యార్థులచే నిర్వహించారు. విజన్ విద్యా సంస్థల కరస్పాండెంట్ విశ్వనాథ్ మాట్లాడుతూ గిడుగు రామమూర్తి తెలుగు వ్యవహారిక భాష కొరకు ఎంతో శ్రమించారని, తెలుగు సాహిత్యానికి ఎంతో చేశారని,అలాగే తెలుగు సాహితీ చరిత్ర గురించి వివరిస్తూ స్త్రీల కోకిల కంఠములలో,కర్షక శ్రామిక స్వేదములో,తెలుగు పండుగలలో తెలుగు సాహిత్యం, గొప్పదనం గురించి తెలుస్తుందని తెలిపారు.మాతృదేవి,మాతృ భూమి,మాతృ భాష ఈ మూడింటి ఔన్నత్యం, మాతృ శబ్దం వింటే మనసు పులకిస్తుందని "దేశ భాష లందు తెలుగు లెస్స" అని తెలిపారు. తెలుగు ఉపాధ్యాయులు ఓబులేసు, అనిత లను, వ్యాయామ ఉపాధ్యాయుడు ప్రసాద్ లను సన్మానించారు .ఈ కార్యక్రమంలో విజన్ ఉపాధ్యాయ బృందం ,విద్యార్థులు పాల్గొన్నారు.



# శ్రావణమాసం అంజన్నకు ప్రత్యేక పూజలు

**అగళి ఆగష్టు 29,అనంత జనశక్తి న్యూస్:**

అగళి మండలంలోని రామాపురం గ్రామములో ఆంజనేయ స్వామి దేవాలయంలో రామాపురం గ్రామస్తులు అందరూ కలిసి గ్రామ పెద్దల ఆద్వర్యంలో శ్రావణమాసం ప్రత్యేక పూజ కార్యక్రమములు శనివారం వైభవంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఆలయలో తెల్లవారుజమున ఉదయం నుండి ఆంజనేయస్వామికి వివిధ రకాల పూలతో అలకరించి వేద మంత్రోచ్చారణ మధ్య ప్రత్యేక పూజలు, పంచామృత అభిషేకాలు అర్చనలు నిర్వహించారు. మహిళలు పెద్ద ఎత్తున వచ్చి అంజన్నకు జ్యోతులు సమర్పించారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై స్వామి వారిని దర్శించుకొని తీర్థప్రసాదాలు స్వీకరించారు. అనంతరం వచ్చిన భక్తులకు అన్నదానం చేశారు.



# ఒలింపిక్స్ లక్ష్యంగా క్రీడాకారులు పోటీ పడాలి

- క్రీడాకారుల్ని ప్రోత్సహించేలా కూటమి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు
- ప్రతి జిల్లాలోనూ ప్రత్యేక క్రీడా శిక్షణా కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నాం
- తిరుపతిలో జాతీయ క్రీడల దినోత్సవ వేడుకల్లో పాల్గొన్న మంత్రి కొల్లు రవీంద్ర

**తిరుపతి ఆగస్టు 29, అనంత జనశక్తి న్యూస్**



ప్రపంచ స్థాయిలో మన క్రీడాకారులు రానిచ్చేలా రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటోందని రాష్ట్ర గనులు, భూగర్భ వనరులు, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర పేర్కొన్నారు. తిరుపతి ఎస్.వి.యూనివర్సిటీ ఆడిటోరియంలో నిర్వహించిన జాతీయ క్రీడల దినోత్సవ వేడుకలలో పాల్గొన్నారు. అమరావతి ఛాంపియన్ షిప్ 2026 విజేతలకు స్పీకర్ చింతకాయల అయ్యన్న పాత్రుడు చేతుల మీదుగా అవార్డులు అందించారు. జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా మేజర్ ధ్యాన్ చంద్ చిత్రపటానికి నివాళులర్పించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ.. గ్రామస్థాయి నుండి క్రీడాకారుల్ని వెలికితీయడమే లక్ష్యంగా అమరావతి చాంపియన్ షిప్ నిర్వహించడం అభినందనీయం. ఈ స్థాయిలో కార్యక్రమాలు నిర్వహిస్తున్న శాప్ ఛైర్మన్, ఎండీకి ప్రత్యేక ధన్యవాదాలు. క్రీడల్ని ప్రోత్సహించాలి. క్రీడాకారుల్ని ప్రోత్సహించాలనే లక్ష్యంతో.. గతంలో హైదరాబాద్ కేంద్రంగా కామన్ వెల్త్ గేమ్స్ నిర్వహించాం. గత ఐదేళ్లు రాష్ట్రంలో క్రీడలు నిర్లక్ష్యానికి గురయ్యాయి. 201419 మధ్య ఏపీలో అనేక కార్యక్రమాలు చేపట్టినా.. తర్వాత వచ్చిన పాలకులు పట్టించుకోలేదు. ఆడుదాం ఆంధ్ర పేరుతో వాళ్లు ఆడుకున్నారు తప్ప క్రీడాకారుల్ని ప్రోత్సహించలేదు. కూటమి అధికారంలోకి వచ్చాక రాష్ట్రంలో క్రీడలకు మహర్దశ పట్టింది. అమరావతి మహానగరంలో 2500 ఎకరాల్లో స్పోర్ట్స్ సిటీ నిర్మిస్తున్నాం. స్పోర్ట్స్ యూనివర్సిటీ ఏర్పాటు చేస్తున్నాం. గతంలో పుల్లెల గోపీచంద్ అకాడమీకి చంద్రబాబు నాయుడు భూమి కేటాయించి ప్రోత్సహించడంతో పి.వి.సింధు లాంటి ఎంతో మంది క్రీడాకారులు వెలుగులోకి వచ్చారు. ఇప్పుడు ఏపీలో పుల్లెల గోపీచంద్, పి.వి.సింధు, శ్రీకాంత్ అకాడమీల ఏర్పాటుకు భూమి కేటాయించాం. శ్రీకాకుళం నుండి అనంత పురం వరకు ఎంతో మంది మెరికల్లాంటి క్రీడాకారులు ఉన్నారు. రాష్ట్రంలో ఆరు అకాడమీలు ఏర్పాటు చేసి.. మెరుగైన శిక్షణ ఇచ్చి ప్రపంచ స్థాయిలో జరిగే క్రీడల్లో ఏపీ క్రీడాకారులు ఉండేలా చర్యలు తీసుకుంటున్నాం. ప్రభుత్వం ఇచ్చే ప్రోత్సాహాన్ని అందిపుచ్చుకుని కష్టబడాలి. కేంద్ర ప్రభుత్వ సహకారాన్ని సద్వినియోగం చేసుకుందాం. యోగా దినోత్సవాన్ని విశాఖలో 5 లక్షల మందితో నిర్వహించి ప్రపంచ రికార్డు సాధించాం. రాష్ట్రాన్ని హెల్తీ, వెల్తీ స్టేట్ గా మార్చాలనేదే కూటమి లక్ష్యం. త్వరలో జరగబోయే ఒలింపిక్ క్రీడల్లో రాష్ట్రానికి ప్రతి క్రీడలో కూడా ఒక బహుమతి తీసుకురావడమే కూటమి ప్రభుత్వ లక్ష్యం. ఆ లక్ష్యాన్ని గుర్తుంచుకుని క్రీడాకారులు కూడా కష్టబడాలని మంత్రి కొల్లు రవీంద్ర పిలుపునిచ్చారు. కార్యక్రమంలో క్రీడా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి, ఎమ్మెల్యేలు ఆరని శ్రీనివాసులు, సోమిరెడ్డి చంద్ర మోహన్ రెడ్డి, SAAP చైర్మన్ రావినాయుడు తదితర నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

# అర్ధరాత్రి దొంగలు ఇంట్లోకి చొరబడేందుకు యత్నం

## దేహశుద్ధి చేసిన గ్రామస్తులు

**పుట్టపర్తి రూరల్ ఆగష్టు 29 అనంత జన శక్తి న్యూస్.**



పుట్టపర్తి మండల పరిధిలోని పెడపల్లి గ్రామంలో ఇద్దరు యువకులు అర్ధరాత్రి ఇంట్లోకి చొరబడే ప్రయత్నాలు సాగించార ని, ఇంటి యజమాని గ్రామస్తులు మేల్కొనడంతో దొంగలను పట్టుకుని దేహశుద్ధి చేసినట్లు బాధితులు వివరించారు. బాధితుల వివరాల మేరా పుట్టపర్తి మండల పరిధిలోని పెడపల్లి పెద్ద తండాలో నివాసముంటున్న ఇందిరాబాయి ఇంటి ఆవరణంలోకి, అదే గ్రామానికి చెందిన ఇద్దరు యువకులు అర్ధరాత్రి సమయంలో ప్రవేశించడానికి ప్రయత్నించారని, తన భర్త గొర్రెలు దొడ్డిలో పడుకొని ఉండగా, ఇంట్లో మగవారు లేనిది చూసి దొంగతనానికి ప్రయత్నించారని, వారిని కిటికీలో చూసి గమనించిన తను కుమార్తెకు ఫోన్ ద్వారా ఇంటిపై దొంగలు పడుతున్నారని ఫోన్లో సమాచారం అందించడంతో, తన భర్తకు, గ్రామస్తులకు ఫోన్ ద్వారా సమాచారం ఇవ్వడంతో మా ఇంటిపై నుండి దూకి పక్కింట్లో కి ఇరువురు వెళ్ళి ఉన్నారని వెంటనే గ్రామస్తులు వారిని గుర్తించి బయటకు ఈడ్చుకొచ్చి విద్యుత్ స్తంభానికి కట్టేసి పోలీసులకు సమాచారం ఇచ్చినట్లు తెలిపారు. ఇదే విషయాన్ని బాధితులు పుట్టపర్తి రూరల్ పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేశారు. గ్రామంలో తరచు దొంగతనాలు జరుగుతున్నాయని వీటిపై పోలీసులు ప్రత్యేక చొరవ చూపి నేరస్తులను అదుపులోకి తీసుకోవాలని వారు కోరారు. ఇటీవల పెడపల్లి పెద్ద తండాలోనే దొంగతనాలు ఎక్కువ జరుగుతున్నాయని, గ్రామస్తులు వాపోయారు. పట్ట పగలే లక్ష్మీరాం నాయక్ ఇంట్లో మూడున్నర తులాల బంగారం లక్ష రూపాయలు నగదు దోచుకు వెళ్ళినట్లు బాధితులు వాపోయారు. అంతే కాక పేడపల్లి, ప్రధాన రహదారి లో ఉన్న హరి కిరాణా అంగడిలో 20వేలు నగదు పదివేల రూపాయల విలువచేసే సిగరెట్లు దొంగలించారని , అదేవిధంగా కొట్లపల్లి సత్యనారాయణ బుక్ స్టాల్ నందు 30 వేల నగదు ఇతర వస్తువులను దొంగలించారని, పెడపల్లి పెద్ద తండాలో పూజారి జగదీష్ నాయక్ కు చెందిన 22 గొర్రెలను. రాత్రి వేళల్లో దొంగలించారని వాటి ఆచూకీ నేటికీ తెలియలేదని బాధితులు వాపోయారు. అదే తరుణంలో అర్ధరాత్రి దొంగలు పడ్డారని ఒక మహిళ అరవడంతో గ్రామస్తులంతా ఏకమై యువకులకు దేహ శుద్ధి చేశారు. వారిలో ఒక వ్యక్తి తప్పించుకొని పారిపోగా మరొక వ్యక్తి నీ పుట్టపర్తి పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

# ఆధ్యాత్మిక కేంద్రమైన పుట్టపర్తి లో అసాంఘిక చర్యలపై నిఘా

**పుట్టపర్తి రూరల్ ఆగష్టు 29 అనంత జన శక్తి న్యూస్.**



పుట్టపర్తి ఆధ్యాత్మిక కేంద్రంలో అసాంఘిక కార్యకలాపాలు నిర్వహించకుండా గట్టి చర్యలు చేపడుతున్నట్లు పుట్టపర్తి పట్టణ సీఐ యువరాజు తెలిపారు. యాక్సిడెంట్ ఫ్రీ జోన్ గా చేయాలని జిల్లా ఎస్పీ సతీష్ కుమార్ డిఎస్పి డి.ఎస్.పి సత్యనారాయణ ఆదేశాల మేరకు పట్టణంలో అసాంఘిక కార్యకలాపాలు జరగకుండా కఠిన చర్యలు చేపడుతున్నామని పుట్టపర్తి సీఐ యువరాజ్ పత్రికా సమావేశంలో వెల్లడించారు. పుట్టపర్తిలో ఓపెన్ డ్రింకింగ్, మద్యం సేవించి వాహనాలు నడపడం, గంజాయి, మట్కా వంటి అసాంఘిక కార్యకలాపాలు జరగకుండా పోలీసులు కఠిన చర్యలు తీసుకుంటున్నామని, దానికి అనుగుణంగా ప్రజలు కూడా పోలీసులకు సహకరించి తగిన సమాచారం ఇవ్వాలని కోరారు. పేకాట విషయానికి వస్తే పేకాట ఆడించే వాళ్ళు బాగుపడుతున్నారనీ కానీ ఆడే వాళ్ళు చెడిపోతున్నారని, ఆడించే వారిని ఎట్టి పరిస్థితుల్లోనూ వదలమన్నారు. నిన్నటి రోజు సాయి నగర్ వెనుక భాగం గోరిలలో ఆడుతున్న పేకాటరాయులను ఏడు మందిని అరెస్ట్ చేసి 14,500 స్వాధీనం చేసుకొని కోర్టుకు శనివారం హాజరుపరచమన్నారు. అదేవిధంగా వినాయక చవితిని ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని తేల్చి చెప్పారు. డీజేలకు ఎట్టి పరిస్థితుల్లోనూ అనుమతులు ఇవ్వమని, వాటికి ప్రత్యామ్నాయంగా సాంప్రదాయ పద్ధతులను వాడాలన్నారు. డీజేలలో వచ్చే ఎక్కువ డేసి బుల్స్ వలన గుండె జబ్బులు కలవారు, వృద్ధులు, పిల్లలకు ప్రాణాపాయం ఏర్పడే అవకాశం ఉన్నందువలన వాటిని నిషేధిస్తున్నామని, తెలిపారు. డీజే ల వల్ల వచ్చే అనర్థాలను అందరూ అర్థం చేసుకోవాలన్నారు. ప్రజలందరూ పోలీసు వారికి సహకరించి ఆధ్యాత్మిక కేంద్రంలో ప్రశాంత వాతావరణంలో పాటు అసాంఘిక కార్యకలాపాలు జరగని ప్రమాదాలు జరగని ఆధ్యాత్మిక కేంద్రంగా తీర్చిదిద్దడానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని పుట్టపర్తి అర్బన్ సీఐ యువరాజ్ కోరారు. అదే సమయంలో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారిని ఎట్టి పరిస్థితుల్లోనూ వదలబోమని కఠినంగా వ్యవహరిస్తామని హెచ్చరించారు.

# ఉచితంగా కార్పొరేట్ వైద్యం.. నెల్లూరు ప్రజలకు చూపుల భాగ్యం

- రూపాయి ఖర్చు లేకుండా చూపు ప్రసాదించే కార్పొరేట్ సేవలు
- నారాయణ వైద్య సేవల శిబిరానికి ప్రశంసలు వెల్లువ
- రూపాయి ఖర్చు లేకుండా ఇంటి వద్దకే కార్పొరేట్ సేవలు
- 3 కోట్ల మొబైల్ వ్యాన్ తో ప్రజల చెంతకే కార్పొరేట్ వైద్య సేవలు
- నేత్రదానంపై ప్రత్యేక అవగాహన.. నారాయణ వైద్య శిబిరంలో కీలక నిర్ణయాలు

**నెల్లూరు ఆగస్ట్ 29 అనంత జనశక్తి న్యూస్**



నెల్లూరు నగరంలోని 7వ డివిజన్, స్టోన్ హౌస్ పేట బీవీఎస్ మున్సిపల్ హైస్కూల్ ఆవరణలో నారాయణ నేత్ర జ్యోతి మరియు నారాయణ దంత సురక్ష ఉచిత వైద్య శిబిరం ఘనంగా నిర్వహించారు.. డాక్టర్ పొంగూరు నారాయణ గారి సొంత నిధులతో, 3 కోట్ల విలువైన ఆధునిక పరికరాల మొబైల్ వ్యాన్ ద్వారా కార్పొరేట్ స్థాయి ఉచిత వైద్య సేవలను ప్రజలకు అందిస్తున్నారు. ఈ క్యాంప్ లో ఉచిత కంటి, దంత పరీక్షలతో పాటు విద్యార్థులకు కంటిదానంపై ప్రత్యేక అవగాహన కల్పించారు.. ప్రజల వర్కింగ్ అవర్స్ కు ఎలాంటి ఇబ్బంది కలగకుండా ఈ ఉచిత వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నట్లు నారాయణ హాస్పిటల్ కంటి విభాగం ప్రొఫెసర్ డాక్టర్ సుధా, డివిజన్ కార్పొరేటర్ మల్యాద్రి తెలిపారు. పట్టణ, గ్రామీణ ప్రాంతాలతో పాటు పాఠశాలల్లోనూ సీనియర్ డాక్టర్లతో ప్రత్యేక పరీక్షలు నిర్వహిస్తున్నారని. ఇప్పటివరకు 12,200 మందికి పైగా ఉచిత కంటి పరీక్షలు పూర్తి చేసి, పరీక్షించిన 2 రోజుల్లోనే 6,900 మందికి పైగా ఉచితంగా నాణ్యమైన కంటి అద్దాలు పంపిణీ చేశారన్నారు... అలాగే 250 మందికి పైగా ఉచితంగా క్యాటరాక్ట్ శస్త్రచికిత్సలు విజయవంతంగా పూర్తి చేశారని తెలిపారు...రూపాయి ఖర్చు లేకుండా లభిస్తున్న ఈ కార్పొరేట్ వైద్య సేవలను ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ శిబిరంలో భాగంగా బీవీఎస్ మున్సిపల్ హైస్కూల్ విద్యార్థులకు, యువతకు కంటిదానం విశిష్టతపై ప్రత్యేక అవగాహన కల్పించారు. చిన్న వయసు నుంచే నేత్రదానంపై అవగాహన పెంచుకోవాలని, అంధత్వాన్ని నివారించడంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని డాక్టర్లు సూచించారు. అలాగే డయాబెటిక్ రెటినోపతి, గ్లాకోమా వంటి దీర్ఘకాలిక సమస్యల నివారణపై స్పష్టత ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఏజీఎం శేఖర్ రెడ్డి, కిన్నెర సాగర్, స్థానిక టిడిపి నేతలు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# సంక్షేమ పథకాలపై డోర్ టు డోర్ కార్యక్రమము

- ఇంటింటికి తెలుగుదేశం కార్యక్రమం

**అగళి ఆగష్టు 29,అనంత జనశక్తి న్యూస్:**

శాసనసభ్యులు తిరుమల తిరుపతి దేవస్థానం బోర్డు మెంబరు జిల్లా అధ్యక్షులు ఎం.ఎస్.రాజు, మాజీ శాసన మండలి సభ్యులు గుండుమల తిప్పే స్వామి వీరి ఆదేశాల మేరకు శనివారం అగళి మండలంలో అగళి 158 బూత్ లో తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో ఇంటింటికి తెలుగుదేశం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా నాయకులు, కార్యకర్తలు ఇంటింటికీ వెళ్లి ప్రజలను కలుసుకుని, గత రెండేళ్లలో ప్రభుత్వం నుంచి జరిగిన సంక్షేమ పథకాల మంచిని వివరిస్తూ కూటమి ప్రభుత్వం ప్రజలకు అండగా ఉంటుందని సంక్షేమ కార్యక్రమాల గురించి వివరణ ఇవ్వడం జరిగిందన్నారు. మరియు పార్టీ విధానాలను ప్రజలకు వివరించారు. అలాగే ప్రజల సమస్యలను తెలుసుకుని, వాటి పరిష్కారానికి కృషి చేస్తామని భరోసా కల్పించారు. కార్యక్రమంలో మండల జడ్పిటిసి సభ్యులు ఉమేష్, మండల పార్టీ కార్యదర్శి రాజన్న, మాజీ కన్వీనర్ మైనార్టీ నాయకుడు షౌకత్, మండల ప్రభుత్వ డీలర్ షాపుల అధ్యక్షుడు బసవరాజు గౌడ, దళిత నాయకుడు డీలర్ చిగ నాగప్ప, బూత్ ఇంచార్జ్ డీలర్ శశిధర్, ఫీల్ అసిస్టెంట్ నగేష్, మరియు నరేష్ తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు. తెలుగుదేశం పార్టీ బలోపేతమే లక్ష్యంగా, ప్రజలతో మమేకమై ప్రజా సేవ చేయడానికి తెలుగుదేశం పార్టీ ఎప్పుడు అండగా ఉంటుందన్నారు.





# పెద్ద కాల్వలకు పూడికతీత

- మురుగు నీటి సమస్యకు చెక్.....
- కేశవనగర్‌లో సీపీఐ కొట్టాల....
- అయ్యప్పస్వామి ఆలయ పరిసరాల్లో పారిశుధ్య పనులు

**ధర్మవరం ఆగష్టు 29 అనంత జనశక్తి న్యూస్ :**

ధర్మవరం పురపాలక సంఘం పరిధిలో పారిశుధ్య చర్యలకు అధికారులు శ్రీకారం చుట్టారు. కేశవ నగర్‌లోని సీపీఐ కొట్టాల, అయ్యప్పస్వామి ఆలయం పరిసర ప్రాంతాల్లో ఉన్న పెద్ద కాల్వల్లో పేరుకుపోయిన పూడిక, చెత్తాచెదారాన్ని తొలగించే పనులను మున్సిపల్ సిబ్బంది చేపట్టారు. మున్సిపల్ కమిషనర్ వెంకటరమణయ్య ఆదేశాల మేరకు పారిశుధ్య సిబ్బంది కాల్వల్లో పేరుకుపోయిన వ్యర్థాలను తొలగించి, మురుగు నీరు సాఫీగా ప్రవహించేలా చర్యలు చేపట్టారు. కాల్వల్లో పూడిక పేరుకుపోవడంతో మురుగు నీటి ప్రవాహానికి అంతరాయం ఏర్పడకుండా ముందస్తు చర్యల్లో భాగంగా ఈ పనులు చేపట్టినట్లు అధికారులు తెలిపారు. వర్షాలు కురిసే సమయంలో కాల్వలు పొంగిపొర్లకుండా, మురుగు నీరు రోడ్లపైకి చేరకుండా పూడికతీత పనులు చేపట్టడం ద్వారా పారిశుధ్య సమస్యలను నియంత్రించేందుకు అవకాశం ఉంటుందని అధికారులు పేర్కొన్నారు. ప్రజలకు అసౌకర్యం కలగకుండా మున్సిపల్ పరిధిలో అవసరమైన ప్రాంతాలను గుర్తించి దశలవారీగా పారిశుధ్య పనులు కొనసాగిస్తామని తెలిపారు.

కాల్వలు శుభ్రంగా ఉంటేనే.. మురుగు నీరు సాఫీగా సాగుతుంది.. ప్రజలకు పారిశుధ్య ఇబ్బందులు తగ్గుతాయి అన్న లక్ష్యంతో మున్సిపల్ అధికారులు చర్యలు కొనసాగిస్తున్నారు.

# టిడిపి కుటుంబ సభ్యులకు నా మనవి



- టిడిపి కుటుంబ సభ్యులకు మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి ప్రత్యేక ఆహ్వానం. ....
- ఆగస్టు 30 న పల్లె ఉమా మేడం వర్ధంతి .. మాజీ మంత్రి పల్లె రఘు నాథ రెడ్డి

**పుట్టపర్తి రూరల్ ఆగష్టు 29 అనంత జన శక్తి న్యూస్.**

నియోజకర్గంలోనీటిడిపి కుటుంబ సభ్యులందరికీ మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి ప్రత్యేక ఆహ్వానం మేరకు టీడీపీ మండల కన్వీనర్లు ,ప్రజా ప్రతినిధులు ఇతర ముఖ్య నేతలు,టీడీపీ కార్యకర్తలు ప్రతి ఒక్కరూ తప్పకుండా పల్లె ఉమా మేడం గారి వర్ధంతికి విచ్చేసి ఘన నివాళి అర్పించాలని మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి కోరారు అనంతపురంలోని రాప్తాడు సమీపంలోని పల్లె క్షేత్రంలో పల్లె ఉమా గారి ఘాట్ వద్ద వర్ధంతి వేడుకలు ఆదివారం ఉదయం 10 గంటలకు ఏర్పాటు చేయడం జరిగింది. టిడిపి బిజెపి జనసేన కుటుంబ సభ్యులు మరియు మీడియా ప్రతినిధులు ,వారి కుటుంబ సభ్యులు తప్పకుండా హాజరు కావాలని తెలిపారు

# భవిష్య ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో ఘనంగా తెలుగు భాష దినోత్సవం.



**కుందుర్పి ఆగస్టు 29 అనంత జనశక్తి న్యూస్.**

మండల కేంద్రంలో ఉన్న భవిష్య ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో ఘనంగా తెలుగు భాష దినోత్సవం మరియు జాతీయ క్రీడా దినోత్సవం నిర్వహించారు తెలుగు భాష గొప్పతనం మరియు సంస్కృతి తెలుగు భాష ప్రాధాన్యతను విద్యార్థులకు వివరించారు తెలుగు భాష ప్రత్యేకమైనదని ఈ సందర్భంగా విద్యార్థులకు ఉపాధ్యాయులు వివరించారు తర్వాత విద్యార్థులకు ఆట పోటీలు నిర్వహించి ఆ పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు ఉపాధ్యాయుల బృందం బహుమతులను అందజేశారు ఈ కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది విద్యార్థులు పాల్గొన్నారు



# పర్యాటక మంత్రి కందుల దుర్గేష్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన స్పెషల్ చీఫ్ సెక్రటరీ షంషీర్ సింగ్ రావత్

**- పర్యాటక సాంస్కృతిక శాఖల స్పెషల్ చీఫ్ సెక్రటరీగా బాధ్యతలు స్వీకరించిన అనంతరం మర్యాదపూర్వక భేటీ.. శుభాకాంక్షలు తెలిపిన మంత్రి దుర్గేష్**

**విజయవాడ ఆగస్టు 29 అనంత జనశక్తి న్యూస్**

ఆంధ్రప్రదేశ్ పర్యాటక, సాంస్కృతిక శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీగా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన సీనియర్ ఐఏఎస్ అధికారి షంషీర్ సింగ్ రావత్ విజయవాడలోని క్యాంపు కార్యాలయంలో రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఎస్.ఎస్. రావత్‌కు మంత్రి దుర్గేష్ శుభాకాంక్షలు తెలిపారు.
ఈ సందర్భంగా రాష్ట్రంలో పర్యాటకాభివృద్ధి, సాంస్కృతిక రంగ పునరుద్ధరణపై ఇరువురూ సుదీర్ఘంగా చర్చించారు. పీపీపీ విధానంలో పెట్టుబడులను ఆకర్షించడం, పర్యాటక ఒప్పందాలు వేగవంతం చేయడం, నూతన పర్యాటక పాలసీ మరియు ఎస్ఐపీబీ ఆమోదించిన ప్రాజెక్టుల పురోగతిపై మంత్రి దుర్గేష్ దిశానిర్దేశం చేశారు. దేశ విదేశాల్లో ఏపీ టూరిజం వైభవాన్ని విస్తృతంగా ప్రచారం చేయాలని సూచించారు. ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలకు అనుగుణంగా మంత్రి దుర్గేష్ నేతృత్వంలో పర్యాటక, సాంస్కృతిక రంగాల అభివృద్ధికి కృషి చేస్తానని ఈ సందర్భంగా ఎస్ ఎస్ రావత్ తెలిపారు.

# హై ఓల్టేజ్ తో పేలిన ఫ్రిడ్జ్



**– కాలి బూడిద అయినా ఇంటిలోని సామాగ్రి**

**యల్లనూరు, ఆగస్టు 29, అనంత జనశక్తి న్యూస్**

మండలంలోని కొత్తపల్లి గ్రామానికి చెందిన చంద్రకళ రవిశేఖర్ దంపతుల ఇంటిలో శుక్రవారం రాత్రి 11 గంటల సమయంలో విద్యుత్ హై ఓల్టేజీతో ఇంటిలోని రిఫ్రిజిరేటర్ పేలడంతో ఒక్కసారిగా ఇంటిలో మంటలు వ్యాపించి ఇంటిలోని వస్తువులన్నీ ఖాళీ బుడదయ్యాయి. బాదితులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఇంటి ఆరు బయట నిద్రిస్తున్న గా ఒకసారి గా ఇంటిలో శబ్దం రావడంతో భయాందోళనకు గురై తలుపు తెరిచి చూడగా అప్పటికే ఇంటిలో ఉన్న వస్తువుల కు అగ్గి జువ్వలు పాకడంతో ఇంటిలోని ప్లాస్టిక్ సామాగ్రి, బియ్యము, టీవీ తో పాటు బీరువాకు నిప్పంటుకోవడంతో అందులోని బట్టలు, రూ. 80వేల నగదు కాలిని బూడిద అయిందన్నారు. ఈ హైట్ హై ఓల్టేజీ విషయమై గ్రామానికి చెందిన లైన్ మెన్ కు అనేకమార్లు చెప్పిన పట్టించుకోలేదన్నారు. తనకు జరిగిన నష్టానికి ప్రభుత్వం ఆదుకోవాలని ఆయన విన్నవించారు.

# ఘనంగా తెలుగు భాష దినోత్సవం



**అగళి ఆగష్టు 29,అనంత జనశక్తి న్యూస్:**

స్థానిక ఆదర్శ పాఠశాలలో గిడుగు రామమూర్తి జయంతి సందర్భంగా ఏర్పాటు చేసిన తెలుగు భాషా దినోత్సవ మరియు మేజర్ ధ్యాన్ చంద్ జయంతి సందర్భంగా జాతీయ క్రీడా దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ఉపాధ్యాయులు తెలుగు భాష మరియు క్రీడా దినోత్సవ గొప్పతనం తెలియజేశారు. గిడుగు రామమూర్తి మరియు ధ్యాన్ చంద్ చిత్రపటాలకు నివాళులుఅర్పించారు.ప్రిన్సిపాల్ మరియు తెలుగు ఉపాధ్యాయ బృందం పర్యవేక్షణలో విద్యార్థులకు ఏర్పాటు చేసిన వ్యాస రచన, క్విజ్, వక్తృత్వ పోటీలలో విజేతలైన వారికి బహుమతి ప్రధానం చేశారు.తెలుగు భాష గొప్పతనం తెలియజేసేలా విద్యార్థులు చేసిన నృత్యాలు, పాటలు అలరించాయి.కార్యక్రమంలో విద్యార్థులు,ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

# పాల సేకరణ ధర పెంచిన విజయ డెయిరీ

**విజయవాడ (చిట్టినగర్): అనంత జనశక్తి న్యూస్**



పాడి రైతులకు విజయ డెయిరీ శుభవార్త అందించింది. పాల సేకరణ ధర పెంచుతున్నట్లు ప్రకటించింది. పాడి రైతుల నుంచి సేకరించే పాలకు లీటరుకు రూ.3 చొప్పున పెంచుతున్నట్లు తెలిపింది. ప్రస్తుతం ఉన్న ధర రూ. 85ను రూ.88కి పెంచుతున్నట్లు ఎండీ ఈశ్వరరావు తెలిపారు. సెప్టెంబర్ 1 నుంచి ఈ ధరలు అమల్లోకి రానున్నట్లు ఆయన పేర్కొన్నారు.

# మాతృభాషకు సముచిత పీఠం.. తెలుగు భాషా పరిరక్షణకు కూటమి ప్రభుత్వం ప్రాధాన్యం:మంత్రి కందుల దుర్గేష్






**- సెప్టెంబర్ మొదటి వారంలో 'నంది నాటకోత్సవాల'పై కీలక ప్రకటన:మంత్రి కందుల దుర్గేష్***
**- తెలుగు వాడుక భాష ఉద్యమ పితామహుడు గిడుగు వెంకట రామమూర్తి పంతులు 163వ జయంతి సందర్భంగా 19 మందికి 'తెలుగు భాషా పురస్కారాలు' ప్రదానం**
**- పురస్కార గ్రహీతలకు రూ. 25,000 నగదు, జ్ఞాపిక, ప్రశంసా పత్రం బహూకరణ**
**- విజయవాడలోని అంబేద్కర్ కళావేదికలో ఘనంగా తెలుగు భాషా దినోత్సవ వేడుకలు**

**విజయవాడ ఆగస్టు 29, అనంత జనశక్తి న్యూస్**

సెప్టెంబర్ మొదటి వారంలో నంది నాటకోత్సవాల నిర్వహణపై కీలక ప్రకటన చేస్తామని, ఏడాదిలోనే వీటిని కూటమి ప్రభుత్వం అత్యంత ఘనంగా నిర్వహిస్తుందని సాంస్కృతిక శాఖ మంత్రి కందుల దుర్గేష్ స్పష్టం చేశారు.విజయవాడ గవర్నర్ పేటలోని డా.బి. ఆర్. అంబేద్కర్ స్వరాజ్ మైదానంలో ఉన్న డా. బీ. ఆర్. అంబేద్కర్ కళావేదికలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో తెలుగు వాడుక భాష ఉద్యమ పితామహుడు గిడుగు వేంకట రామమూర్తి పంతులు 163వ జయంతి (తెలుగు భాషా దినోత్సవం) వేడుకలు శనివారం వైభవంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ 19 మంది ప్రముఖులకు 'తెలుగు భాషా పురస్కారాలు 2026' అందజేశారు. పురస్కార గ్రహీతలకు ప్రశంసా పత్రం, జ్ఞాపికతో పాటు రూ. 25,000 నగదు బహూకరించారు. ఈ సందర్భంగా జ్యోతి ప్రజ్వలన అనంతరం ప్రజలు మాట్లాడే భాషకు విద్యా సాహిత్య రంగాల్లో సముచిత స్థానం కల్పించేందుకు కృషి చేసిన గిడుగు రామమూర్తి పంతులు చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళి అర్పించారు.. ఈ సందర్భంగా మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ.. గ్రంథాలకే పరిమితమైన తెలుగును ప్రజాక్షేత్రంలోకి తెచ్చిన మహోన్నతుడు గిడుగు వెంకట రామమూర్తి పంతులు అని కొనియాడారు. కందుకూరి, గురజాడ, గిడుగుల కృషి వల్లే వ్యావహారిక భాష ఉద్యమం రూపుదిద్దుకుందన్నారు. సవర భాషకు లిపిని రూపొందించి, బ్రిటిష్ ప్రభుత్వం తనకు ఇచ్చిన పారితోషికాన్ని సైతం ఆదివాసీల విద్యాభివృద్ధికి వెచ్చించిన త్యాగధనుడు, సంఘసంస్కర్త గిడుగు అని గుర్తుచేశారు. తెలుగు భాషా పురస్కారాల ఎంపికకు సంబంధించిన జి.ఓ ను కూడా తెలుగులోనే జారీ చేయడం కూటమి ప్రభుత్వ చిత్తశుద్ధికి నిదర్శనమన్నారు. సీఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌లు మాతృభాషకు పెద్దపీట వేస్తున్నారని తెలిపారు. ప్రతి జిల్లాలో వ్యావహారిక భాషా సంఘాల ఏర్పాటుకు సాంస్కృతిక శాఖ తరపున పూర్తి సహకారం ఉంటుందని, ఈ దిశగా చర్యలు తీసుకోవాలని అధికార భాషా సంఘం చైర్మన్‌కు సూచించారు. ఇంగ్లీష్, హిందీ నేర్చుకోవడం అవసరమే అయినా, మాతృభాషను మరువకూడదని పిలుపునిచ్చారు. కన్నతల్లి పాలతో పెరిగిన బిడ్డను మాతృభాషతో, పోత పాలతో పెరిగిన బిడ్డను ఆంగ్లంతో పోలుస్తూ ప్రాథమిక విద్య తెలుగులోనే సాగాలని నొక్కిచెప్పారు. ప్రతి ఏటా ఉగాది, కందుకూరి, తెలుగు భాషా పురస్కారాలను క్రమం తప్పకుండా ప్రదానం చేస్తామని వెల్లడించారు.పర్యాటక సాంస్కృతిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి షంషేర్ సింగ్ రావత్ మాట్లాడుతూ.. ఇటాలియన్ ఆఫ్ ది ఈస్ట్'గా గుర్తింపు పొందిన తెలుగు భాషకు అగ్రతాంబూలం ఇవ్వాల్సిన ఆవశ్యకత ఉందని పేర్కొన్నారు. ప్రతీ ఒక్కరూ తెలుగులో రాయడం, మాట్లాడడం, చదవడాన్ని ప్రోత్సహించినప్పుడే గిడుగు రామమూర్తి పంతులు ఆశయాలను నెరవేర్చినట్లవుతుందని అన్నారు ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ... ఆంధ్రప్రదేశ్ ప్రాంతంలో పని చేస్తుండటం వల్ల తనకూ తెలుగు భాషపై గౌరవం మరింత పెరిగిందన్నారు. గిడుగు రామమూర్తి పంతులు సాగించిన వ్యావహారిక భాషా ఉద్యమ ఫలితంగానే నేడు సామాన్య ప్రజలకు కూడా భాష ఎంతో చేరువైందని కొనియాడారు. సాంస్కృతిక సృజనాత్మక సమితి చైర్ పర్సన్ తేజస్వి పొడపాటి మాట్లాడుతూ.. తెలుగు భాషా పరిరక్షణకు, ఉనికికి కృషి చేసిన మహనీయుల చరిత్రను భావితరాలకు అందించాలని కోరారు. గిడుగు జీవితాంతం చేసిన పోరాట ఫలమే నేడు మనం చదువుకుంటున్న సాహిత్యం, కావ్యాలు, పాఠ్యాంశాలని స్పష్టం చేశారు. భాషా వికాసానికి కృషి చేస్తున్న సీఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, మంత్రి కందుల దుర్గేష్‌లకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. నాటక అకాడమీ చైర్మన్ గుమ్మడి గోపాలకృష్ణ మాట్లాడుతూ.. తెలుగు భాషకు పూర్వవైభవం తీసుకురావాల్సిన అవసరం ఉందన్నారు. నాటకరంగం ద్వారానే భాష ప్రజల హృదయాలకు మరింత చేరువైందని, త్వరలోనే నంది నాటకోత్సవాలను అంగరంగ వైభవంగా నిర్వహిస్తామని తెలిపారు. మండలి వెంకటకృష్ణారావు అధికార భాషా సంఘం చైర్మన్ పూల త్రివిక్రమ్ రావు మాట్లాడుతూ.. వాడుక భాషా పరివ్యాప్తికి గిడుగు రామమూర్తి పంతులు తమ జీవితాన్ని ధారపోశారన్నారు.కందుకూరి, గురుజాడ, గిడుగులతో పాటు సీపీ బ్రౌన్, పొట్టి శ్రీరాములు, ఎన్టీఆర్ వంటి మహనీయులు తెలుగుకు అందించిన సేవలు అనన్యమైనవని గుర్తుచేశారు. 'ఐ లవ్ విజయవాడ' వంటి నామఫలకాలు తెలుగులోనే ఉండేలా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరినట్లు వెల్లడించారు. ప్రతి ఇంట్లో తెలుగు వినిపించాలని, సభా సంఘాల ఏర్పాటుకు కార్యాచరణ రూపొందిస్తున్నట్లు చెప్పారు.

**పుస్తకావిష్కరణ & పురస్కార గ్రహీతలు:**
ఈ వేడుకలో గిడుగు వేంకట రామమూర్తి పంతులు మునిమనవడు నాగేశ్వరరావు రచించిన 'కావ్య మల్లికలు' పుస్తకాన్ని మంత్రి కందుల దుర్గేష్ ఆవిష్కరించారు. తెలుగు భాషా పురస్కారాలు అందుకున్న జంధ్యాల కనకదుర్గ, చందలూరి నారాయణరావు, యు.భూదేవి, కె.పుష్ప, ముత్తేవి రవీంద్రనాథ్, బాలాంతపు వెంకట రమణ, అబ్దుల్ హకీమ్ జాని, ఎస్.వి. రాఘవేంద్రరావు, పి.విజయ్ కుమార్, బొగ్గవరపు మాల్యాద్రి, చిలుకూరి శ్రీనివాసరావు, నాగసూరి వేణుగోపాలరావు, జంధ్యాల శరత్ బాబు, కోయి కోటేశ్వరరావు, కే.వి.ఎల్.ఎన్. శర్మ, ఎం.రామకృష్ణ, వీవీఐటీయూ పుస్తక ప్రచురణ సంస్థ, వేమూరి శ్రీనివాస్, కొల్లి రమావతి లు మాట్లాడుతూ..
భాషా వికాసానికి కృషి చేస్తున్న తమను గుర్తించి పురస్కారాలు అందజేసిన మంత్రి కందుల దుర్గేష్‌కు, కూటమి ప్రభుత్వానికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. అంతకుముందు కళావేదికకు విచ్చేసిన మంత్రి కందుల దుర్గేష్ కు వివిధ జానపద నృత్యాలతో ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా కళా వేదిక ప్రాంగణంలో ఏర్పాటుచేసిన తెలుగు తల్లి విగ్రహానికి మంత్రి కందుల దుర్గేష్ పూలమాలవేసి నమస్కరించారు..కార్యక్రమంలో ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ, సాంస్కృతిక సృజనాత్మక సమితి చైర్ పర్సన్ తేజస్వి పొడపాటి, మండలి వెంకటకృష్ణారావు అధికార భాష సంఘం చైర్మన్ పూల త్రివిక్రమ రావు, 20 సూత్రాల అమలు కమిటీ చైర్మన్ లంకా దినకర్, నాటక అకాడమీ చైర్మన్ గుమ్మడి గోపాలకృష్ణ, జానపద అకాడమీ చైర్మన్ వంపూరు గంగులయ్య, రాష్ట్ర సాంఘిక సంక్షేమ బోర్డు చైర్మన్ పోతుల బాలకోటయ్య, గిడుగు వెంకట రామమూర్తి పంతులు ముని మనవడు నాగేశ్వరరావు తెలుగు భాషాభిమానులు తదితరులు పాల్గొన్నారు.

# వంకర టింకర వసీం మాటలు ఎవరు నమ్మరు

**- ఇంకా ఎన్నిరోజులు ఎవరో రాసిచ్చిన స్క్రిప్ట్ చదువుతావ్ వసీం**
**- మాజీ మేయర్ వసీం వ్యాఖ్యలపై టిడిపి నేతలు ఆగ్రహం**
**- త్వరలోనే వసీం అవినీతి అక్రమాలు బయటికి వస్తాయన్న టిడిపి నాయకులు**

**అనంతపురం ఆగస్ట్ 29, అనంత జనశక్తి న్యూస్**




మేయర్ గా ఉన్నప్పుడు అలాగే పదవి దిగిపోయినా సరే ఎవరో రాసిచ్చిన స్క్రిప్ట్ చదువుతూనే ఉంటావా వసీం అంటూ అనంతపురం అర్బన్ టిడిపి నాయకులు ఎద్దేవా చేశారు. మాజీ మేయర్ వసీం చేసిన వ్యాఖ్యల మీద వారు తీవ్ర స్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. అర్బన్ టీడీపీ కార్యాలయంలో కార్పొరేషన్ డైరెక్టర్లు పోతుల లక్ష్మీనరసింహులు, పిఎల్ఎన్ మూర్తి, కడియాల కొండన్న, పరమేశ్వర్, టిడిపి నగర ప్రధాన కార్యదర్శి ఫిరోజ్ అహ్మద్, తెలుగుయువత రాష్ట్ర అధికార ప్రతినిధి సాకే లక్ష్మీ నరసింహాలు మీడియాతో మాట్లాడారు. ఎమ్మెల్యే దగ్గుపాటి ఒకేరోజు 6 కోట్ల 84 లక్షల రూపాయలతో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేయడంతో వైసిపి నాయకులకు కళ్లు కుట్టాయన్నారు. అందుకే మాజీ మేయర్ వసీం ఎవరో రాసిచ్చిన స్క్రిప్ట్ తీసుకొచ్చి చదివారని విమర్శలు చేశారు. అసలు అధికారంలో ఉండగా ఏ రోజైనా నగరాభివృద్ధి గురించి పట్టించుకున్నారా అని నిలదీశారు. 23 వేల మెజారిటీతో గెలిచి గతంలో ఎప్పుడూ లేనివిధంగా అభివృద్ధి కార్యక్రమాలు చేస్తున్న ఎమ్మెల్యే దగ్గుపాటి పై నిత్యం ఏదో ఒక బురద జల్లుతూనే ఉన్నారని మండిపడ్డారు. చేతనైతే అభివృద్ధిలో సహకారం అందించాలి కానీ ఇలాంటి విమర్శలు ఏంటని ప్రశ్నించారు. మీ హయాంలో తల్లికి వందనం, పింఛన్లు ఇవ్వమంటే పేదవారికి నాలుగు చక్రాల వాహనం ఉందని, నాలుగు విద్యుత్ మీటర్లు ఉన్నాయంటూ సంక్షేమ పథకాలు ఎగ్గొట్టిన చరిత్ర మీద అన్నారు. ఈరోజు అర్హులైన అందరికీ సంక్షేమ పథకాలు అందించడమే కాకుండా అభివృద్ధి కార్యక్రమాలు చేసి ధైర్యంగా ఇంటింటికి కూటమి ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. అసలు మీ హయాంలో ఉద్యోగాలు ఇప్పిస్తానంటూ డబ్బులు వసూళ్లు చేసింది నువ్వు కాదా అని నిలదీశారు. త్వరలోనే అవన్నీ బయటికి వస్తాయన్నారు. అలాగే డంపింగ్ యార్డ్ లో 26 కోట్ల రూపాయల అక్రమాలకు పాల్పడినట్లు విజిలెన్స్ నివేదిక కూడా వచ్చిందని అందులో మొదటి ముద్దాయి నువ్వేనన్నారు. ఇలాగే అభివృద్ధికి ఆటంకాలు కలిగిస్తూ నిత్యం ఏదో ఒక విమర్శలు చేస్తుంటే ప్రజలే మీకు బుద్ధి చెబుతారని వారు హెచ్చరించారు.

# దోసకాయలపల్లి ఫుడ్ పాయిజన్ ఘటనపై స్పందించిన మంత్రి కందుల దుర్గేష్

**- జిల్లా కలెక్టర్‌తో ఫోన్ లో మాట్లాడి ఘటనపై ఆరా**
**- బాధిత విద్యార్థుల ఆరోగ్యం ప్రస్తుతం స్థిరంగా ఉందని వెల్లడి**
**- హాస్టళ్లలో పారిశుద్ధ్యం, మంచినీటి ట్యాంకుల పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచన**

**రాజమహేంద్రవరం ఆగస్టు 29, అనంత జనశక్తి న్యూస్**



తూర్పుగోదావరి జిల్లా కోరుకొండ మండలం దోసకాయలపల్లి పరిధిలోని జిఎస్ హెచ్ జూనియర్ కళాశాల హాస్టల్‌లో జరిగిన ఫుడ్ పాయిజన్ ఘటనపై రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ స్పందించారు. సుమారు 60 మంది విద్యార్థులు అస్వస్థతకు గురికావడంపై ఆయన ఆవేదన చెందారు.ఘటన సమాచారం తెలిసిన వెంటనే మంత్రి కందుల దుర్గేష్ తూర్పుగోదావరి జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి తో ఫోన్‌లో మాట్లాడారు. ఘటనకు దారితీసిన పరిస్థితులపై, చిన్నారుల ఆరోగ్య పరిస్థితిపై నిమిష నిమిషం ఆరా తీస్తూ, వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. బాధితులకు తక్షణమే మెరుగైన వైద్యం అందించడంతో పాటు, హాస్టల్ ఆవరణలో పారిశుద్ధ్య, వ్యాధి నియంత్రణ చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు. బాధిత విద్యార్థులకు వెంటనే వైద్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన చికిత్స అందించామని, ప్రస్తుతం అందరి ఆరోగ్య పరిస్థితి స్థిరంగా ఉందని కలెక్టర్ మంత్రికి వివరించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థుల ఆరోగ్య పరిస్థితిని వైద్య అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని మంత్రి ఆదేశించారు.నియంత్రణ చర్యల్లో భాగంగా హాస్టల్‌లోని మంచినీటి ట్యాంకులు, సంపులను ఎప్పటికప్పుడు బ్లీచింగ్ చేసి పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా జిల్లాలోని అన్ని ప్రైవేట్, ప్రభుత్వ హాస్టళ్లలో ఆహార నాణ్యత, పారిశుద్ధ్యంపై అధికారులు ప్రత్యేక నిఘా ఉంచాలని మంత్రి దుర్గేష్ సూచించారు

# జీటీ నోటీసులపై రైతుల ఈ-కేవైసీ ప్రక్రియను పరిశీలన

**గాండ్లపెంట, ఆగస్ట్,29, అనంత జనశక్తి న్యూస్,**

మండలంలోని గొడ్డువెలగల గ్రామంలో జీటీ నోటీసులకు సంబంధించిన ఈకేవైసీ ప్రక్రియను శనివారం తహసీల్దార్ నరసింహులు పరిశీలించారు. గ్రామంలో జరుగుతున్న ఈకేవైసీ నమోదును పరిశీలించి రైతుల నుంచి వివరాలను సేకరించే విధానాన్ని తెలుసుకున్నారు. ఈ సందర్భంగా తహసీల్దార్ నరసింహులు మాట్లాడుతూ జీటీ నోటీసులకు సంబంధించిన రైతుల వివరాలను క్షుణ్ణంగా పరిశీలించి, అర్హులైన ప్రతి రైతు ఈకేవైసీ ప్రక్రియను పూర్తిచేసుకునేలా చర్యలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు
రైతుల ఆధార్, భూమికి సంబంధించిన వివరాలు తదితరాలను నిబంధనల ప్రకారం పరిశీలించి నమోదు చేయాలని తెలిపారు. ఈకేవైసీ సమయంలో రైతుల వివరాల్లో ఏవైనా తప్పులు ఉంటే వాటిని గుర్తించి సరిచేసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. రైతులకు ఈకేవైసీ ప్రక్రియపై అవగాహన కల్పించి, అవసరమైన సహకారం అందించాలని అధికారులను ఆదేశించారు ప్రక్రియలో పారదర్శకత పాటిస్తూ ఎలాంటి ఇబ్బందులు లేకుండా రైతుల వివరాలను నమోదు చేయాలని తెలిపారు
గ్రామంలోని రైతులు ఈకేవైసీ ప్రక్రియను సద్వినియోగం చేసుకుని తమ వివరాలను సక్రమంగా నమోదు చేసుకోవాలని తహసీల్దార్ సూచించారు. సంబంధిత అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేసి ప్రక్రియను పూర్తి చేయాలని తెలిపారు. కార్యక్రమంలో వీఎస్, వీఆర్వో, వీఆర్ఏలతో పాటు గ్రామానికి చెందిన పలువురు రైతులు పాల్గొన్నారు.



# ఎన్నికల సమరానికి సై!

- కూటమి నేతల గుండెల్లో గుబులు..
  ప్రతిపక్షానికి అందివచ్చిన 'అస్త్రం'!
- చేనేతల డిమాండ్‌తో వేడెక్కిన రాజకీయం..
  టికెట్ల లెక్కల్లో తలమునకలవుతున్న కూటమి!
- పింఛన్లు, పౌర సమస్యలపై అసంతృప్తి.. ఎన్నికల
  వేళ ఎలాంటి మలుపు?
- కూటమిలో కౌన్సిలర్ టికెట్ దక్కని అభ్యర్థులు
  స్వతంత్ర అభ్యర్థులుగా బరిలోకి...
– అవకాశం వైసీపీకి కలిసివచ్చేనా?

ధర్మవరం ఆగష్టు 29,
అనంత జనశక్తి న్యూస్ :
ధర్మవరం మున్సిపల్ ఎన్నికల నోటిఫికేషన్ వెలువడకముందే ధర్మవరం పట్టణంలో రాజకీయ వేడి రాజుకుంటోంది. ముఖ్యంగా మున్సిపల్ చైర్మన్ పీఠం ఎవరికి దక్కాలన్న అంశం చుట్టూ కొత్త సమీకరణాలు తెరపైకి వస్తుండగా, చేనేత వర్గానికి చైర్మన్ పదవి ఇవ్వాలన్న డిమాండ్ బలపడుతున్నట్లు రాజకీయ వర్గాల్లో చర్చ సాగుతోంది. ధర్మవరం ఆర్థిక, సామాజిక రంగాల్లో చేనేతకు ఉన్న ప్రాధాన్యాన్ని ప్రస్తావిస్తూ ఆ వర్గానికి రాజకీయ ప్రాతినిధ్యం కల్పించాలన్న వాదన ముందుకు వస్తుండటంతో కూటమి నాయకత్వం ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందన్నది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది.











## చేనేతల 'చైర్మన్' డిమాండ్..
## కూటమికి కొత్త తలనొప్పి!

ధర్మవరం అంటే చేనేత.. చేనేత అంటే ధర్మవరం అన్న స్థాయిలో పట్టణానికి ఉన్న ప్రత్యేక గుర్తింపు నేపథ్యంలో చేనేత వర్గానికి మున్సిపల్ చైర్మన్ పదవి ఇవ్వాలన్న డిమాండ్ రాజకీయంగా ప్రాధాన్యం సంతరించుకుంటోంది. ఈ డిమాండ్‌ను కూటమి నాయకత్వం సానుకూలంగా పరిగణనలోకి తీసుకుంటే ఆ వర్గాన్ని మరింత దగ్గర చేసుకునే అవకాశం ఉండగా, నిర్ణయం మరో విధంగా ఉంటే చేనేత వర్గంలో అసంతృప్తి తలెత్తే అవకాశం ఉందన్న చర్చ సాగుతోంది.చైర్మన్ పీఠం కోసం కూటమి ఎలాంటి సమీకరణాన్ని ఎంచుకుంటుందన్నదే ఇప్పుడు అసలు ప్రశ్నగా మారింది.

## టికెట్ల కోసం పోటీ..
## కూటమిలో అసలు 'టెన్షన్' ఇదే!

చైర్మన్ పదవితో పాటు కౌన్సిలర్ స్థానాల కోసం ఆశావహులు ఇప్పటికే తమ ప్రయత్నాలను ముమ్మరం చేస్తున్నారన్న చర్చ నేపథ్యంలో టికెట్ల కేటాయింపు కూటమికి మరో కీలక పరీక్షగా మారనుంది. ఒకరికి అవకాశం కల్పించే క్రమంలో మరికొందరు అసంతృప్తికి గురికాకుండా చూడటం, టికెట్ దక్కని ఆశావహులను సమన్వయం చేయడం, ఎన్నికల సమయంలో పార్టీ నిర్ణయానికి అందరూ కట్టుబడి పనిచేసేలా చూడటం కూటమి నాయకత్వానికి సవాల్‌గా మారనుంది.
టికెట్ ఒకరికి దక్కినా.. ఆ అసంతృప్తి ప్రత్యర్థికి లాభంగా మారకూడదన్నదే కూటమి ముందున్న అసలు చిక్కు.

**పింఛన్లు.. సంక్షేమం.. పౌర సమస్యలు!**
మున్సిపల్ ఎన్నికల్లో కేవలం పార్టీ రాజకీయాలే కాకుండా పట్టణ సమస్యలు కూడా కీలకంగా మారే అవకాశం ఉంది. రహదారులు, తాగునీరు, డ్రైనేజీ, పారిశుధ్యం, వీధిలైట్లు వంటి మౌలిక వసతులపై ప్రజల అభిప్రాయం ఎన్నికల సమయంలో ప్రధాన చర్చగా మారితే.. స్థానిక నాయకుల పనితీరు కూడా పరీక్షకు గురయ్యే అవకాశం ఉంది. అదే సమయంలో పింఛన్లు, ఇతర సంక్షేమ పథకాల అమలుపై ప్రజల్లో ఉన్న సంతృప్తి లేదా అసంతృప్తి ఎన్నికల సమయంలో రాజకీయ అంశంగా మారుతుందా అన్నది ఆసక్తికరంగా మారింది. సంక్షేమ పథకాల లబ్ధి ఒకవైపు ఉంటే.. స్థానిక సమస్యలపై అసంతృప్తి మరోవైపు ఉంటే ఓటరు తుది నిర్ణయం ఏ అంశానికి ప్రాధాన్యం ఇస్తాడన్నది ఇప్పుడే చెప్పలేని పరిస్థితి.

**కూటమిలో సమన్వయం..**
**గెలుపు లెక్కల్లో కీలకం!**
టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి స్థానిక స్థాయిలోనూ సమన్వయంతో ముందుకు సాగడం ధర్మవరం ఎన్నికల్లో కీలకంగా మారనుంది. చైర్మన్ అభ్యర్థి ఎంపిక నుంచి వార్డు స్థాయి అభ్యర్థుల ఖరారు వరకు పార్టీల మధ్య ఏకాభిప్రాయం సాధించడంతో పాటు, టికెట్లు ఆశించి భంగపడిన నేతలను బుజ్జగించడం, క్షేత్రస్థాయిలో కార్యకర్తలను ఒకే దిశలో నడిపించడం వంటి అంశాలపై కూటమి నాయకత్వం దృష్టి పెట్టాల్సిన పరిస్థితి కనిపిస్తోంది.ఎక్కడైనా సమన్వయం లోపించి అంతర్గత అసంతృప్తి బహిర్గతమైతే.. అదే ప్రత్యర్థి పార్టీకి ప్రచారాస్త్రంగా మారే అవకాశం ఉంది.

## అవకాశం కోసం ఎదురుచూస్తున్న వైసీపీ!

కూటమిలో అభ్యర్థుల ఎంపికపై అసంతృప్తి, చేనేత వర్గం డిమాండ్, స్థానిక సమస్యలు, నాయకుల మధ్య సమన్వయం వంటి అంశాలను వైసీపీ తనకు అనుకూలంగా మలచుకునే ప్రయత్నం చేసే అవకాశం ఉందన్న చర్చ సాగుతోంది. బలమైన అభ్యర్థులను రంగంలోకి దింపడంతో పాటు కూటమిలోని అసంతృప్త వర్గాలను ఆకర్షించే ప్రయత్నం జరిగితే మున్సిపల్ ఎన్నికల పోరు మరింత రసవత్తరంగా మారే అవకాశం ఉంది. అయితే వైసీపీకి కూడా స్థానికంగా బలమైన అభ్యర్థుల ఎంపిక, పార్టీ శ్రేణుల సమన్వయం, ఓటర్లను తమవైపు తిప్పుకోవడం వంటి సవాళ్లు తప్పవు.

## చేనేతలను కాదంటే రాజకీయంగా 'రిస్క్'నా?

చేనేత వర్గానికి చైర్మన్ పదవి ఇవ్వాలన్న డిమాండ్ ఎన్నికల వేళ బలమైన రాజకీయ అంశంగా మారితే కూటమి దానిని ఎలా ఎదుర్కొంటుందన్నది కీలకంగా మారనుంది.



ఒక వర్గాన్ని సంతృప్తిపరిచే నిర్ణయం తీసుకోవడం ఎంత ముఖ్యమో.. మిగిలిన సామాజిక వర్గాల సమీకరణాలను దెబ్బతీయకుండా సమతూకం పాటించడం కూడా అంతే ముఖ్యమని రాజకీయ పరిశీలకులు భావిస్తున్నారు.

## చివరికి 'కుర్చీ' ఎవరికి?

ధర్మవరం మున్సిపల్ చైర్మన్ పీఠం చుట్టూ ఇప్పటికే రాజకీయ వేడి పెరుగుతోంది. చేనేతల డిమాండ్, ఆశావహుల పోటీ, టికెట్ల కసరత్తు, కూటమి పార్టీల మధ్య సమన్వయం, పింఛన్లు–సంక్షేమ పథకాలపై ప్రజల స్పందన, పట్టణ సమస్యలు, వైసీపీ వ్యూహం.. ఇవన్నీ కలిసే ఎన్నికల రాజకీయాన్ని ప్రభావితం చేసే అవకాశముంది. కూటమి సరైన అభ్యర్థిని ఎంపిక చేసి అన్ని వర్గాలను కలుపుకుపోతుందా? చేనేతల డిమాండ్‌కు రాజకీయంగా ప్రాధాన్యం ఇస్తుందా? అంతర్గత అసంతృప్తులను సమర్థంగా చక్కదిద్దగలదా? ప్రజా సమస్యలపై ప్రతిపక్షం చేసే విమర్శలను ఎలా ఎదుర్కొంటుంది? ఎన్నికల నోటిఫికేషన్ నుంచి అభ్యర్థుల ఖరారు వరకు చోటుచేసుకునే పరిణామాలే ఈ ప్రశ్నలకు సమాధానం చెప్పనున్నాయి. రాజకీయాల్లో ప్రత్యర్థి బలమే కాదు.. మన బలహీనత కూడా ఫలితాలను మార్చగలదు. ధర్మవరం మున్సిపల్ పోరులో కూటమి ఆ బలహీనతలకు తావివ్వకుండా సమన్వయంతో ముందుకు సాగుతుందా.. లేక చిన్నచిన్న అసంతృప్తులే పెద్ద రాజకీయ సమస్యగా మారతాయా అన్నదే ఇప్పుడు అసలు ఉత్కంఠ.

## కౌన్సిలర్ టికెట్లు దక్కని ఆశావహుల పోటీతో
## ఓట్ల చీలికకు అవకాశం.. వైసీపీకి కలిసొచ్చేనా?

మున్సిపల్ ఎన్నికల వేళ కూటమిలో టికెట్ల వ్యవహారం కొత్త రాజకీయ సమీకరణాలకు దారితీస్తోంది. కౌన్సిలర్ టికెట్ ఆశించిన పలువురు అభ్యర్థులకు అవకాశం దక్కకపోవడంతో అసంతృప్తి వ్యక్తమవుతున్నట్లు తెలుస్తోంది. పార్టీ నిర్ణయాన్ని అంగీకరించకుండా కొందరు స్వతంత్ర అభ్యర్థులుగా ఎన్నికల బరిలోకి దిగేందుకు సిద్ధమవుతున్నారన్న ప్రచారం స్థానిక రాజకీయ వర్గాల్లో జోరుగా సాగుతోంది. టికెట్ కోసం నెలల తరబడి క్షేత్రస్థాయిలో పనిచేసిన ఆశావహులకు చివరి నిమిషంలో అవకాశం దక్కకపోవడం.. ఇప్పుడు కూటమి అభ్యర్థులకు కొత్త సవాల్‌గా మారే అవకాశం కనిపిస్తోంది. స్వతంత్రంగా బరిలో నిలిచే అభ్యర్థులకు స్థానికంగా ఉన్న వ్యక్తిగత పరిచయాలు, అనుచరగణం, గతంలో చేసిన రాజకీయ కార్యకలాపాలు కలిసొస్తే.. వారి పోటీ నామమాత్రంగా కాకుండా ప్రధాన అభ్యర్థుల విజయావకాశాలను ప్రభావితం చేసే స్థాయికి చేరుకోవచ్చన్న చర్చ జరుగుతోంది.టికెట్ దక్కనివారి అసంతృప్తి.. ప్రత్యర్థులకు అవకాశంగా మారుతుందా? అన్నదే ఇప్పుడు ప్రధాన చర్చగా మారింది. ఒకవైపు కూటమి అభ్యర్థులు అధికారిక గుర్తుతో ప్రచారం చేసుకుంటుండగా.. మరోవైపు అదే కూటమికి చెందిన అసంతృప్తులు స్వతంత్రులుగా పోటీ చేస్తే ఓట్లు చీలే పరిస్థితి ఏర్పడే అవకాశం ఉంది. ముఖ్యంగా గెలుపు, ఓటముల మధ్య స్వల్ప తేడా ఉండే వార్డుల్లో ఈ ఓట్ల చీలిక కీలకంగా మారే అవకాశం లేకపోలేదు.ఇదే సమయంలో కూటమిలో ఏర్పడుతున్న ఈ అంతర్గత పోటీ వైసీపీకి అనుకోని రాజకీయ అవకాశాన్ని కల్పిస్తుందా? అన్న చర్చ కూడా మొదలైంది. కూటమి ఓట్లు స్వతంత్ర అభ్యర్థుల వైపు మళ్లితే.. దాని ప్రత్యక్ష ప్రయోజనం వైసీపీ అభ్యర్థులకు దక్కే అవకాశం ఉందని రాజకీయ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. అయితే స్వతంత్రుల బలం ఎంతమేరకు ఉందో, వారు ఎంతవరకు ఓట్లను ప్రభావితం చేయగలరో ఎన్నికల ఫలితాలే తేల్చాల్సి ఉంటుంది.

## కూటమి టికెట్ కోసం పోటీ..

టికెట్ రాక తిరుగుబాటు..
తిరుగుబాటు ఓట్ల చీలికకు దారితీస్తే గెలుపు ఎవరిదో? అన్న ఆసక్తి ఇప్పుడు నెలకొంది. అసంతృప్తులను బుజ్జగించి అధికారిక అభ్యర్థుల వెంటే నడిపించడంలో కూటమి నాయకత్వం ఎంతవరకు సఫలమవుతుందన్నది కీలకంగా మారింది. చివరకు రెబల్ అభ్యర్థులు బరిలో నిలుస్తారా? లేక చివరి నిమిషంలో రాజీ కుదుర్చుకుంటారా? అన్నదానిపైనే ఆయా వార్డుల్లో ఎన్నికల గణితం మారే అవకాశముంది.

## ప్రసన్నాయపల్లి క్రాస్‌కు బదులుగా అయ్యవారిపల్లి–నాయక్‌నగర్ వద్ద అండర్‌పాస్ ఏర్పాటు చేయాలి

- ప్రమాదాల నివారణకు తక్షణ చర్యలు తీసుకోవాలని గ్రామాల ప్రజల డిమాండ్

రాప్తాడు, ఆగస్టు 29, అనంత జనశక్తి న్యూస్:

అయ్యవారిపల్లి-నాయక్‌నగర్ క్రాస్ వద్ద వాహనాల అండర్‌పాస్ (వీయూపీ) ఏర్పాటు చేయాలని ఆయా గ్రామాల ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. ఈ ప్రాంతంలో గతంలో పలు రోడ్డు ప్రమాదాలు చోటుచేసుకున్న నేపథ్యంలో ప్రజల ప్రాణ భద్రత దృష్ట్యా అండర్‌పాస్ ఏర్పాటు అత్యవసరమని వారు పేర్కొంటున్నారు.అయ్యవారిపల్లి, బుక్కచెర్ల, జి.కొత్తపల్లి, గాండ్లపర్తి, వరిమడుగు, పాలచెర్ల, బొగినేపల్లి తదితర గ్రామాల ప్రజలు వివిధ అవసరాల కోసం ఈ మార్గం మీదుగా నిత్యం రాకపోకలు సాగిస్తున్నారు. ముఖ్యంగా కలెక్టరేట్, రైల్వే స్టేషన్, ప్రభుత్వ ఆసుపత్రి తదితర ముఖ్య ప్రాంతాలకుi వెళ్లేందుకు ఈ మార్గం కీలకంగా ఉందని తెలిపారు.ప్రస్తుతం అయ్యవారిపల్లి-నాయక్‌నగర్ క్రాస్ వద్ద రహదారి దాటేందుకు పాదచారులు, ద్విచక్ర వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేశారు. రహదారిపై వాహనాల రద్దీ అధికంగా ఉండటంతో ఎప్పుడు ప్రమాదం జరుగుతుందోనన్న భయం నెలకొంటోందన్నారు.ప్రసన్నాయపల్లి క్రాస్ వద్ద వాహనాల అండర్‌పాస్ ఏర్పాటు చేయాలనే ప్రతిపాదనకు బదులుగా అయ్యవారిపల్లి-నాయక్‌నగర్ క్రాస్ వద్ద వీయూపీ ఏర్పాటు చేస్తే అనేక గ్రామాల ప్రజలకు ప్రయోజనం కలుగుతుందని వారు పేర్కొన్నారు. ఇక్కడ అండర్‌పాస్ నిర్మిస్తే రహదారి దాటే సమయంలో ప్రమాదాలను తగ్గించడంతో పాటు ప్రజలకు సురక్షితమైన రాకపోకల సౌకర్యం అందుబాటులోకి వస్తుందని తెలిపారు.ప్రజల ప్రాణ భద్రత, ప్రయాణ సౌకర్యాన్ని దృష్టిలో ఉంచుకుని జాతీయ రహదారుల అధికారులు, జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీ ప్రత్యేకంగా స్పందించి అయ్యవారిపల్లి-నాయక్‌నగర్ క్రాస్ వద్ద వీయూపీ ఏర్పాటుకు తక్షణ చర్యలు తీసుకోవాలని ఆయా గ్రామాల ప్రజలు కోరారు.



## ఘనంగా మాతృభాషా దినోత్సవం

అమడగూరు ఆగస్టు 29( అనంత జనశక్తి న్యూస్)

అమడగూరు మండల కేంద్రంలోని,స్థానిక జిల్లా పరిషత్ పాఠశాలలో ఆగస్టు 29వ తేదీ శనివారం మాతృభాష దినోత్సవ సందర్భంగా,ఆచారి రామమూర్తి జయంతి సందర్భంగా పాఠశాల ఉపాధ్యాయులు మరియు విద్యార్థిని విద్యార్థులు పాఠశాల నుండి అమడగూరు స్థానిక బస్టాండ్ వరకు ర్యాలీ నిర్వహించి మాతృభాష దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు రమణారెడ్డి మాట్లాడుతూ ఏ దేశం పోయిన ఏ రాష్ట్రానికి పోయిన మాతృ భాష అనేది ప్రధానమని బిడ్డలకు కన్న తల్లిదండ్రులు ఎంత ముఖ్యమో మనకు మాతృభాష కూడా అంతే ముఖ్యమని ఆచారి గిడుగు రామమూర్తి జయంతి ని పురస్కరించుకొని ఈ మాతృ భాష దినోత్సవాన్ని ప్రతి సంవత్సరం ఆగస్టు 29వ తేదీ జరుపుకోవడం మనకందరికీ శుభపరిణామని ప్రధానోపాధ్యాయులు తెలిపారు ఈ కార్యక్రమంలో తోటి ఉపాధ్యాయుల సిబ్బంది విద్యార్థిని విద్యార్థులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు



# బాధితులను ఆదుకోండి

- అత్యవసర సేవలు అందించండి
- మోదీకి మల్లికార్జున ఖర్గే లేఖ

న్యూఢిల్లీ, ఆగస్ట్ 29, అనంతజనశక్తి న్యూస్

నేపాల్‌లో సంభవించిన విధ్వంసకర వరదలపై కాంగ్రెస్ అధ్యక్షుడు, రాజ్యసభలో ప్రతిపక్ష నేత మల్లికార్జున ఖర్గే తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. ఈ మేరకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షాకు ఆయన లేఖ రాశారు. నేపాల్‌లో భారీ వరదల కారణంగా పెద్ద ఎత్తున ప్రాణ, ఆస్తి నష్టం సంభవించిందని ఖర్గే పేర్కొన్నారు. వరదల కారణంగా 500 మందికి పైగా ప్రాణాలు కోల్పోగా, దాదాపు



1,000 మందికి పైగా గల్లంతైనట్లు ఖర్గే తన లేఖలో తెలిపారు. వేలాది మంది ప్రజలు ఆహారం, మందులు, నివాసం, ఇతర అత్యవసర సదుపాయాల కోసం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.
ఈ విపత్కర పరిస్థితుల్లో భారత ప్రభుత్వం నేపాల్ ప్రభుత్వంతో సమన్వయం చేసుకుని బాధితులకు అవసరమైన మానవతా, సహాయక చర్యలను అందించాలని ఖర్గే కోరారు. వరద ప్రభావిత ప్రాంతాల్లో సహాయక చర్యలను వేగవంతం చేసి, బాధితులకు అవసరమైన ఆహారం, మందులు, నివాసం వంటి అత్యవసర సదుపాయాలు అందేలా చూడాలని విజ్ఞప్తి చేశారు. అదేవిధంగా వరదల కారణంగా నేపాల్‌లోని వివిధ ప్రాంతాల్లో భారతీయులు, భారతీయ మూలాలున్న వ్యక్తులు కూడా చిక్కుకుపోయారని ఖర్గే తెలిపారు. వారిని గుర్తించి సురక్షితంగా భారత్‌కు తరలించేందుకు రెస్క్యూ, తరలింపు చర్యలను ముమ్మరం చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. నేపాల్‌లో నెలకొన్న విపత్కర పరిస్థితుల్లో భారత ప్రభుత్వం వేగంగా స్పందించి సహాయక చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉందని ఖర్గే తన లేఖ ద్వారా స్పష్టం చేశారు. బాధిత ప్రజలకు మానవతా దృక్పథంతో అవసరమైన అన్ని రకాల సహాయాన్ని అందించాలని కేంద్రాన్ని కోరారు.

# ‘బెయిల్’ వస్తోంది




శివరాజ్‌కుమార్, సంజన ఆనంద్, దీక్షిత్ శెట్టి ప్రధాన పాత్రల్లో రూపొందుతున్న యాక్షన్ థ్రిల్లర్ చిత్రం ‘బెయిల్’. పవన్ వడయార్ దర్శకత్వం వహిస్తున్నారు. కేవీఎన్ ప్రొడక్షన్ బ్యానర్‌పై వెంకట్ కే నారాయణ నిర్మిస్తున్నారు. సంగీత, సాయికుమార్, జయరామ్, గోపాల్ కృష్ణ దేశ్‌పాండే కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఈ సినిమా అక్టోబరు 2న థియేటర్లలో విడుదల కానుంది. ఈ నేపథ్యంలో ఈ చిత్ర టీజర్‌ను సామాజిక మాధ్యమాల వేదికగా పంచుకుంది చిత్రబృందం. ఈ మేరకు “న్యాయం జరుగుతుంది” అనే క్యాప్షన్‌ను జోడించింది. “బాబీ.. పులికి వేటాడటానికి అదృష్టం అవసరం లేదు. ఎందుకంటే వేటాడటం దాని అభిరుచి కాదు. అదే దాని వృత్తి. మనుషులు కాదు వాళ్లు రాక్షసులు” లాంటి సంభాషణలతో ఆసక్తిగా సాగుతోందీ టీజర్. ఇందులో శివరాజ్‌కుమార్ పోలీసు అధికారి పాత్రలో కనిపించిన తీరు ప్రేక్షకుల్ని ఆకట్టుకుంటుంది. న్యాయపోరాటం, ప్రతీకారం, శక్తిమంతమైన అండర్‌వరల్డ్ ఘర్షణల చుట్టూ ఈ కథ తిరుగుతుందని టీజర్ స్పష్టం చేస్తుంది.

# నువ్వు లేకుండా బతకలేను



“కన్నీళ్లతో నీ వైపు కనీసం చూడలేకపోయాను. అయ్యో నువ్వు ఒంటరిగా వెళ్లిపోయావు. నా గుండె ఆగిపోతుంది” అంటూ ఓ తల్లి తన కూతుర్ని కలవాలనే ఆశతో పరితపిస్తోంది. తాప్సి ప్రధాన పాత్రలో నటిస్తున్న చిత్రమే ‘గాంధారి’. దేవాశిష్ మఖిజా దర్శకత్వం వహిస్తున్నారు. సెప్టెంబరు 3న నెట్‌ఫ్లిక్స్ వేదికగా ప్రసారం కానుంది. ఈ నేపథ్యంలో సామాజిక మాధ్యమాల వేదికగా ‘దిల్ జానేయా’ అనే పాటను విడుదల చేసింది చిత్రబృందం. “నువ్వు లేకుండా నేను బతకలేను. నీవల్లే నా హృదయం కుదుటపడింది. ఇప్పుడు నీకోసమే బాధతో కుంగిపోతుంది. నువ్వు లేకుండా ఉండటం నావల్ల కాదు, గుండె పగిలిపోతుంది” అంటూ సాగుతున్న గీతం తల్లీకూతుళ్ల మధ్య ఉన్న బంధాన్ని తెలియజేస్తుంది. కౌసర్ మునీర్ సాహిత్యమందించగా దీపాలి సహాయ్, యశ్ కపూర్ ఆలపించారు. ఈ సినిమాలో అంధురాలైన తల్లి పాత్రలో కనిపించనుంది తాప్సి. ఇష్వాక్ సింగ్, ఛాయా కదమ్ తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు.

# ‘ప్రళయ్’లో చిక్కుకుపోయా

గతేడాది ‘లోక’ చిత్రంతో బాక్సాఫీస్ వద్ద మంచి వసూళ్లను సాధించి సూపర్ ఉమెన్ అనిపించుకుంది మలయాళీ భామ కల్యాణి ప్రియదర్శన్. ఈ విజయ ఉత్సాహంలోనే ఆమె ‘ప్రళయ్’ అనే తన తొలి హిందీ సినిమాతో మరోసారి తెరపై మ్యాజిక్ చేయడానికి సన్నద్ధమవుతోంది. బాలీవుడ్ హీరో రణ్‌వీర్ సింగ్ ప్రధాన పాత్రలో నటిస్తున్న చిత్రమిది. జై మెహతా దర్శకత్వం వహిస్తున్నారు. ఇటీవలే ఈ చిత్ర షూటింగ్ ప్రారంభమైనట్లు వార్తలు వచ్చిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలోనే ఈ చిత్రీకరణలో తను కూడా పాల్గొన్నట్లు తెలుపుతూ.. సామాజిక మాధ్యమాల వేదికగా ఓ పోస్ట్ పెట్టింది కల్యాణి. “ఈ ఓనంకి ముంబయిలోని ‘ప్రళయ్’లో పూర్తిగా చిక్కుకుపోయాను. అందుకే కుటుంబంతో వేడుకలు లేవు. పండగ విశేషాలు లేవు. వాటికి బదులుగా గత రెండు నెలల నుంచి కొత్త కొత్త విషయాలను తెలుసుకుంటున్నాన”ని అంటూ ఆ పోస్ట్‌లో పేర్కొంది. జాంబీ థ్రిల్లర్‌గా దీన్ని తీర్చిదిద్దుతున్నారు.



# మునుపెన్నడూ చూడని ఫాంటసీ థ్రిల్లర్



‘ఐయామ్ గేమ్’ సినిమాతో ప్రేక్షకుల్ని పలకరించనున్నారు దుల్కర్ సల్మాన్. ఆయన కథానాయకుడిగా నటించిన ఈ చిత్రాన్ని నహాస్ హిదయత్ తెరకెక్కించారు. వే ఫేరర్ ఫిల్మ్స్ సంస్థ నిర్మించింది. కయాదు లోహర్ కథానాయిక. కతిర్, మిస్కిన్, సంయుక్త విశ్వనాథ్ కీలక పాత్రలు పోషించారు. ఈ సినిమా అన్నపూర్ణ స్టూడియోస్ సంస్థ ద్వారా సెప్టెంబరు 3న థియేటర్లలోకి రానుంది. ఈ నేపథ్యంలోనే ఈ చిత్రం కోసం దుల్కర్ స్వయంగా ఆలపించిన “లూజర్..” గీతాన్ని విడుదల చేశారు. దీనికి జేక్స్ బిజోయ్ స్వరాలు సమకూర్చగా.. సనారె సాహిత్యమందించారు. బెన్నీ దయాల్ ఆలపించారు. “ప్రేక్షకులు మునుపెన్నడూ చూడని స్టైలిష్ ఫాంటసీ థ్రిల్లర్ ఇది. భారీ పోరాట ఘట్టాలు, థ్రిల్లింగ్ ఛేజ్ సీక్వెన్స్‌లతో అందర్నీ కట్టిపడేస్తుంది” అని చిత్ర వర్గాలు తెలిపాయి. ఈ సినిమాకి కూర్పు: చమన్ చాకో, ఛాయాగ్రహణం: జిమ్షి ఖలీద్.

# ఆసియా క్రీడలకు నీరజ్ చోప్రా దూరం



ఆసియా క్రీడల ముంగిట భారత బృందానికి షాక్ తగిలింది. జావెలిన్ స్టార్ నీరజ్ చోప్రా గాయపడ్డాడు. శిక్షణ సమయంలో అతడి చీలమండ లిగమెంట్‌కు గాయమైంది. దీంతో సెప్టెంబరులో జరగనున్న ఆసియా క్రీడలకు దూరం కానున్నాడు. ఈ విషయాన్ని నీరజ్ చోప్రా శనివారం సోషల్ మీడియా ద్వారా తెలియజేశాడు.

“ఎంతో కష్టపడిన తర్వాత లుసానె డైమండ్ లీగ్‌లో ఈ సీజన్‌లో అత్యుత్తమ (88.05 మీటర్లు)త్రోను అందుకున్నట్లు అనిపించింది. దురదృష్టవశాత్తు ఆ తర్వాత కొద్ది కాలానికే శిక్షణ సమయంలో నా చీలమండ వద్ద లిగమెంట్ చిట్లిపోయింది. వైద్యుడితోపాటు నా టీమ్‌తో చర్చించిన అనంతరం ఈ సీజన్‌లో మిగిలిన మ్యాచ్‌లకు దూరంగా ఉండాలని నిర్ణయించుకున్నాను. ఇది నిరాశ కలిగించే విషయం. నా ఆటలో రిథమ్‌ను అందుకునే దశకు చేరుకున్నానని భావిస్తున్న తరుణంలో ఇలా జరగడం బాధాకరం. ఇప్పుడు నా దృష్టి పూర్తిగా కోలుకోవడం, మరింత దృఢంగా తిరిగి రావడంపైనే ఉంది” అని నీరజ్ చోప్రా పేర్కొన్నాడు.

ఈ గాయం కారణంగా సెప్టెంబరు 5న బ్రసెల్స్‌లో జరగనున్న డైమండ్ లీగ్ ఫైనల్‌కు కూడా నీరజ్ దూరంకానున్నాడు. సెప్టెంబరు 11 నుంచి 13 వరకు జరగనున్న ప్రపంచ అథ్లెటిక్స్ అల్టిమేట్ ఛాంపియన్‌షిప్స్‌లోనూ పాల్గొనడం లేదు. ఆసియా క్రీడలు సెప్టెంబరు 19 నుంచి జపాన్‌లో ప్రారంభంకానున్న విషయం తెలిసిందే.

# వైభవ్ సూర్యవంశీ ప్రకటన.. మనసున్నోడివయ్యా అంటూ ప్రశంసలు!

వయసులో చిన్న అయినా .. ఆలోచనలో మిన్న అని నిరూపించుకున్నాడు భారత యువ క్రికెటర్ వైభవ్ సూర్యవంశీ . భారత్ తరఫున అత్యంత పిన్నవయసులోనే అరంగేట్రం చేసి రికార్డు సృష్టించి.. దూకుడే తన మంత్రమంటూ సత్తా చాటాడు. ఇప్పుడు మరో అడుగు ముందుకేస్తూ అభిమానులను ఆకట్టుకున్నాడు. విద్యార్థులకు సాయం చేసేందుకు ముందుకొచ్చాడు.

నిన్న చెప్పాడు.. నేడు ప్రకటించాడు ‘గొప్ప విషయాలు రాబోతున్నాయి.. అలాగే చూస్తూ ఉండండి’ అంటూ తన సోషల్ మీడియా ఖాతాలో వైభవ్ సూర్యవంశీ పోస్టు పెట్టాడు. ఏంటా.. అని అభిమానులు ఆసక్తిగా ఎదురు చూస్తుండగా.. ఇవాళ ఉదయం ఓ ప్రకటన చేశాడు. “నాకు ఎక్స్ ప్లాట్‌ఫామ్ నుంచి వచ్చే ఆదాయాన్ని అవసరమైన విద్యార్థుల చదువుకు




వెచ్చించాలని భావిస్తున్నా. అర్హత కలిగిన వారు సంప్రదించగలరు. పాఠశాల, కళాశాలకు సంబంధించి ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నవారికి సాయంగా ఉంటా. నాకు తోచినరీతిలో మద్దతు ఇచ్చేందుకు ప్రయత్నిస్తా” అని వైభవ్ పోస్టు పెట్టాడు. దీంతో యువ క్రికెటర్‌పై ప్రశంసల వర్షం కురుస్తోంది. చిన్న వయసులోనే ఇంతటి గొప్ప ఆలోచన చేసినందుకు అభినందనలు అంటూ కామెంట్లు చేశారు.

# 51 ఏళ్ల వయసులో ‘ఫైఫర్’.. అంతర్జాతీయ మ్యాచ్‌లో అరుదైన రికార్డు

క్రికెట్‌లో ఐదు వికెట్ల ప్రదర్శన చేయడం కొత్తేమీ కాదు. కానీ, 51 ఏళ్ల వయసులో ఓ క్రికెటర్ ఈ ఫీట్ సాధిస్తే అద్భుతమే కదా.. అదీనూ అంతర్జాతీయ మ్యాచ్‌లో. ఈ ఘనతను ‘ఐస్లే ఆఫ్ మ్యాన్’ జట్టుకు చెందిన జోన్ హిక్స్ అనే మహిళా క్రికెటర్ సాధించింది. ఆటకు వయసుతో సంబంధం లేదని నిరూపించింది. రొమానియా వేదికగా మహిళల కాంటినెంటల్ కప్ జరుగుతోంది. అందులో గ్రీస్‌తో ఐస్లే తలపడింది. తొలుత బ్యాటింగ్ చేసిన గ్రీస్ 15 ఓవర్లలో 52 పరుగులకే కుప్పకూలింది. జోన్ హిక్స్ 10 పరుగులను మాత్రమే ఇచ్చి ఐదు వికెట్లు (ఫైఫర్) తీసింది. ఆమె దెబ్బకు గ్రీస్ జట్టులోని ఒక్కరు మాత్రమే రెండంకెల స్కోరు చేశారు. అనంతరం స్వల్ప లక్ష్య ఛేదనలో ఐస్లే టీమ్ 6 ఓవర్లలోనే ఒక్క వికెట్ మాత్రమే కోల్పోయి 56 పరుగులు చేసి విజయం సాధించింది. 1932 నాటి రికార్డును అధిగమించి..



ఇప్పటి వరకు పురుషుల, మహిళల క్రికెట్‌లో (Cricket History) ఐదు వికెట్ల ప్రదర్శన చేసిన పెద్ద వయసు బౌలర్ రికార్డు ఆస్ట్రేలియాకు చెందిన బెర్ట్ ఐరన్‌మోంగర్ పేరిట ఉండేది. 1932లో దక్షిణాఫ్రికాతో జరిగిన టెస్టు మ్యాచ్‌లో రెండు ఇన్నింగ్స్‌ల్లోనూ ఆయన ఐదు వికెట్ల ప్రదర్శన చేశాడు. అప్పటికి ఆయన వయసు 49 ఏళ్లు. ఇప్పుడు జోన్ హిక్స్ 51 ఏళ్ల వయసులో ఆ రికార్డును బద్దలు కొట్టింది. తన 40వ ఏట మహిళా క్రికెట్‌లోకి అడుగు పెట్టిన హిక్స్ ఆఫ్ స్పిన్నర్‌గా పేరొందింది. ఇప్పటి వరకు 22 అంతర్జాతీయ టీ20ల్లో 33 వికెట్లు పడగొట్టింది.

# ఆ కేసులోని లలిత్ మోదీని నేను కాదు..: ఐపీఎల్ మాజీ ఛైర్మన్



ఓ ఆస్తి వివాదంలో తాను చిక్కుకున్నానని వచ్చిన కథనాలపై ఐపీఎల్ మాజీ ఛైర్మన్ లలిత్ మోదీతీవ్ర అసహనం వ్యక్తం చేశారు. అది తాను కాదని.. తనలాంటి పేరు ఉన్న మరో వ్యక్తి అని లలిత్ మోదీ సోషల్ మీడియాలో పోస్టు పెట్టారు. తప్పును సరిదిద్దుకోవాలని విజ్ఞప్తి చేశారు. అసలేం జరిగిందంటే?

ఢిల్లీలోని వసంత్ విహార్ ప్రాంతంలో బీడీఆర్ బిల్డర్స్‌తో లలిత్ మోదీకి ఆస్తి వివాదం తలెత్తిందని.. కోర్టు కూడా నోటీసులు జారీ చేసినట్లు పలు ఛానళ్లలో ఆయన ఫొటోలతో వార్తలు వచ్చాయి. ఇది తన దృష్టికి రావడంతో లలిత్ మోదీ వివరణ ఇస్తూ పోస్టు పెట్టారు. “ఇక్కడ మీకు ఓ విషయం చెప్పదల్చుకున్నా. వసంత్ విహార్ / బీడీఆర్ బిల్డర్స్ ప్రాపర్టీ వివాదంలో ఉన్న లలిత్ మోదీని నేను కాదు. పలు మీడియా సంస్థలు తప్పుగా ప్రచురించాయి. కోర్టు ఉత్తర్వుల ప్రకారం.. సదరు లలిత్ మోదీ తండ్రి పేరు జేఆర్ మోదీ. ఢిల్లీలోని వసంత్ విహార్ పశ్చిమ మార్గ్ 32 ప్రాంతానికి చెందిన నివాసి. నేను లలిత్ మోదీని. ఐపీఎల్ వ్యవస్థాపకుడిని” అని ఆయన పోస్టు పెట్టారు.

PRINTER, PUBLISHER AND OWNED BY SHANKARAGALLU VENKATESULU, AND PRINTED AT M/S SREE VASAVI PUBLICATIONS#4/38, Main Road, Settur515, 767, Ananthapuram Dist., (A.P)
EDITOR : SHANKARAGALLU VENKATESULU. Email: anantha janasakshi2019@gmail.com, Cell : 9533633213, RNI REGD NO : APTEL/2015/61314